ఈనాడు ప్రకాశం

ఆదివారం 31 డిసెంబరు 2017 | 16 పేజీలు



స్ప్రైట్ ఈసీసీ కప్-2017 క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. జూనియర్స్ విభాగంలో చీరాల పాలిటెక్నిక్ కళాశాల, సింగరాయకొండ మలినేని పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. సీనియర్స్ విభాగంలో వేటపాలెం సెయింట్ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ, చీరాల ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ స్థానం సాధించాయి. మ్యాచ్ ముగిసిన అనంతరం సెయింట్ ఆన్స్ జట్టుతో ఆ కళాశాల విద్యార్థుల ఆనందోత్సాహాల దృశ్యమిది.

-వివరాలు 2లో



మాలకొండయ్య బాధ్యతల స్వీకరణ నేడే

పోలీసు శాఖలో రాష్ట్రస్థాయి అత్యున్నత పదవి అయిన డీజీపీగా మన జిల్లా బిడ్డ మన్నం మాలకొండయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ జిల్లాకే చెందిన ప్రస్తుత డీజీపీ నండూరి సాంబశివరావు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో వరుసగా రెండోసారీ జిల్లా వాసికే అవకాశం దక్కడం విశేషం.

-కథనం 15లో

అక్రమాలపై అక్షర బాణాలు

మధ్యపేజీల్లో....



నీటి కోసం కోటి లెక్కలు!



గిద్దలూరు ప్రాంతంలో తాగునీటి ఎద్దడికి ఇదో నిదర్శనం

- శాశ్వత పరిష్కారానికి రూ. 2200 కోట్లు
- వేసవి గట్టెక్కాలంటే రూ. 150 కోట్లు
- ఇదీ ప్రజాప్రతినిధుల అంచనా
- చిన్నచిన్న పనులపై అశ్రద్ధ

నీటి లెక్కలు సిద్ధమయ్యాయి... జిల్లాలో తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరాలంటే రూ. 2200 కోట్లు అవసరం. ఇదీ జిల్లాలోని ప్రజాప్రతినిధుల అంచనా. జిల్లాలో తాగునీటి కష్టాలపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో... నిధులిస్తారనే ఆశ మొదలైంది. నాయకులు భారీగా ప్రణాళికలు సిద్ధం చేసినా... రూ. లక్షలతో పరిష్కరించే చిన్నచిన్న సమస్యలను విడిచారు...

ఈనాడు డిజిటల్- ఒంగోలు

జిల్లాకు ఎప్పుడూ జలగండమే... పశ్చిమాన నిత్యమూ జల జగడాలే... ఇవి తీరాలంటే నిధుల మూటలు ఇవ్వాల్సిందే. రానున్న ఎన్నికల్లోపు జిల్లాలో తీవ్రమైన మంచినీటి సమస్యను కొలిక్కి తీసుకురావాలనే పట్టుదలతో ఎమ్మెల్యేలు న్నారు. పశ్చిమ నియోజకవర్గాల్లో చుక్క నీరు కూడా ఇవ్వలేని పల్లెలు ఉండగా... తూర్పున వనరులున్నా వినియోగించుకునే పథకాలు కరువయ్యాయి. వీటిని అధిగమిస్తేనే జిల్లాలో నీటి కష్టాలు వీడేది. అందుకే జిల్లాలోని ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల వారీగా తాగునీటి అవసరాలకు భారీ ప్రణాళికలే సిద్ధం చేశారు. శాశ్వత అవసరాలకు ఎంత అవసరం.., ప్రాధాన్యం మేరకు చేపట్టాల్సిన పనులకు ఎంత అవసరం..? తాత్కాలికంగా ఈ

మిగతా 15లో »



విజేతలు సెయింట్‌ఆన్స్, చీరాల పాలిటెక్నిక్



టాస్‌వేసి పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణారావు, కుడివైపున తేళ్ల అశోక్‌కుమార్ తదితరులు



● హోరాహోరీగా సాగిన ఫైనల్స్

● ముగిసిన స్ప్రైట్ ఈసీసీ కప్ - 2017 పోటీలు

వేటపాలెం, న్యూస్‌టుడే: నారాయణ విద్యాసంస్థల సహకారంతో జరుగుతున్న స్ప్రైట్ ఈసీసీ కప్-2017 పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్స్ హోరాహోరీగా సాగడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు జూనియర్స్ విభాగంలో చీరాల పాలిటెక్నిక్ కళాశాల చీరాల విన్నర్స్‌గా, మలినేని పాలిటెక్నిక్ కళాశాల సింగరాయకొండ రన్నర్స్‌గా నిలిచాయి. సీనియర్స్ విభాగంలో సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విజేతగా, చీరాల ఇంజినీరింగ్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సెయింట్‌ఆన్స్ కళాశాల మైదానంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా నారాయణ విద్యాసంస్థల డీఎన్ ఎన్.పిచ్చిరెడ్డి మాట్లాడుతూ నిత్యం మనం అనేక వ్యాపకాల్లో ఉంటామని క్రీడలతో ఎంతో మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఏడాది 'ఈనాడు' నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల వల్ల ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన 'ఈనాడు' యూనిట్ బాధ్యులు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు కూడా విజయం సాధించినట్లేనన్నారు. వీటిని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు . ఇంజినీరింగ్ విద్య అంటే ప్రతి ఒక్కరు బిజీగా ఉంటారని, తమ యాజమాన్యం క్రీడారంగానికి తగినంత ప్రాధాన్యం ఇస్తోందని, తద్వారా ఎంతో ఊరట లభిస్తోందని కళాశాల ప్రధానాచార్యుడు డాక్టరు పి.రవికుమార్ అన్నారు. 'ఈనాడు' భవిష్యత్తులో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించేందుకు యాజమాన్యం కూడా సిద్ధంగా ఉందన్నారు. నారాయణ విద్యాసంస్థల డీన్ ఎన్.పిచ్చిరెడి, సెయింట్‌ఆన్స్ కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, చీరాల కామాక్షికేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్‌లు గెలుపొందిన క్రీడాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అక్రిడేషన్ డైరెక్టరు సీఎస్ రావు, మేనేజరు ఆర్వీ రమణమూర్తి, ఫార్మసీ ప్రధానాచార్యులు డాక్టరు వీవీ నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ పోటీలకు అసోసియేట్ స్పాన్సర్‌గా ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ, రీజినల్ స్పాన్సర్‌గా వీవా, ఆన్‌లైన్ అసోసియేట్‌గా ఈయువ.కామ్, డ్రైవన్‌బై హీరో, జిల్లా ప్రయోజకులుగా సెయింట్‌ఆన్స్ కాలేజ్‌ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వ్యవహరించింది. క్రీడాకారులకు వైద్య సహాయాన్ని చీరాలకు చెందిన శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ అందించింది. ఈ పోటీలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అంపైర్లు, స్కోరర్లు సహకారం అందించారు.



జూనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన అజయ్



సీనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన మణిగోపి



ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్న జూనియర్స్ రన్నర్ అప్ మలినేని జట్టు



జూనియర్స్ విజేత చీరాల పాలిటెక్నిక్ జట్టుకి ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రతినిధులు

చీరాల పాలిటెక్నిక్ విజయం

శనివారం ఉదయం చీరాల పాలిటెక్నిక్ కళాశాల చీరాల, మలినేని పాలిటెక్నిక్ కళాశాల సింగరాయకొండ మధ్య ఫైనల్స్ పోటీ జరిగింది. ఇందులో విజేతగా చీరాల పాలిటెక్నిక్ నిలిచింది. ముందుగా టాస్ గెలిచిన చీరాల పాలిటెక్నిక్ జట్టు నిర్ణీత ఓవర్లలో బ్యాటింగ్ చేసి మూడు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. ఈ జట్టులో అజయ్ ఒక్కడే 40 పరుగులు చేసి జట్టు విజయానికి కృషిచేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన మలినేని జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసి రన్నర్‌గా నిలిచింది.



మైదానంలో విద్యార్థినుల కేరింత



సీనియర్స్ విభాగంలో గెలిచిన సెయింట్‌ఆన్స్ జట్టుకి ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

సెయింట్‌ఆన్స్ విజయకేతనం

మధ్యాహ్నం సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, చీరాల ఇంజినీరింగ్ కళాశాల మధ్య సీనియర్స్ విభాగం ఫైనల్స్ జరిగాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో ఒక్క పరుగు తేడాతో సెయింట్‌ఆన్స్ విజయాన్ని కైవసం చేసుకొంది. రెండు జట్ల మధ్య పోటీల ప్రారంభానికి చీరాల ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్, ప్రధానాచార్యుడు డాక్టరు సయ్యద్ కమాలుద్దీన్, సెయింట్‌ఆన్స్ కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ లక్ష్మణరావు, ప్రధానాచార్యుడు రవికుమార్‌లు విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి పోటీలను కార్యదర్శి వనమా రామకృష్ణారావు ప్రారంభించారు. రెండు జట్ల మధ్య పోటీ ఉత్కంఠంగా జరిగింది. ముందుగా టాస్ గెలిచిన సెయింట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. ఆ తరువాత మైదానంలోకి దిగిన చీరాల ఇంజినీరింగ్ జట్టు హోరాహోరీగా పోరాడింది. ఆరు వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసి ఓటమి చెందింది. విజేత జట్టులో కెప్టెన్ మణిగోపి ఒక వికెట్ తీసి 35 పరుగులు చేసి జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు.



మ్యాచ్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



షోరూం వద్ద గుమిగూడిన చీరాల వాసులు



నూతన చరవాణులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చీరాలలో హెబ్బా పటేల్ సందడి

చీరాల పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు సినీ నటి హెబ్బా పటేల్ శనివారం చీరాలలో సందడిచేశారు. స్థానిక దర్బార్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన బీన్యూ షోరూమ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి చరవాణిలను ఆవిష్కరించారు. షోరూం ముందు ఏర్పాటుచేసిన స్టేజిపై ఆమె కొంతసేపు మాట్లాడి అభిమానులను ఉత్సాహపరిచారు. ప్రేక్షకులకు ముందుగా నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. బీన్యూ సంస్థ ఛైర్మన్ బాలాజీ చౌదరి మాట్లాడుతూ మార్కెట్‌లో పోటీని దీటుగా తట్టుకుని మరింత పురోగతి సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ షోరూంలో రూ.499 నుంచి లక్ష విలువ చేసే అన్ని కంపెనీలకు చెందిన ఫోన్లు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 100 షోరూంలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, చీరాలలోది 38వ షోరూం అని చెప్పారు. సినీనటి రావటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కందుకూరులో కూడా బీన్యూ షోరూమ్ ప్రారంభమైంది.

తెదేపాతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: తెదేపాతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఇంటింటికీ తెదేపా ముగింపు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మండలంలో రైతు రథం పథకం ద్వారా ఇచ్చిన ట్రాక్టరును నడిపారు. నూతనంగా నిర్మించిన వ్యవసాయ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం చెంచుకాలనీలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి గిరిజనుల సమస్యలను, అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. తమకు కేటాయించిన భూమిని కొందరు స్వాధీనం చేసుకున్నారని వారు మంత్రి ఎదుట వాపోయారు. వెంటనే స్పందించిన మంత్రి తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రూ.60 లక్షలతో కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రైతులకు రాయితీపై రైతు రథం పథకం ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ సామగ్రి ఇస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ కానటువంటి రైతుల కోసం జిల్లాకో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి రైతుల నుంచి అర్జీలు తీసుకుని రుణమాఫీ చేశామన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే డేవిడ్‌రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుని వెంటనే వెలుగొండను పూర్తి చేస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు సత్వరమే పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. పంట నష్టం అంచనాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచి నాగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రిబ్కా, నాయకులు కందుల రామిరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెంచు గిరిజనులతో మాట్లాడుతున్న మంత్రి


సుబ్బులు మృతదేహం ఊరేగింపు


ఇళ్ల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలు

భారీ బందోబస్తు నడుమ..
సుబ్బులు అంత్యక్రియలు

▸ గవినివారిపాలెంలో పోలీసు పికెట్ ▸ ఇద్దరు డీఎస్పీల పర్యవేక్షణ

చీరాల, చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే : మాజీ సర్పంచి వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన దేవర సుబ్బులు మృతదేహానికి శనివారం గవినివారిపాలెంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. గ్రామంలో ఉద్రిక్తతల నడుమ పోలీసుల పహారాతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఇద్దరు డీఎస్పీలు పర్యవేక్షించారు. దీంతో నాలుగు రోజులుగా సాగుతున్న ఉద్విగ్న పరిస్థితులకు తెరపడింది.


ఉదయం నుంచే ఉద్రిక్తత

శుక్రవారం రాత్రి ఆర్డీవో కె.శ్రీనివాసరావు మృతురాలి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని అర్ధరాత్రి ట్రాక్టర్‌పై చీరాల నుంచి గవినివారిపాలెం తరలించారు. గ్రామ పొలిమేర్లలో కొందరు సర్పంచి వర్గీయులు అడ్డుకోవటంతో పోలీసులు జోక్యం చేసుకొని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈ సమయంలో సర్పంచి వర్గీయులు కూడా గ్రామంలో పెద్దసంఖ్యలో మోహరించారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. మొదట సుబ్బులు మృతదేహాన్ని ఆమె సొంత స్థలంలో ఖననం చేయటానికి బంధువులు ఏర్పాట్లు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన శ్మశానంలోనే ఈ తంతు పూర్తిచేయాలని స్పష్టంచేశారు. దీనిపై కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. రాత్రి ఆర్డీవోతో మాట్లాడినపుడు మా స్థలంలో ఖననం చేయడానికి అనుమతించారని, తీరా ఇప్పుడు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని ప్రశ్నించారు. దీంతో కొంత వాగ్వాదం నడిచింది. చివరకు బంధువులు సర్దిచెప్పటంతో శ్మశానంలో అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఇంటి నుంచి ఊరేగింపుగా మృతదేహాన్ని తీసుకెళ్లి పూర్తి చేశారు.

గ్రామంలో పోలీసు పహారా

ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో పోలీసులు గవినివారిపాలెంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు చేపడుతుండడంతో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. డీఎస్పీ ప్రేమ్‌కాజల్ ఆధ్వర్యంలో సీఐలు సూర్యనారాయణ, భక్తవత్సలరెడ్డి, రామారావులతోపాటు ఎస్సైలతోపాటు స్థానిక సిబ్బంది, ప్రత్యేక బలగాలు గ్రామంలో ఉండి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. కందుకూరి డీఎస్పీ పరిస్థితి సమీక్షించారు. మృతురాలి ఇంటితోపాటు సర్పంచి వర్గీయుల ఇళ్ల వద్ద కూడా పోలీసులు మోహరించి ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముందస్తు చర్యలలో బాగంగా గ్రామంలోని అనుమానితుల ఇళ్ల వద్ద తనిఖీలు చేపట్టారు.

పెద్దపులి సంచారంతో బెంబేలు


ఊడుగుల మడుగు ప్రాంతంలో అధికారులు గుర్తించిన పులి అడుగులు

చోళ్లవీడు (రాచర్ల) న్యూస్‌టుడే : నల్లమల అడవిని ఆనుకుని ఉన్న చోళ్లవీడు, చినగానిపల్లి ప్రాంతాల్లో పెద్దపులి సంచారంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. నాలుగు రోజుల క్రితం చోళ్లవీడుకు చెందిన ఆకుల పెద్ద వేమయ్యకు చెందిన ఆవుపై పులి దాడి చేసి చంపేయడం తెలిసిందే. గురువారం ఊడుగల రేవు, రేగుమాను రేవు ప్రాంతంలో ఆవు కళేబరాన్ని గుర్తించారు. శుక్రవారం మరోసారి వెళ్లే సరికి ముందు రోజు చూసిన ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కళేబరం మారిన విషయాన్ని అధికారులు, రైతులు గుర్తించారు. దీంతో గుండ్లబ్రహ్మేశ్వర రిజర్వాయర్ పరిసరాల్లో చోళ్లవీడు రైతులు సుమారు వంద ఎకరాలలో మొక్కజొన్న, పుచ్చకాయలు సాగు చేశారు. వారి భూములకు సుమారు 300 నుంచి 400 మీటర్ల దూరంలో పులి సంచారం ఉండటంతో రైతులు పంటలకు రాత్రి కావలి వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి పులిని అడవిలోనికి చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యం


అంజన్న (పాత చిత్రం)

మద్దిపాడు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌కు చెందిన బాలుడు గ్రోత్‌సెంటర్‌లో అదృశ్యమయ్యాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా పెదచింతకుంటకు చెందిన ఎరుకలి చినకూర్మన్న అనే వ్యక్తి తన కుమారుడు అంజన్నతో కలిసి గొర్రెలను తీసుకొని కావలి వెళ్తున్నారు. ఈ నెల 11న గ్రోత్‌సెంటర్ చేరుకున్నారు. రాత్రి... గ్రోత్‌సెంటర్‌లోకి గొర్రెలను తోలి అక్కడే నిద్రపోయారు. ఉదయం లేచిచూడగా... అంజన్న కనిపించలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు బాలుడి తండ్రి చినకూర్మన్న ఫిర్యాదు చేయడంతో... కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: కారు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. సంతనూతలపాడులోని మద్దిపాడు ఏఎంసీ సమీపంలో శనివారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా తెలిపిన వివరాల మేరకు... కృష్ణసాయి గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్న ఆంజనేయులు అనే కార్మికుడు అల్పాహారం తినేందుకు కర్నూలు రహదారిలో నడిచి వెళ్తున్నారు. అదే సమయంలో ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు కారు వెళ్తోంది. పొగమంచు కారణంగా రహదారి సరిగా కనిపించక... రోడ్డు పక్కగా నడుస్తున్న ఆంజనేయులును కారు ఢీకొంది. దీంతో ఆయన పక్కనే ఉన్న చిల్ల చెట్లలో పడి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


చిల్లచెట్లలో పడిపోయిన ఆంజనేయులు

కందుకూరులో నెల్లూరు యువకుడి బలవన్మరణం


మోహన్‌రెడ్డి (పాత చిత్రం)

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన కందుకూరు పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా పొదలకూరుకు చెందిన నెల్లూరి మాలిరెడ్డి, సుజాత దంపతుల కుమారుడు మోహన్‌రెడ్డి(26). అతని చిన్నతనంలోనే తండ్రి మాలిరెడ్డి మృతిచెందారు. తనను పెళ్లి చేసుకోవాలంటూ కందుకూరులో ఉంటున్న బంధువైన ఓ వివాహితను మోహన్‌రెడ్డి కొద్దికాలంగా వేధింపులకు తరచూ గురి చేస్తున్నాడు. ఆమె పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వేధింపుల విషయమై సదరు మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు గతంలో అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే మోహన్‌రెడ్డికి సంవత్సరం క్రితం అదే గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. అయితే అతని ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో పెళ్లైన రెండు నెలలకే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం అతను జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్లి అక్కడ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇరవై రోజుల క్రితం తిరిగి స్వగ్రామం వచ్చాడు. కందుకూరు పట్టణంలో ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బంధువైన వివాహిత పాఠశాల వద్దకు శనివారం ఉదయం వచ్చాడు. తనతో రావాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు ఆమె తిరస్కరించడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి పాఠశాల వద్దకు వెళ్లి అక్కడ తనతోపాటు తెచ్చుకున్న పురుగుల మందును తాగి బలవన్మరణానికి ప్రయత్నించాడు. విషయాన్ని గమనించిన పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని అతన్ని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మోహన్‌రెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లి సుజాత కందుకూరు ఆసుపత్రి వద్దకు చేరకున్నారు. కుమారుడి మృతి వార్త విని గుండెలవిసేలా రోదించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించటంతో మోహన్‌రెడ్డిని అల్లారు ముద్దుగా పెంచానని.. తమకు ఆదరవుగా ఉంటాడనుకుంటే ఇలా మధ్యలోనే ఏకాకుల్ని చేసి వెళ్లిపోయాడంటూ ఆమె దీనంగా కన్నీరు మున్నీరయ్యారు.


వైద్యశాలలో మోహన్‌రెడ్డి మృతదేహం


తల్లి సుజాత నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రైలు కిందపడి వ్యక్తి మృతి

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలంలోని బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి రైలు దిగుతూ ప్రమాదవశాత్తు పడి గాయపడిన మంజునాథ్‌రెడ్డి నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ప్రాణాలు కోల్పోయారు. అతను చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన మంజునాథరెడ్డిగా గుర్తించి మృతదేహాన్ని కూడా కుటుంబసభ్యులకు అప్పగించినట్లు కావలి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా సూరారెడ్డిపాళెంలో తిరుపతి వెళ్లేందుకు టిక్కెట్ కొనుగోలు చేసి పొరపాటున బిట్రగుంట వరకు వచ్చే 57242 పాసింజర్ రైలు ఎక్కారు. బిట్రగుంట చేరిన రైలు షంటింగ్ కోసం కదులుతున్న సమయంలో పొరపాటున ఎక్కానని తెలుసుకొని దిగబోతుండగా చక్రాల కిందకు పడి గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిద్దలూరు


బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్మన్ హరిబాబు, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి

రాచర్ల, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలు గ్రామస్థాయిలో తెలుసుకుని వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం 5వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి జి.నాగేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం రాచర్ల మండలపరిషత్ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులతో సమావేశం అయ్యారు. ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, తహసీల్దారు కె.ఎలిజబెత్‌రాణి, ఎంపీపీ రెడ్డి లక్ష్మీదేవి, జడ్పీటీసీ బి.నాగరత్నం, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల నీటి ఖర్చు రూ. 48 లక్షలు


● ప్రయివేటు శుద్ధజలాలే దిక్కు ● గిద్దలూరు నగర పంచాయతీలో రక్షిత నీరు కరవు ● కుటుంబానికి రూ.400 అదనపు భారం


వాడుక నీటికోసం... యాదవవీధిలో డ్రమ్ముల్లో నీటినిల్వ

గ్రామీణానికి సురక్షిత తాగునీరందిస్తే చాలావరకూ రోగాలను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించినా... గిద్దలూరు నగర పంచాయతీలో నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో జనం వ్యాధులబారిన పడుతున్నారు. పాలకులు, అధికారులు వేసవిలో ట్యాంకర్లు, మిగిలిన సమయాల్లో డీప్‌బోర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా ఆ నీటిలో ఫ్లోరైడ్, లవణాల శాతం అధికమని తేలింది. ప్రజలు ఆ నీటిని తాగేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రతి కుటుంబం నెలకు రూ.400 వంతున చెల్లించి ప్రవేటు శుద్ధ జల కేంద్రాల నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది నెలకు రూ. 48 లక్షల పైమాటే.

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే

గిద్దలూరు నగర పంచాయతీలోని 20 వార్డుల్లో సుమారు 12 వేల కుటుంబాలు ఉండగా... నెలకు తాగునీటికి ఒక్కో కుటుంబం రూ. 400 వంతున ఖర్చు చేస్తున్నారు. అంటే నెల ఖర్చు రూ. 48 లక్షల పైమాటే. నగర పంచాయతీ ప్రజలకు తాగునీటి సరఫరాకు 144 పైగా డీప్‌బోర్లుండగా ప్రస్తుతం 102 మాత్రమే పనిచేస్తున్నాయి. వేసవికాలంలో కేవలం 25 డీప్‌బోర్లే నీరిస్తాయి. దీంతో రాచర్ల గేటు రహదారి ప్రాంతంలోని అన్ని వీధులు, కొన్ని ఇతర ప్రాంతాలకు నేటికీ ట్యాంకర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు.


శుద్ధ జలాన్ని కొనుగోలు చేసుకొని ఇంటికి...

❖ పట్టణ డీప్‌బోర్లు ఎక్కువశాతం 450- 800 అడుగుల లోతున ఉండటంతో ఆ నీటిని ప్రజలు నేరుగా తాగేందుకు వీలులేదు. దీంతో ప్రజలు ప్రయివేటు శుద్ధ జల కేంద్రాల్లో నీటిని కొనుగోలు చేసుకుని... ఆటోలు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లు ఇతర వాహనాలపై ఇళ్లకు తీసుకెళుతున్నారు.

❖ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద రెండేళ్లగా ప్రభుత్వం దాతల సహకారంతో శుద్ధజలం అందజేస్తున్నా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల అది సాకారం కాలేదు. విధిలేక ప్రయివేటు వ్యక్తుల వద్ద నీటిని కొనుగోలు చేస్తున్నా... అది ఎంతవరకూ సురక్షితమో చెప్పలేని స్థితిని సైతం వీరు పట్టించుకోవడం లేదు.


సైకిల్‌పై తీసుకెళుతున్న దృశ్యం

నెలకు రూ.400 వెచ్చిస్తున్నాం

- ఎడవల్లి నారాయణ, కూలి, గిద్దలూరు



రాచర్ల రహదారి హోసన్నా ప్రార్థనామందిరం సమీపాన ఉంటున్నా. రోజూ తోపుడు బండి వేసుకొని ఇస్త్రీ చేసుకుంటే తప్ప కుటుంబ గడవదు. మూడేళ్లగా ట్యాంకర్ల ద్వారా కలుషిత నీటినే సరఫరా చేస్తున్నారు. అది తాగి రోగాల బారిన పడకుండా నెలకు రూ. 400తో కొనుగోలు చేసి నీటి తాగుతున్నాం.

ప్రతి వార్డులో శుద్ధజల కేంద్రాలు కావాలి

- టి.వీరాంజనేయులు, ఉపాధ్యాయుడు, గిద్దలూరు

నగర పంచాయతీలో ప్రభుత్వం తరపున ఒక్క నీటి శుద్ధ జల కేంద్రం లేదు. అధికారులు సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు వీలులేదు. ప్రయివేటు శుద్ధ జలకేంద్రాలపై వారి పర్యవేక్షణ లేదు. గత్యంతరం లేక ఆ నీరే తాగుతున్నాం.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

- పి.కృష్ణమూర్తి, కమిషనర్, గిద్దలూరు

నగర పంచాయతీలో గత కొన్నేళ్లుగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలంలో కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలందరికీ నీటిని అందించాల్సిన బాధ్యత మాదే. నగర పంచాయతీలో నీటి శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : స్థానిక బాలుర, బాలికల, పిటికాయగుళ్ల ఉన్నత పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు పేర్కొన్నారు. స్థానిక బాలుర, బాలికల హైస్కూళ్లను శనివారం పరిశీలించారు. మౌన వ్రతంలో ఉన్న ఆయన పలు విషయాలను పేపరుపై రాసి చూపించారు. బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని పరిశీలించారు. మద్యం దుకాణంతో ఏర్పడే ఇబ్బందులను ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. ఆట స్థలం అభివృద్ధి పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మూడు బడుల అభివృద్ధికి రూ. 25 లక్షలు మంజూరు చేయాలని జడ్పీటీసీ సభ్యుడు ఐజయ్య కోరగా అంగీకరించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన లెక్కలు సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను ఆలకించారు. ఎంపీపీ ఓసూరరెడ్డి, ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధవీడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు అన్నారు. శనివారం మండలంలోని దొనకొండ జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు. దొనకొండ జడ్పీ పాఠశాలకు తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.లక్షతో డీప్ బోరు మంజూరు చేశారు. 50 మీటర్ల ప్రహరీ నిర్మాణానికి నిధులిస్తామన్నారు. పాఠశాల మైదానం అభివృద్ధికి ఉపాధిహామీలో రూ. 3.50 లక్షలు మంజూరవడంతో భూమి పూజ చేశారు. ఎంపీపీ రవికుమార్ యాదవ్, గ్రామ సర్పంచి వెంకటసుబ్బమ్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు

జేపీచెరువు (రాచర్ల) న్యూస్‌టుడే : నెమలిగుండ్ల రంగనాయకస్వామికి శనివారం ఉదయం అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. 8గంటలకు అష్టోత్తర శతనామావళి పూజ, మహానివేదన, మంగళ హారతి అనంతరం నిత్యపూజలు జరిపారు. ఉదయం 10 గంటలకు తిరుప్పావై చేశారు. స్వామికి మొత్తం రూ. 54,194 ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జీపీ సత్యనారాయణ, ఛైర్మన్ బి.గాలయ్య, పాలక మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు. కాశినాయన సత్రంలో నరశింహునిపల్లికి చెందిన పోసిన పాండురంగారెడ్డి, గోపాలకృష్ణ సత్రంలో జేపీచెరువుకు చెందిన సాదం చిన్నరంగస్వామి, సుబ్బమ్మ, శ్రీకృష్ణదేవరాయ సత్రంలో చోళ్లవీడుకు చెందిన పగిడి బాలయ్య కుమారుడు రంగారావు, ఆర్యవైశ్య, యోగివేమన సత్రాల్లో ఉభయ దాతలు అన్నసంతర్పణ చేశారు.

ఉత్తీర్ణత పెంపునకు కృషి

రాజుపాలెం (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే : పదోతరగతి ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేస్తున్నట్లు రాజుపాలెం కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారిణి గుర్రం రోజ్ సులోచన తెలిపారు. బేస్తవారపేటకు చెందిన చేయూత మిత్ర మండలి అందించిన పదో తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను శనివారం పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత కోసం ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయనులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారిణి సులోచన

దాతల సాయం మరువలేనిది

అర్ధవీడు, న్యూస్‌టుడే : దాతల సాయం మరువలేనిదని సీడీపీవో ధనలక్ష్మి అన్నారు. కంభంకు చెందిన దాత రమణ సమకూర్చిన నిధులతో బొమ్మిలింగం చెంచు కాలనీలోని చెంచుల కుటుంబాలకు శనివారం పౌష్టికాహారం అందజేశారు. చెంచుల అభివృద్ధికి దాతలు చేయూతనివ్వాలని, చిన్నారుల ఆరోగ్యానికి తోడ్పాటు అందించాలని విన్నవించారు. అనంతరం చెంచు కాలనీలో ఉన్న బాలికలు చదువు కొనసాగించేందుకు సమీప వసతి గృహాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులతో మాట్లాడారు. వివరాలు సేకరించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు కృష్ణకుమారి, కార్యకర్తలు, చెంచులు పాల్గొన్నారు.


చెంచులతో మాట్లాడుతున్న సీడీపీవో ధనలక్ష్మి

అంబేడ్కర్ కృషి ఫలితమే ఈ గౌరవం

సూరెపల్లి (కంభం), న్యూస్‌టుడే : ప్రపంచ మేధావి డాక్టర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు సమాజంలో మంచి గౌరవం పొందుతున్నామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శి సుబ్బారావు అన్నారు. ఆయన ఆశయంతో ఉద్యోగాలు సాధించిన వారంతా జన్మనిచ్చిన గడ్డకు ఉపయోగపడాలని కోరారు. శనివారం సూరెపల్లి ఎస్సీ కాలనీలో షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు అధ్యక్షతన పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గ్రామంలో పేదలకు అవసరమైన నివేశన స్థలాలు, మంచినీటి వసతి, శ్మశాన వాటిక స్థల సేకరణ అంశాల్లో వారికి ఇబ్బందులు లేకుండా చేయాలని తహసీల్దారు ఉషారాణికి విన్నవించారు. పలువురు వివిధ రకాల సమస్యలపై వినతులు అందించారు. ఎంపీడీవో గాలెయ్య, ఎంఈవో మాధవకృష్ణారావు, గృహనిర్మాణశాఖ ఏఈ సురేష్‌బాబు, ఏపీవో ఏడుకొండలు, ఏఎస్‌డబ్ల్యూవో టైటస్, డీటీ జితేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నఓబినేనిపల్లి (బేస్తవారపేట) : పౌరుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని చిన్నఓబినేనిపల్లి ఎస్సీ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఐ అనిల్, సర్వేయర్ రామస్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమీషన్ కార్యదర్శి సుబ్బారావు

పరివర్తకాల చుట్టూ రక్షణ కంచెలకు వినతి

కొమరోలు, న్యూస్‌టుడే : మండల పాఠశాలల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు పరివర్తకాల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. మండల కార్యాలయాల రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈఈ సుబ్బారెడ్డి చెప్పారు. ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఏఈ ముత్యాలనాయుడు మాట్లాడుతూ రక్షణ కంచె సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ల పంపిణీకి కొత్తట్యాబ్‌లు కొనుగోలు చేసి ఇవ్వాలని ఎంపీడీవో డి.నర్సయ్య కోరారు. కొందరు రైతులకు ఇంతవరకూ పంట పరిహారం అందలేదని మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు డీసీ హెచ్ ఆంజనేయులు అన్నారు. ఏవో మెర్సీ, ఉద్యానవన శాఖాధికారిణి ప్రత్యూష, ఏపీవో షారోన్ పుష్పారాణి, పశువైద్యాధికారిణి వి.అనూష, సర్వశిక్ష అభియాన్ ఏఈ రాంభూపాల్‌రెడ్డి, కొమరోలు సర్పంచి షేక్ అబ్దుల్‌ఖాదర్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు

తెరపై ఈనాడు

గిద్దలూరు పట్టణం: వెంకటేశ్వర - ఎస్‌సీవీ, నటరాజ్‌- 2 కంట్రీస్‌ కృష్ణ - హలో, శ్రీనివాస - ఒక్క క్షణం, బేస్తవారపేట : కళ్యాణి - ఎంసీఏ, ఊర్వశి - హలో , కంభం: వెంకటేశ్వర : హలో! , స్టార్‌ : 2 కంట్రీస్‌, విక్టరీ : ఎంసీఏ

బలహీనవర్గాల అభ్యున్నతికి తెదేపా కృషి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తెదేపా ప్రభుత్వం పాటుపడుతోందని ఎమ్మెల్యే ఎం. అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం ఉదయం నగర పంచాయతీలోని 9,10వ వార్డుల్లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. నగరి అభివృద్ధికి ప్రభుత్వం రూ. 14.56 కోట్లు చేసిందని తెలిపారు. నగర పంచాయతీలో పార్కులు, రహదారులను అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నగర పంచాయతీతో పాటు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో చేపట్టిన సంక్షేమ పథకాల శిలాఫలకాలు ఆవిష్కరించారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు బండారు వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యక్షురాలు పాలుగుళ్ల శ్రీదేవి, పట్టణ తెదేపా అధ్యక్షుడు మస్తాన్‌వలీ, కార్యదర్శి కమతం శ్రీనివాసులు, కౌన్సిలర్‌ షేక్‌ రహమత్‌బీ, నాయకులు దప్పిలి కాశిరెడ్డి, పోలెపల్లె శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతినగర్‌ (గిద్దలూరు పట్టణం), న్యూస్‌టుడే : నూర్‌బాషా కులం విద్యార్థులకు మైనార్టీ సంక్షేమ ఫలాలు అందించేలా చూడాలని గ్రీన్‌ లైఫ్‌ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే ఎం. అశోక్‌రెడ్డిని కలిసి విన్నవించారు. నూర్‌బాషా విద్యార్థులకు విద్యార్థుల బదిలీ పత్రాల్లో ఇండియన్‌- హిందూ అని రాయడం వల్ల మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా ఉన్నత విద్యకు అందించే అవకాశాలను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు, కృష్ణ, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో నూర్‌బాషా కులాలకు చెందిన విద్యార్థుల బదిలీ పత్రాల్లో ఇండియన్‌ ఇస్లామ్‌ దూదేకుల అని రాయడంతో వారు మైనార్టీ సంక్షేమ సంఘం పథకాలను పొందగలుగుతున్నారన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు తమ వినతిని తెలియజేసి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే కలెక్టర్‌కు సమస్యను తెలియజేసి, న్యాయం చేసేలా కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. సంస్థ అధ్యక్షుడు సుల్తాన్‌ హజరత్‌ ఖాజా, నాయబ్‌, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ తెదేపా కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్‌లైఫ్‌ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు

నేడు భవిష్యత్తు ప్రణాళికపై చర్చ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : నరవ రహదారిలోని వైకాపా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఐ.వి. రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలో భవిష్యత్తు ప్రణాళికపై చర్చిస్తామని వైకాపా రాష్ట్ర జాయింట్‌ సెక్రటరీ డా. సీహెచ్‌. రంగారెడ్డి తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తామన్నారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండల అధ్యక్షులు చక్కెర బాలనాగిరెడ్డి, జబ్రుల్లా ఖాన్‌, జనార్దన్‌రెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొండా తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా పథకాలు

రాచర్ల: గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందని పేద మహిళలకు ప్రభుత్వ పథకాలు చేరువ చేసేందుకు సాధికార మిత్రల రూపంలో మహిళలకు అవకాశం లభించిందని మండల ప్రత్యేకాధికారి జి.నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాధికార మిత్రల శిక్షణ ముగింపు పాల్గొన్నారు. ఎంపీడీవో మస్తాన్‌వలి, ఏపీఎం రఘునాథబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, రిసోర్స్‌పర్సన్స్‌ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

బేస్తవారపేట, న్యూస్‌టుడే : రాణిపేటలోని ఫ్రెండ్‌ ఇన్‌ నీడ్‌ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేదలకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఎంపీపీ ఓసూరారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు వజయ్య, మండల ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, పోసా శేఖర్‌, సత్తెలి కృష్ణ, డాక్టర్‌ రంగారావు, మాబు, ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెదురు పట్టివేత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో శనివారం ఉదయం 8 గంటలకు రైల్వే పోలీసులు 57305 రైల్లో అక్రమంగా తరలిస్తున్న వెదురు బొంగులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆర్‌పీఎఫ్‌ ఎస్‌ఐ నాగభూషణం గిద్దలూరు అటవీశాఖ అధికారికి అప్పజెప్పారు. ఆర్‌పీఎఫ్‌ కానిస్టేబుల్‌ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : డీఎడ్‌ పరీక్షల్లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని ఉప విద్యాశాఖాధికారి కాశీ ఈశ్వరరావు పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహిస్తున్న బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను శనివారం పరిశీలించారు. ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. బాలికల బడిలో 162 మందికి 154 మంది, బాలుర హైస్కూల్‌లో 184కు 171 మంది హాజరయ్యారు. ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు, చీఫ్‌ సూపరింటెండెంట్లు తిరుపతిరెడ్డి, అమూల్యా, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

టమోటా- 10, పచ్చిమిర్చి- 35, దొండకాయలు- 20, బంగాళదుంపలు- 20, బెండ- 30, బీట్‌రూట్‌- 50.

గ్యాస్‌ సమాచారం

గిద్దలూరు పట్టణం: విష్ణునారాయణ గ్యాస్‌ ఏజెన్సీలో డిసెంబరు 30న నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తారు.

● శ్రీరామ భారత్‌ గ్యాస్‌ ఏజెన్సీలో డిసెంబరు 30న నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తారు. అర్ధవీడు:న్యూస్‌టుడే: జగదీష్‌ ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీలో ఈ నెల 30 వరకు నమోదు చేసుకున్న వారికి సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకుడు రఘురామ్‌రెడ్డి తెలిపారు. బేస్తవారపేట: అనితా ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీలో ఈనెల 23 వరకు నమోదు చేసుకున్న వారికి ఆదివారం సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకురాలు దేవదానమ్మ తెలిపారు. కంభం: స్థానిక రంగా ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ పరిధిలో ఈ నెల 27 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు నిర్వాహకురాలు కనకదుర్గాదేవి తెలిపారు.

నూతన సంవత్సరానికి ఆహ్వానం

కంభం, న్యూస్‌టుడే : కంభం పబ్లిక్‌స్కూల్‌లో 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2018 సంవత్సరానికి స్వాగతం పలికిన విద్యార్థులు 2018 సంఖ్యగా ఏర్పడి స్వాగతం పలికారు. కేక్‌ కోసి ఆనందంగా గడిపారు. కరస్పాండెంట్‌ రావూరి జనార్దన్‌రావు, ప్రిన్సిపాల్‌ బిందు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌, డైరీ ఆవిష్కరణ

కంభం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ కార్యదర్శి సుబ్బారావు, షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు ముత్తన్న శనివారం రాత్రి మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశపు హాలులో నూతన సంవత్సర క్యాలెండర్‌, డైరీని ఆవిష్కరించారు. షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యం వహించారు. ఎంపీడీవో గాలెయ్య, డాక్టర్‌ రంగారావు, సర్పంచి స్టార్‌ బాషా, ఎంపీటీసీ సభ్యుడు హనీఫ్‌ అహమ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం ఆధ్వర్యంలో...

కంభం, న్యూస్‌టుడే : కాపు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ ఎదుర్లు రామచంద్రరావు శనివారం రాత్రి కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల బలిజ సేవా సంఘ అధ్యక్షుడు తులసీప్రసాద్‌, కార్యదర్శి పార్థ శంకర్‌, న్యాయవాది రామ్మోహన్‌, కె.పాండు, ఆలిండియా కాపు ఫెడరేషన్‌ ఉద్యోగుల ఉపాధ్యక్షుడు పులి విజయభాస్కర్‌, కార్యదర్శి దేవిరెడ్డి నాగేంద్రుడు, నీటి సంఘం అధ్యక్షులు బాలకోటయ్య ఉపాధ్యాయులు, మూడు మండలాల కాపు సోదరులు పాల్గొన్నారు.

కంభం : చిన్న మసీదు వద్ద శనివారం మూమెంట్‌ ఫర్‌ పీస్‌ అండ్‌ జస్టిస్‌ 2018 నూతన క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు ఎస్‌.ఏ.రజాక్‌ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యదర్శి కరీముల్లా, కోశాధికారి కరీంబాషా, సభ్యులు పాల్గొన్నారు.

జేపీచెరువు (రాచర్ల): నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలని ప్రధానోపాధ్యాయులు ఎన్‌.ప్రభుదాసు అన్నారు. గ్రామ ఆదర్శ పాఠశాలలో 2017 సంవత్సరానికి వీడ్కోలు, నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను తల్లిదండ్రులు చక్కని ప్రణాళికతో చదివించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటుఅందించాలని కోరారు. విద్యార్థులు, సాంస్కృతిక, నృత్య, నాటక ప్రదర్శనలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. వీటిని రూపొందించిన ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసులును అంతా అభినందించారు. ఎస్‌ఎంసీ ఛైర్మన్‌ శేషిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

EENADU THE WAY CLASSIFIEDS

AGRIBUSINESS



ప్రముఖ కంపెనీకి చెందిన శ్రీగంధం, మలబారువేప, త్రైవాన్‌జామ లభించును. మా ప్రత్యేకత 2 సం॥ సర్వీసు & రీప్లేస్‌మెంట్ ✆ 81850 37777, 97055 99599.

AUTOMOTIVE



VEHICLES FOR SALE

2017 NEW ASHOK Leyland 51 Seaters 15,25,000/-. 2011 Leyland 210 Wheel Base 51 Seater 7,95,000/-. 2012 Swaraj Mazda 32 Seaters 6,95,000/-. Finance 75% available. ✆ 95333 31111.

ప్రకాశం జిల్లాలోని ఒక ప్రముఖ స్కూలు నందు 2014 మోడల్ రన్నింగ్ కండిషన్ గల 36 సీట్ల టాటా మార్కోపోలో స్కూలు బస్సు అమ్మబడును. Cont: 9642164119, 9666042243.

BUSINESS SERVICES



WANTED DEALERS/AGENTS


TV11 న్యూస్ చానల్ డెవలప్‌మెంట్ కొరకు సీమాంధ్రలో ఫైనాన్షియల్ పార్టనర్ కావలెను. ఆసక్తి ఉన్నవారు మాత్రమే ✆ 9390888606/ 8142322214

BUSINESS OFFER

అతితక్కువ పెట్టుబడితో ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మిషన్లు కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం. కుమార్ ఎంటర్‌ప్రైజెస్, Rjy. ✆ 93933 32227, (నో ఛార్జెస్).

LED Lights తయారుచేస్తూ రోజూ అధిక ఆదాయం సంపాదించండి. రా మెటీరియల్ ఫ్రీ. బైబ్యాక్ అగ్రి 2yrs. No Processing Fee ✆ 7840075254/ 7210864919

BUILDING & CONSTRUCTION



వజ్ర కన్‌స్ట్రక్షన్స్: అపారమైన అనుభవం కలవారు ఇండిపెండెంట్ ఇల్లు/ డూప్లెక్స్ ఇల్లు, అపార్ట్‌మెంట్స్, స్కూల్స్, కాలేజీలు, ఇండస్ట్రీలు, హాస్పిటల్స్ ఎలాంటి కట్టడాలైనా అన్ని మెటీరియల్‌తో సహా కన్‌స్ట్రక్షన్ చేయగలము సం॥: 8328302229.

WATER PROOFING

బాత్‌రూమ్ లీకేజ్ గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్‌క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్ లీక్, వాల్‌క్రాక్స్, ఎటువంటి లీకేజైనా 100% గ్యారంటీతో కెమికల్‌గా చేయగలము.✆ 96424 58892.


COMPUTER EDUCATION



NDS Academy Free Computer Basics C and C++ Training and Placement assistance Mob. 7660829288.

AP.Govt ఉచితంగా కంప్యూటర్ టాలీ, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించి జాబ్ కల్పించబడును. ఉచిత భోజన హాస్టల్ వసతి కలదు. K.K. కంప్యూటర్స్, ఒంగోలు. 9441903162.

EDUCATION



శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫైర్ & సేఫ్టీ, ల్యాండ్ సర్వే, JCB, ప్రొక్లెయిన్, క్రేన్, ఫోర్క్ లిఫ్ట్, వెల్డింగ్, A/C మెకానిక్, ఆపరేటర్ ట్రైనింగ్స్ ఇవ్వబడును. కోర్సు అనంతరం జాబ్ లభించును. హస్టల్, ఫుడ్ ఫ్రీ. రైల్వేస్టేషన్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ ATM పైన రాజమండ్రి. ✆ 99668 41177.

B.Lisc మరియు M.Lisc Feb-18 లో జరుగు Exams కు అడ్మిషన్లు జరుగుచున్నవి. పాస్‌గ్యారంటీ రాఘవ డిగ్రీ కాలేజ్ లాయర్‌పేట, ఒంగోలు. 9160976207.

COACHING CENTRES

ఆర్మీ, AOC, Ammunition డిపోలో సివిల్ జాబ్స్, ఎయిర్ ఫోర్స్ నేవీ, ఆర్మీ, కోస్ట్ గార్డు, RPF సెంట్రల్ పోలీస్ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వబడును. హస్టల్ వసతి కలదు. సర్దార్‌పటేల్ డిఫెన్స్ అకాడమి గిద్దలూరు, కర్నూలు, హైదరాబాద్. 9849763968, 9374029739.

ఫైర్ & సేఫ్టీలో ఫైర్‌మెన్ ఫైర్ ఆఫీసర్ డిప్లొమా కోర్సుతో పాటు ప్లేస్‌మెంట్ చూపబడును. ఆర్మీ AOC Ammunition డిపోర్ట్‌లో ప్లేస్‌మెంట్ జాబ్స్ కలవు. ఫైర్ & సేఫ్టీ కాలేజీ గిద్దలూరు, హైదరాబాద్. 9849763968.

DISTANCE EDUCATION

BNYS, BPT, B.Sc, MLT, DMLT, all Para Medical Cources and all Degrees & P.G 100% pass ✆ 89773 59598.

UG & PG Distance Feb-18 లో జరుగు Exams కు On-Line అడ్మిషన్లు జరుగుచున్నవి అన్ని డిగ్రీ/ PG కోర్సులు Pass గ్యారంటీ రాఘవ డిగ్రీ కాలేజ లాయర్‌పేట, ఒంగోలు. 9160976207.


FINANCIAL SERVICES



SHARES

Lowest Brokerage: 6000 per year Brokerage Plan in NSE/MCX. 10 days Trading class. Fortune Ramu. 720 720 4400.

HEALTH CARE



ACUPUNCTURE

థైరాయిడ్, PCOD, కీళ్ళు, భుజం, నడుం నొప్పులకు ఆక్యుపంక్చర్ చికిత్స ట్రైనింగ్ ఇవ్వబడును. అమృత ఆక్యుపంక్చర్ 5/3 చంద్రమౌళినగర్, గుంటూరు 99128 92096.

AYURVEDIC


అన్ని రకముల క్యాన్సర్లకి కేరళ ఆయుర్వేద మరియు పిల్లల కొరకు, సెక్స్ సమస్యలు, కిడ్నీ, పసుపుతిత్తిలో రాళ్ళు గర్భసంచి గడ్డలు ఆపరేషన్ లేకుండా పరిష్కారం. Cell: 8074906299.

సెక్స్ సుఖవ్యాధులు, సోరియాసిస్, ఆస్తమా, వెన్నునొప్పి, కంటి, గుండె, చెవి, కిడ్నీ, షుగర్, సంతానలేమికి మొ॥ చికిత్స కలదు మనోహర ఆయుర్వేదిక హాస్పిటల్, Cell: 9441441284.

WEIGHT LOSS CENTERS

మీ ఇంటి వద్దనుండే బరువు తగ్గాలి, పెరగాలి అనుకుంటున్నారా? అన్ని ప్రయత్నాలు చేసి విసిగిపోయారా? మీ కోసం సురక్షితం మరియు శాస్త్రీయం. సం॥: 8142361118.

PEOPLE CARE



OLD AGE HOME

సత్యనారాయణ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవచేయుటకు ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96035 47766, 96035 87766.

విజయ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99121 73322, 99124 53322.

భవాని ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99120 68855, 99121 08855.

అనురాధ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 97057 89955, 97058 69955.

REAL ESTATE



గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, కొలకలూరు, తెనాలి, కొత్త ప్లైసెస్, కృష్ణాపూరం, JKC రోడ్‌లో ప్లాట్లు అ/కో సం॥ (జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత). Ph: 94927 70739.

రాజధాని అమరావతి రాయపూడి, వెలగపూడి అతి దగ్గరలో గ॥7700/- ఇళ్ళు కట్టుకుంటే 23వేలు రెంటు వచ్చును. అపార్ట్‌మెంట్ 18లక్షలు. 70%లోన్ కలదు. ✆ 92464 70909.

హైదరాబాద్‌లో తూప్రాన్‌పేట్, గ్రీన్‌సిటీ, హయత్‌నగర్, కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట్, కొహెడ, తుర్కయాంజాల్, మంగళపల్లిలలో ప్లాట్లు కొనబడును. ✆ 9849688626

FLAT FOR SALE

న్యూకన్‌స్ట్రక్షన్ నిర్మల్‌నగర్ భారత్‌రోడ్ ఒంగోలు 2B1150 S.F.T & 3 B1500 S.F.T సేల్ 100% వాస్తు. ✆ 9989000610, 9182216051.

ఒంగోలు, రత్నమహల్ ఎదురు రోడ్ సంతపేటలో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో తూర్పు, ఉత్తరం ముఖ త్రిబుల్ బెడ్ రూమ్ డీలక్స్ ఫ్లాట్స్ అమ్మబడును. Cell: 9346295333.

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు గేటెడ్ కమ్యూనిటీలో 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15 లక్షలు, 18 లక్షలు ఎమినిటీస్ + ✆ 81010 10169, 81010 10168.

2BHK ఫ్లాట్ ఒంగోలు-రామ్‌నగర్ 8వ లైన్‌లో రిమ్స్ ఎదురుగా గణేష్ నిలయం అపార్ట్‌మెంట్‌నందు 1185 Sq.Ft. కార్‌పార్కింగ్‌తో అమ్మకం. Ph: 98855 73453, 83094 66008.

HOUSE FOR SALE

Independent House for Sale at Guntur Jute Mill Area East Facing, Plot Area. 354. Sq.Yds, Builtup Area. 1060 Sq.Ft, Located at. 3-3-19, Jute Mill Area, Guntur-6, for More Details Contact: 9440052462

275 Sq.y 6251 Sft 3 Storied Building E/F, 100% Vasthu in 3rd Lane Rajendra Nagar Guntur-6 (2 Car Parking) Contact: 8142806353

విజయవాడ అమరావతి దగ్గరలో 25 లక్షలకే 133 చ॥గ॥లలో 2 B/R ఇండివిడ్యువల్ హౌసెస్ & ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్లు. చ॥గ॥ 8,500/- లేఅవుట్‌తో. ✆ 98480 73387.

LAND FOR SALE

అద్దంకి నుండి 20 Km దర్శి రోడ్డులో 10 ఎకరముల వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. Contact Cell: 91777 54148.

134 ఎకరాల పండ్లతోట నెల్లూరు జిల్లా ఒజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామం NH 15 కు దగ్గరలో సూర్యవంశం అమ్మకం. 94401 83778, 94917 79999.

కమర్షియల్ చెన్నై - కలకత్తా పోర్ట్స్ కనెక్టింగ్ భారతమాల NH-216 MTM-CPL రోడ్ ఒంటరిపల్లి N/E ఫేసింగ్ 3 ఎ. 24 సెంట్లు అమ్మకం. ✆ 93462 27949.

PLOT FOR SALE

ఒంగోలులోని కొత్తబైపాస్ ఫేసింగ్ కిమ్స్ హాస్పిటల్ దగ్గరలో 60, 40 గదుల 2 స్థలములు అమ్మకానికి కలవు. పార్టీల్ సర్వీస్, మరియు డాబాలకు పావులకు అనుకూలం. సం॥:9063940577.

AP రాజధాని బౌద్ధ గురువు దలైలామా పర్యాటక కేంద్రం ప్రక్కన CRDA అప్రూవ్ ప్లాట్లు ఇళ్ళ మధ్యలో కేవలం గ॥ 9000/- స్పాట్. 96521 94014, 98481 31428.

Gnt-Vja రోడ్ మంగళగిరిలో సెక్రటరేట్‌కు 8 K.M వద్ద 10 సం॥ల వాయిదాలో (బ్యాంక్) 3-4 సెంట్లు CRDA ప్లాట్స్ & విల్లాస్ కలవు. 96521 94014, 98481 31428.

శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, జల్పల్లి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో Open Lands, Plots అమ్మబడును/ కొనబడును. 9848589182/ 9392303122

గుంటూరు కొరని, నంబూరు, కొప్పురావూరు, గోరంట్ల, నల్లపాడు, వెంగళాయపాలెం, తెనాలి, hydలో అన్ని వెంచర్లలోని ఫ్లాట్స్ పొలాలు, స్పాట్ రిజిస్ట్రేషన్‌తో కొనబడును. A1 రియల్ ఎస్టేట్, Regd 188/05. ✆ 88858 85544

గుంటూరు విజయవాడ హైవేకి దగ్గరలో సాఫ్ట్‌వేర్ జోన్‌కి ఆనుకొని CRDA అప్రూవల్‌తో SRM, VIT 220 అ॥ రోడ్‌కి గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ 70% బ్యాంక్‌లోన్‌తో స్పాట్ 96422 90414.


గుంటూరు సిటీ నందు పొన్నూరురోడ్ శ్రీచైతన్య గాళ్స్ జూనియర్ కాలేజ్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేసింగ్‌తో 1016 చదరపు గజముల కమర్షియల్ స్థలము షాపింగ్ కాంప్లెక్సులు, మోటార్ షోరూమ్‌లకు, ఇతర కమర్షియల్‌కు అనువైన స్థలము చుట్టూ 8 అడుగుల కాంపౌండ్‌వాల్, డ్రైన్‌పూలింగ్ చేసిన 2 కల్వర్ట్స్, 2 పెద్ద గేట్లతో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న స్థలము అమ్మకమునకు కలదు. ✆ 93941 02664, 95732 68961.

హైదరాబాద్ పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కొహెడ, జనచైతన్య, శ్రీమిత్ర, ఆజాద్, బాటసింగారం, తుర్కయాంజాల్, శంషాబాద్‌లో ప్లాట్లు కొనబడును. ★ రవి 9347454990/ 9849454990

ఎలక్ట్రానిక్ సిటీని క్యాపిటల్ 250 అ॥ ఇన్నర్ రింగ్ రోడ్ ను ఆనుకొని LP No: 36/2017 గేటెడ్ కమ్యూనిటీ లే అవుట్‌లో ఓపెన్ ప్లాట్స్ & విల్లాస్. బ్యాంక్ లోన్ స్పాట్. ✆ 94914 75797.

సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అభివృద్ధి చెందుతున్న మంగళగిరి దగ్గర CRDA LPNO: 3/2017 తో గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లో ప్లాట్స్ & విల్లాస్ 60% లోన్‌తో స్పాట్ కలవు. ✆ 99082 27609.

TOLET



ఒంగోలు కర్నూలు రోడ్‌లోని Tip-Top రెసిడెన్సీలో లాడ్జింగ్ బిల్డింగ్ TV & A/c అటాచ్‌డ్ రూమ్‌లు నెలవారీ అద్దెలకు ఇవ్వబడును. Ph: 9866133175.

త్రోవగుంట కంపెనీల సెంటర్‌నందు పదివేల చ॥అ॥ గల స్థలం కాని, గోడౌన్ వేసి కాని అద్దెకు ఇవ్వబడును. Ph: 9949879577.

SECONDS SALE



160KV కమిన్స్ కంపెనీ జనరేటర్ మంచి రన్నింగ్+కండిషన్ గలది అమ్మబడును. సం॥: SBMC ఆఫీస్, ఒంగోలు. Ph: 08592-233393, 8309888408.

JOBS



Wanted Experienced Marketing Executives to work for a reputed Publishing Company and willing to Travel Prakasam & Nellore Districts. Interested candidates can apply online at http://www.smartkidsindia.com /careers

Looking for Nursing Care & Physiotherapists for Elders. Salary 8k to 25k. Contact 93929 29268.

Wanted Instrumentation Technician for 1mW power Plant. Exp. 4 to 5 Years. Sri Satyanarayana Raw and Boiled Rice Mill Pvt Ltd. Bhimavaram. ✆ 81214 47844.

PIONEER Auto World GNT (P) Ltd. మహీంద్ర కార్ షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్ మేనేజర్స్ కావలెను. ఆసక్తి గల వారు నేరుగా H.R ను "లేదా" ఈమెయిల్‌కు బయోడేటాను పంపగలరు. సం॥: NH-5 గుంటూరు రోడ్, త్రోవగుంట, ఒంగోలు. Cell: 9100025053, onghr@pioneermahindra.net

అమెరికా వెళ్ళుటకు విజిటింగ్ వీసా కలిగిన మహిళ, ఇంట్లోపని, ఇద్దరు పిల్లలను చూసుకొనుటకు కావలెను. 8096183999. " గమనిక: విజిటింగ్ వీసా లేనివారు దయచేసి కాల్‌చేయవద్దు."

ఒంగోలులో ఎలక్ట్రానిక్స్ షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల, టాలీ వచ్చిన అకౌంటెంట్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 9246994422, 7799922478.

మధురై వారి రాయల్ మసాలా ప్రొడక్ట్స్‌కు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 8977133710, 9182377896.

APలోని అన్ని పట్టణాలలో సుమదుర ఫుడ్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ చేయుటకు రిప్రజెంటేటివ్స్ కావలెను. sumadhurafoods@yahoo.com ✆ 90596 80822.

ఒంగోలు ఐడియా షోరూం నందు పనిచేయుటకు అనుభవం కలిగిన టెలికాలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. Con: 9948008559.

గాయత్రి ఓల్డేజ్‌హోం విజయవాడలో ముసలివారికి సేవచేయుటకు స్త్రీ/ పు॥ 100 మంది వెంటనే కావలెను. వ: 20-50 సం. మంచి జీతం కలదు. భోజనం వసతి ఉచితం. ఏజెంట్లు కూడా కావలెను. మంచి కమీషన్. ✆ 97051 51122, 95531 71122, 97051 31122, 95429 61122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం విజయవాడలో ముసలివారికి సేవచేయుటకు స్త్రీ/ పు॥ 100 మంది వెంటనే కావలెను. వ: 20-50 సం. మంచి జీతం+ భోజనం వసతి ఉచితం. ఏజెంట్లు కూడా కావలెను. మంచి కమీషన్. ✆ 95052 87788, 91330 91188, 99486 73322, 99486 93322.

కనుమూరి హాస్పిటల్స్ నందు GNM నర్సింగ్ స్టాఫ్ మరియు సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. ✆ 96188 77557.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రామకృష్ణ హోంహెల్త్‌కేర్ విజయవాడ కొరకు 100 మంది మార్కెటింగ్ సిబ్బంది స్త్రీ/పు OC/ BCలు మాత్రమే కావలెను. భోజనం, వసతి, మంచి జీతం కలదు. వ: 30-50 సం॥లు. చదువు: 10th to డిగ్రీ. ✆ 99631 91122, 99484 63322.

కాకతీయ.కామ్ (మ్యారేజ్ వెబ్‌సైట్) ఒంగోలులో పనిచేయుటకు PG లేదా ఏదైనా డిగ్రీ చదివిన మహిళా అభ్యర్థులు కావలెను. 9391999999/ 9642031222. ycrao1951@gmail.com

వృద్ధాశ్రమంలో మంచానవున్న వృద్ధులకు సేవ చేయుటకు ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 8 to 10 వేలు. ✆94936 36855, 89779 27555.

కళ్యాణ్ ఆక్వా & మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ఇ॥లైని॥ గుళ్ళాపల్లి, మద్దిపాడు, ప్రకాశం జిల్లా నందు పనిచేయుటకు H.R.మేనేజర్, మైక్రోబయాలజీ (కెమిస్ట్రీ, బయోసైన్స్), ITI, డిప్లమో (ఫిట్టర్, ఎలక్ట్రికల్), వారు కావలెను. సంప్ర: 9052602710, 9989623608, Email: plant@kalyanaqua.com

ప్రముఖ హోర్డింగ్ సంస్థకు ఆయా జిల్లాలలో వర్క్ సూపర్‌వైజర్లు కావలెను. (ఇంటర్/ITI Civil). అనుభవమునుబట్టి జీతము. ✆ 99634 71011. మెయిల్: kalyaniadsresumes.1986@gmail.com

హైదరాబాద్‌లోని ఒక చిన్న కుటుంబానికి ఇంటిలో ఉండి పసిబిడ్డను చూసుకోవటానికి మరియు వంట చేయుటకు ఇద్దరు మహిళలు కావలెను. వయసు 30 సం॥లు, అనుభవం 2-3 సం॥లు, జీతము: 10,000 - 12,000, 9848069663కు కాల్ చేయండి.

ఒంగోలు/హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోని MNC కం॥ కొరకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జంటుగా కావలెను. జీ. 10,000/- ఫ్రీ రూం, సబ్సిడీ భోజన సంప్ర॥ 77020 87713, 99661 90918.

ప్రముఖ బ్యాంక్ నందు పర్సనల్ లోన్స్ మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 10 వేలు + అలవెన్స్ + ఇన్సెంటివ్స్ సంప్ర॥ 90632 38023, 79979 93839.

చీరాలలోని 'Bata' షోరూంలో పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. చీరాల వారికి మాత్రమే సం: 9700603434.

ఫ్యాక్టరీ/ట్రేడింగ్ ఫామ్ (యాదారం, సాగర్ రోడ్, హైదరాబాద్) నందు పని చేయుటకు సూపర్‌వైజర్స్ కావలెను. డిగ్రీ/ ఇంటర్ అనుభవాన్ని బట్టి జీతం మరియు లేబర్‌ని సప్లయ్ చేసే కాంట్రాక్టర్లు సంప్రదించగలరు. ✆ 93965 64667.

ఒంగోలు పాత గుంటూరు రోడ్‌లోని A1 కల్యాణమండపంలో లేడీ సూపర్‌వైజర్లుగా పనిచేయుటకు లోకల్ వాళ్ళు కావలెను. ఒక వాచ్‌మెన్ ఫ్యామిలీ కూడా కావలెను. సంప్రదించవలసిన తేదీలు. జనవరి 2, 4, 7, 9 . సంప్రదించవలసిన సమయము. ఉదయం 10 గంటలు సంప్రదించండి. ✆ 9849449012

రోబోటిసర్ ఫర్నిచర్స్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్, హెల్పర్స్ కావలెను. Qly: 10th లేదా ఇంటర్ Age: 20 సం॥ నుండి 35 సం॥ సంప్ర: 9849462952, 8106643579 (గుంటూరు)

ఖాదీ గ్రామోద్యోగ్ (KVIC, Govt. of India) ఆధ్వర్యంలో పని చేయుటకు సేల్స్ ఆఫీసర్స్ మరియు ఏజెన్సీ నిర్వహించు నైపుణ్యం కలిగిన వ్యక్తులు కావలెను. ✆ 95335 55588

To Be Continued On Page 7

ఇమ్మడి కాశీనాథ్‌కు సంజాయిషీ తాకీదు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: మార్కాపురం తెదేపా నాయకుడు ఇమ్మడి కాశీనాథ్‌కు జిల్లా పార్టీ కార్యాలయం సంజాయిషీ తాకీదు జారీ చేసింది. మార్కాపురం పార్టీ ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డిని వ్యతిరేకించి ఇంటింటికి తెలుగుదేశం నిర్వహిస్తూ.. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందుకు నోటీసు జారీ చేశారు. అది అందిన వారంలోగా జవాబు చెప్పాలని అందులో పేర్కొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అనుమతి మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మూరి రవిచంద్రశేఖర్ బాబు ఈ తాకీదు జారీ చేశారు.

అన్ని పాఠశాలల్లో క్రీడా పోటీలు

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జనవరి 2 నుంచి 11వతేదీ వరకూ విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని డీఈవో సుబ్బారావు డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను కోరారు. శనివారం ఒంగోలు సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిదో తేదీ విద్యా వికాసం పేరుతో ప్రతి పాఠశాలలో విద్యార్థులతో ఉపన్యాసాలు, సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు ఫోటో ప్రదర్శన కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులతో నాటికలు, ప్రాథమిక విద్యార్థులతో పద్యాలు పాడించడం వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. వీటితోపాటు రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ వాలీబాల్, మూడు నుంచి ఆరో తేదీ వరకూ కబడ్డీ, నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ ఖోఖో, అయిదు నుంచి పదో తేదీ వరకూ అథ్లెటిక్స్, ఏడో తేదీ 5కే రన్‌తో పాటు 11వ తేదీ ముగింపు ఉత్సవాలను పసందుగా నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. నగరపాలక, మండల కేంద్రాల్లో జనవరి ఏడో తేదీ ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ 5కే రన్‌ను నిర్వహించాలన్నారు.

చాలా ఆలోచనలున్నా.. సమయం సరిపోలేదు..

● శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతం ● డీజీపీ సాంబశివరావు



భూమిపూజ చేస్తున్న డీజీపీ, కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో సంస్కరణలకు తన వద్ద చాలా ఆలోచనలు ఉన్నా.. సరిపడినంత సమయం లేకపోవడంతో వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయానని డీజీపీ సాంబశివరావు అన్నారు. నూతనంగా వచ్చే డీజీపీ ఆధ్వర్యంలో పోలీసుశాఖ మరింత సమర్థంగా పని చేస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పోలీసు కవాతు మైదానంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రత పరిరక్షణలో విజయవంతమైనట్లు చెప్పారు. కృష్ణా పుష్కరాలు, నక్సల్స్ అణచివేత కార్యక్రమాల్లోనూ తాము విజయం సాధించామన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేసినట్లు వివరించారు. తాము అనుసరిస్తున్న సాంకేతిక విధానాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. డ్రోన్లు, బాడీ కెమెరాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్ తదితరాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. తాను 33 ఏళ్లపాటు పోలీసుశాఖలో వివిధ హోదాల్లో చేసిన పని సంతృప్తిని ఇచ్చిందన్నారు. మరింత సమర్థంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని పోలీసులకు నూతన సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు.

తన సొంత పట్టణంలో మోడల్ స్టేషన్ నిర్మాణం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చే అంశమని డీజీపీ నండూరి సాంబశివరావు అన్నారు. ఒంగోలులోని గుంటూరు రోడ్డులో ఎ-1 కన్వెన్షన్ సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఒంగోలు తాలుకా మోడల్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ సమక్షంలో స్థానిక పోలీసు కవాతు మైదానంలో శనివారం భూమి పూజ నిర్వహించారు. ఎస్పీ సత్యఏసుబాబు పూజలు నిర్వహించగా- డీజీపీ సాంబశివరావు, గుంటూరు రేంజి డీఐజీ కె.వి.వి.గోపాలరావు, కలెక్టర్ వినయ్ చంద్, జిల్లా జడ్జి ప్రియదర్శిని ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

తన సొంత పట్టణంలో మోడల్ స్టేషన్ నిర్మాణం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చే అంశమని డీజీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) ఉదయరాణి, అదనపు ఎస్పీ(ఏఆర్) శివారెడ్డి, ఒంగోలు డీఎస్పీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. డీజీపీని ఎస్పీ సత్యఏసుబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

దేవర సుబ్బులు మృతి బాధాకరం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: చీరాల మండలం గవినివారిపాలేనికి చెందిన దేవర సుబ్బులు ప్రత్యర్థుల దాడిలో గాయపడి మృతి చెందడం బాధాకరమని డీజీపీ సాంబశివరావు వ్యాఖ్యానించారు. ఒంగోలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఈ విషయమై ఎస్పీతో చర్చించినట్లు తెలిపారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం చేసే విషయంపై కలెక్టర్, ఎస్పీలు పర్యవేక్షిస్తారన్నారు.

సుబ్బులు హత్య విషయంలో పోలీసు అధికారులపై వస్తున్న విమర్శలపై డీజీపీ స్పందిస్తూ... ఈ ఎస్పీ హయాంలో ఆరోపణలకు తావులేదని వ్యాఖ్యానించారు. తాము చెప్పిన పనుల విషయంలోనూ ఆయన చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.



డీజీపీని సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ సత్యఏసుబాబు

కమ్మ అవివాహితులకు సువర్ణావకాశం

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఉచిత రిజిస్ట్రేషన్ కార్యక్రమం నేడే



ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఆధ్వర్యంలో కమ్మ అవివాహితులైన యువతీ యువకుల కోసం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. దీని ద్వారా వివాహ సంబంధాలు చూసుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఆసక్తిగల యువతీ యువకులు, తల్లిదండ్రులు వధూవరుల వివరాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవటం కోసం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఈ దిగువ చిరునామాలో సంప్రదించవచ్చు.

ఆచార్య రంగా భవన్, కలెక్టర్ కార్యాలయం దగ్గర, సంతపేట, ఒంగోలు, ఫోన్ నంబరు 91211 60131, 80085 50216 మరియు మీ వివరాలను వాట్సాప్ 80085 50216 నంబర్‌కు పంపవచ్చు. ఈ కార్యక్రమానికి ఆళ్ల వెంకటేశ్వరరావు సహకారం అందిస్తున్నారు. వరుడు లేక వధువులకు సంబంధించిన కార్డు సైజ్ ఫొటో, గుర్తింపు కార్డు జిరాక్స్ (ఆధార్/ఓటర్/పాన్/డ్రైవింగ్ లైసెన్స్/ పాస్‌పోర్టు) తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు, సమాచారం కోరుకునే వారికి నిర్ణీత రుసుముతో ప్యాకేజీలు కూడా లభ్యమవుతాయి.

అధికారులతో జిల్లా జడ్జి సమావేశం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రియదర్శిని

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ న్యాయసేవాధికార సంస్థ నిర్దేశించిన పథకాల అమలు తీరుపై ప్రభుత్వ అధికారులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా జడ్జి ఎం.జి.ప్రియదర్శిని శనివారం సమీక్ష జరిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా ప్రతి అధికారి సహకరించాలని కోరారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వివాదాలను ప్రాథమిక దశలోనే గుర్తించి.. పరిష్కరించదగిన వాటిని పీఎల్‌సీల ద్వారా పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందిస్తున్నామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజా వెంకటాద్రి మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ లక్ష్యాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళల అక్రమ రవాణా తదితరాలపై సమాజంలో అవగాహన కల్పించి.. వాటిని ఆపే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శరత్‌బాబు, డీఆర్వో ఎన్.ప్రభాకరరెడ్డి, డీఎస్పీ మరియదాసు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శివరామకృష్ణ ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు, జైలరు పి.ఎస్. రామచంద్రరావు, న్యాయవాదులు ఎ.రామయ్య, కె.సుమతి తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి'

● వై.పాలెంలో ముస్లింల నిరసన



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



రోడ్డుపై ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

యర్రగొండపాలెం: రాజమండ్రి గ్రామీణ మండలంలో నూరానీ మసీదుపై ఈ నెల 28న దాడిచేసి అక్కడున్న 61 ఏళ్ల వృద్ధ మౌజన్‌ను అతి కిరాతకంగా చంపి, పవిత్ర గ్రంథానికి నిప్పుపెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ముస్లిం సోదరులు కోరారు. వై.పాలెంలో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. శనివారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇస్లాంను అవమానపరచడం సిగ్గు చేటన్నారు. దేశంలో లౌకికవాదానికి చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్న మతోన్మాదులపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉండే ఏపీలో ఇలాంటి ఘటన జరగడంపై ప్రభుత్వం శోచనీయమన్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. శాంతి భద్రతలను కాపాడి ముస్లిం ప్రార్థనాలయాలకు రక్షణ కల్పించాలని నినదించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో రోడ్డుపైనే ప్రార్థనలు చేశారు. నిరసనకు వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు మద్దతునిచ్చాయి. అనంతరం ఉప తహసీల్దారు రమాదేవికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డుపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి.

నెక్ కోడిగ్రుడ్ల ధరలు
★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.56 పై॥
★ నెక్ విజయవాడ ఆఫీసు. ఫోన్: 0866-6582559

చికెన్ ధరలు



కోళ్ల ఫారం ధర

బ్రాయిలర్ (వెన్‌కాబ్) (కిలో 1కి రూ.లలో)

హైదరాబాద్-96, కర్నూలు-96, విజయవాడ-91, తూర్పు, పశ్చిమ గోదావరి-89, చిత్తూరు-79, నెల్లూరు - 89, విశాఖపట్నం - 87, గుంటూరు -91, ఒంగోలు - 93.

అక్రమాలపై... అక్షర బాణం

స్పందన 2017

ఈనాడు ప్రకాశం



ఈనాడు డిజిటల్- ఒంగోలు

లక్ష గొంతుకలు ఆయుధమైతే... ఒక్క అక్షరం దానికి పదును పెడుతుంది...! అవినీతి మదగజాన్ని అదుపు చేయాలన్నా... అక్రమాల యత్నాలను అడ్డుకోవాలన్నా అక్షరానికే సాధ్యం...! సత్యాలయ్యే స్వప్నాలకు సాక్ష్యంగా నిలిచేది అక్షరమే...! లక్షణమైన అక్షరం లక్ష్యాలను గుర్తు చేస్తుంది. హృదయాలను హత్తుకుంటుంది. లక్ష్యం గురి తప్పితే.., అవినీతి వైపు తిరిగితే... అక్షరమే ఆయుధమవుతుంది. అలాంటి ఆయుధాలతోనే జిల్లాలో అవినీతి, అక్రమాల భరతం పట్టేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది 'ఈనాడు'. ఈ ఏడాది ప్రచురించిన కథనాలు ఎంతో ఫలితమిచ్చాయి. కొన్ని అవినీతి వ్యవహారాలను అడ్డుకున్నాయి. మరికొన్ని కథనాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాయి. 2017 ముగుస్తున్న వేళ... అలాంటి వాటిలో మచ్చుకు కొన్ని...

కార్పొరేషన్ జాగా ఖాళీ

షాదీఖానా సమీపంలోని ఖాళీ స్థలం ఇదే

విలువైన స్థలంపై కన్ను...

22-03-2017 కార్పొరేషన్ జాగాకు రక్షణ

విషయం : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని షాదీఖానా వద్ద, నిర్మల నగర్‌లోని స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని కథనం. షాదీఖానా స్థలంలో స్పోర్ట్స్ క్లబ్‌కు కేటాయించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు, సీసీ కెమెరాలు పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా దక్కించుకునేందుకు దస్త్రాలు కదిలాయి. ఈ వ్యవహారాన్ని 'ఈనాడు' కథనం బయటపెట్టింది.

స్పందన : నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. స్థలం వద్ద ఉన్న బ్యానర్లు తొలగించారు. స్థలం నగర పాలక సంస్థకు చెందినది అంటూ బోర్డు పెట్టారు. తద్వారా రూ. కోట్ల విలువైన స్థలం అక్రమార్కుల పరం కాకుండా ఆగింది. నిర్మల నగర్‌లోని పార్కు స్థలంపైనా విచారణ జరిపించారు.

26-12-2017 కొండ భూమికి అండ

విషయం: అద్దంకిలోని శింగరకొండపై ఆక్రమణలు జరుగుతున్నాయి. రూ. కోటి విలువైన స్థలాన్ని ఆక్రమించి యంత్రాలతో తవ్వకాలు మొదలుపెట్టారు.

స్పందన : ఈ కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ స్థలం వద్ద స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వభూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

28-03-2017 ఆక్రమణలకు అడ్డుకట్ట

విషయం : ఒంగోలు నగరం సమీపంలోని పేర్నమిట్ట వద్ద ఒంగోలు- కర్నూలు రహదారిపై ఆక్రమణలు పెరుగుతున్నాయి. రహదారి స్థలంలో అక్రమంగా గోడ నిర్మాణం జరుగుతోంది. కాలువ పొడవునా రూ. 80 లక్షల విలువైన స్థలం ఆక్రమణలకు గురైంది. దీనిపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది.

స్పందన : రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. స్థలాన్ని సర్వే చేయించారు. ప్రభుత్వ స్థలమని తేలడంతో వెంటనే అక్రమంగా నిర్మించిన గోడను కూల్చేశారు. విలువైన స్థలం అక్రమార్కుల పరం కాకుండా అడ్డుకోగలిగాం.

08-11-2017 పాడేరు టు చీమకుర్తి

విషయం: విశాఖపట్నం పాడేరు నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి చీమకుర్తిలో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక్కడి క్వారీల్లోని కార్మికులకు గుట్టుగా విక్రయిస్తున్నారు.

స్పందన: పోలీసులు స్పందించారు. వెంటనే తనిఖీలు చేశారు. రూ. లక్ష విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు.

జాగా చూస్తే... పాగా వేసేస్తారు

లక్షల విలువైన స్థలంపై కన్ను

రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణం

గరళ సాగరం...!

13-06-2017 గరళ సాగరం...!

విషయం: సాగర్ నీరు ప్రవహిస్తున్న కాలువ గట్లపై గ్రానైట్ వ్యర్థాలు విపరీతంగా ఉంటున్నాయి. గ్రానైట్ పరిశ్రమల పొడి మొత్తం మిళితమై... కలుషిత నీరే మంచినీటి చెరువుల్లోకి చేరుతోంది. దీన్ని 'ఈనాడు-ఈటీవీ' కథనం వెలుగులోకి తెచ్చింది.

స్పందన: ఈ కథనంపై అధికారులు, గ్రానైట్ పరిశ్రమల యజమానుల్లో కదలిక వచ్చింది. అధికారుల సూచనలతో ఈ కాలువ వెంబడి ఉన్న క్వారీల యజమానులే నిధులు సేకరించి రహదారి నిర్మాణం చేపట్టారు. రూ. 30 లక్షలతో ప్రస్తుతం రహదారి నిర్మాణం జరుగుతోంది.

16-12-2017 కన్నీళ్ల మాటున కాసుల బేరం

విషయం: గిద్దలూరులోని చంద్రన్న బీమా లబ్ధిదారుల నుంచి బీమా మిత్రలు అక్రమంగా వసూళ్లు చేశారు. మీకు ప్రభుత్వం నుంచి బీమా సొమ్ము వస్తుంది మాకు కొంత ఇవ్వండి అంటూ అక్రమంగా రూ. వేలల్లో వసూలు చేశారు. దీనిపై 'ఈనాడు' కథనం ప్రచురించింది.

స్పందన : ఈ వసూళ్లపై అధికారులు విచారణ చేపట్టారు. నిజమేనని తేలింది. లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన నగదును తిరిగి ఇప్పించారు. తుంగా లక్ష్మీదేవికి రూ. 20 వేలు, గుమ్మల భాగ్యలక్ష్మికి రూ. 5000 తిరిగి ఇచ్చేశారు. అవినీతికి పాల్పడిన ఇద్దరు బీమా మిత్రలను విధుల నుంచి తొలగించారు. వీరికి సహకరించిన ఏపీవోపై బదిలీ వేటు వేశారు.

సాగర్ నీరు.. ప్రస్తుతం 180 చెరువుల ద్వారా 650 పల్లెలకు చేరుతుంది. నీటి సరఫరాలో రామతీర్థం జలాశయం కీలకం కాగా.. ఈ జలాశయం ద్వారా ఒంగోలు బ్రాంచి కాలువ(ఓబీసీ), కారుమంచి కాలువ, మైలవరం ప్రధాన కాలువ ద్వారా గ్రామాల్లోని చెరువులను నింపుతున్నారు. నీరు పల్లెలకు, ప్రజలకు చేరాలంటే కాలువలే ఆధారం.

18-08-2017 552 మందికి పింఛన్లు వచ్చాయి

విషయం: నాగులుప్పలపాడులో 552 మందికి మంజూరైన పింఛన్లు ఆగిపోయాయి. ఇద్దరు నాయకుల మధ్య విభేదాల కారణంగా జాబితాలపై ఏకాభిప్రాయం లేక పింఛన్లు నిలిపివేశారు. ఈ అంశంపై లబ్ధిదారుల ఇబ్బందులు వివరిస్తూ, 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది.

స్పందన : ఈ కథనంపై జిల్లా కలెక్టరు వినయ్‌చంద్ వెంటనే స్పందించారు. విచారణకు ఆదేశించారు. నిజమేనని తేలడంతో ఆ నాయకులు ఇద్దరితోను మాట్లాడారు. ఏకాభిప్రాయం వచ్చేలా చేసి 552 మందికీ పింఛన్లు మంజూరు చేయించారు. సెప్టెంబరు నెల నుంచి వారందరికీ క్రమం తప్పకుండా పింఛన్లు వస్తున్నాయి.

ఈమె పేరు. షేక్ ఖలియాజ్‌బీ. నాగులుప్పలపాడు గ్రామం. 2014లో భర్త మృతి చెందారు. నాటి నుంచి వితంతు పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. చివరికి ఈ ఏడాది జనవరిలో మంజూరైనా, రాజకీయాల కారణంగా చివరి దశలో నిలిచిపోయింది. ప్రభుత్వం అంగీకరించినా స్థానిక నాయకుల రాజకీయం కారణంగా ఈమె కోల్పోయిన నగదు రూ. 7 వేలు. పేద కుటుంబానికి ఈ డబ్బు ఎంతో ఉపయోగపడి ఉండేది.

నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన పాలపర్తి రాజమ్మకు ఈ ఏడాది జనవరిలోనే పింఛను మంజూరైంది. చివరి క్షణంలో చెల్లింపులు రద్దు చేశారు. ఇద్దరు నాయకుల మధ్య వైరం వల్ల ఈమెకు ఏడు నెలల కిందటి నుంచే అందాల్సిన పింఛను సొమ్ము ఇప్పటికీ రావడం లేదు... ఇలా వీరిద్దరే కాదు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మొత్తం 540 మంది జనవరి నుంచి రావాల్సిన పింఛను సొమ్మును కోల్పోయారు.

సర్కారు వరమిచ్చింది... రాజకీయం అడ్డుకుంది...!

■ పేదలకు శాపంగా మారిన నాయకుల ఆధిపత్య ధోరణి

ఇంటి దొంగలెవరు?

■ గృహ నిర్మాణ లబ్ధిదారుల నుంచి 10 శాతం మామూళ్ల వసూలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే

27-11-2017 మామూళ్లు వెనక్కి...

విషయం: ఎన్టీఆర్ గృహాల నిర్మాణాల్లో దళారులు దూరారు. లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వాలంటే మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని 'ఈనాడు' బయటపెట్టింది.

స్పందన : ఈ కథనంపై గృహనిర్మాణ శాఖ డీఈ శ్రీనివాస ప్రసాద్ విచారణ చేపట్టారు. లబ్ధిదారుల నుంచి దళారులు వసూలు చేసిన నగదును వెనక్కు ఇప్పించారు. సవరం వెంకటరవణమ్మకు రూ. 7500.., పాముల వెంకటరవణమ్మకు రూ. 12,000.., పార్వతికి రూ. 6000.., బాలామణికి రూ. 7000.., మన్నం శివమ్మకు రూ. 9500 తిరిగి ఇప్పించారు.

అమ్మేద్దాం.. ఏమవుతుంది!

ఈనాడు - అమరావతి, ఒంగోలు

09-09-2017, 10-09-2017 ఎయిడెడ్ అక్రమాలకు చెల్లు

విషయం: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు ప్రభుత్వం అనుమతులిచ్చిన నేపథ్యంలో అక్రమాలు జరిగాయి. యాజమన్యాలు ఈ పోస్టులను అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై 'ఈనాడు' ప్రధాన, జిల్లా సంచికల్లో పరిశీలనాత్మకంగా కథనాలు ప్రచురితమయ్యాయి.

స్పందన : ప్రభుత్వం స్పందించింది. నియామకాలు చెల్లవని, వెంటనే నిలిపివేయాలంటూ సెప్టెంబరు-12న ఉత్తర్వులు ఇచ్చింది. అక్రమాలపై విచారణ కమిటీని నియమించి, కొందరిపై చర్యలకు సిఫార్సు చేశారు.

15-09-2017 అవినీతికి అడ్డా.. చీరాల తహసీల్దారు కార్యాలయం

విషయం: చీరాల తహసీల్దారు కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి పనికీ వసూళ్లు జరుగుతున్నాయి.

స్పందన : ఈ కథనంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అక్రమాలు నిజమేనని తేలడంతో తహసిల్దారుపై బదిలీ వేటు వేశారు.

26-10-2017 పరివర్తకాలు కదిలొచ్చాయ్...

విషయం: పొలాల్లోని విద్యుత్తు పరివర్తకాలు ఎక్కువగా కాలిపోతున్నాయి. కొరత కారణంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. దీనిపై అన్నదాతలు పడుతున్న ఇక్కట్లపై కథనం ప్రచురించాం.

స్పందన: ఈ విషయంపై విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. కంభం, మార్కాపురం ప్రాంతాల నుంచి పరివర్తకాలు తెప్పించారు. పరివర్తకాల సామర్థ్యం పెంచారు, అదనంగా సిబ్బందిని నియమించారు. దాదాపు మూడు వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరింది.

04-07-2017 'దారి'కొచ్చిన రాజకీయం

విషయం: ఒంగోలు- కర్నూలు రహదారి ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు నిర్మాణానికి ఏడాది కిందటే రూ. 23 కోట్లు మంజూరయ్యాయి. టెండరు దశ నుంచి అవినీతి మొదలైంది. వాటాల కోసం నాయకులు, అధికారులు వివిధ దశల్లో అడ్డు తగిలారు. దీంతో పనులు జాప్యమయ్యాయి. ఈ వ్యవహారంపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురితమయ్యాయి.

స్పందన: ఈ కథనాలపై నాయకులు, అధికారుల్లో కదలిక వచ్చింది. జిల్లా కలెక్టరు ప్రత్యేక దృష్టిపెట్టడంతో దస్త్రం చకచక కదిలింది. 20 రోజుల వ్యవధిలోనే దస్త్రాలన్నీ ఆమోదించారు. అన్ని అనుమతులు వచ్చేశాయి. పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రద్దీ రాదారిపై రాజకీయ క్రీడ

01-06-2017 దేవాదాయ శాఖలో అక్రమాలపై ఉక్కుపాదం

విషయం: పర్చూరు, కారంచేడు పరిధిలోని దేవాదాయ శాఖ ఆలయాల్లో అక్రమాలపై విస్తృత కథనం. ఆలయ భూములపై కౌలు వసూలు చేయడం లేదని, ఆదాయాన్ని దిగమింగేస్తున్న వైనాలపై వరుస కథనాలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యాయి.

స్పందన : ఈ కథనాల ఆధారంగా దేవాదాయశాఖ ఉన్నతస్థాయిలో కదలిక మొదలైంది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారితో పాటు, ఓ ఈవోను కూడా సస్పెండ్ చేశారు. దుర్వినియోగమైన నగదు రికవరీకి ఆదేశించారు.

17-01-2017 మూత్రపిండ రోగులకు ఊరట

విషయం : జిల్లాలో వెయ్యి మందికి పైగా మూత్రపిండవ్యాధిగ్రస్థులు డయాలసిస్ చేయించుకోవడంలో అవస్థలు పడుతున్నారు. ఒంగోలు రిమ్స్‌లోని ఏకైక డయాలసిస్ కేంద్రానికి తరచూ రావాలంటే తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యేవారు.

స్పందన : 'ఈనాడు' ప్రధాన సంచికలో వచ్చిన ఈ కథనానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించారు. జిల్లాకు మరో మూడు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. సీఎం సూచించిన 60 రోజుల గడువులో కనిగిరి, కందుకూరు, మార్కాపురంలలో డయాలసిస్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం అవి ఆయా ప్రాంత రోగులకు ఊరటనిస్తున్నాయి.

మూత్రపిండాలకు ముప్పు

- ప్రకాశంలో వ్యాధితో విలవిల
- రెండేళ్లలో 423 మంది మృతి
- 1076 మంది డయాలసిస్ రోగులు

ఒంగోలు చుట్టుపక్కలే..

ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులు

25-05-2017 అక్రమ రవాణాపై కన్నెర్ర

విషయం: చీమకుర్తి నుంచి గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. కంటైనర్లలో లోడు చేసుకుని రాత్రి వేళల్లో తరలిస్తున్నారు.

స్పందన: గనుల శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. రెండు రోజుల వ్యవధిలోనే ముమ్మరంగా తనిఖీలు చేసి రూ. 8 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. వెంటనే తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్రమాలను కొంత వరకు అడ్డుకోగలిగారు.

కంటైనరు కదిలిపోతున్నాయి!

- మళ్లీ ఊపందుకున్న గ్రానైట్ అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి రోజూ రూ.లక్షల్లో గండి

చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో, ఏపీఎండీసీ క్వారీ భూముల్లో నిలిపి ఉన్న కంటైనర్లు

ఒంగోలు, న్యూస్‌టుడే

భూ పందేరం

భూములకు బాసటగా...!

జిల్లాలోని ప్రభుత్వ భూములకు 'ఈనాడు' అక్షరాలు తన వంతుగా రక్షగా నిలుస్తున్నాయి. లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూములున్న జిల్లాలో సుమారుగా 30 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిపై ఎప్పటికప్పుడు ఆధారాలు సేకరిస్తూ కథనాలు ప్రచురిస్తున్నాం. ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న యర్రగొండపాలెం, పుల్లలచెరువు, నాగులుప్పలపాడు, లింగసముద్రం తదితర మండలాల్లో వందలాది ఎకరాలు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకోగలిగాం. 2017 ఏడాది జిల్లాలోని భూముల అక్రమాలపై 50 కథనాలకు పైగా 'ఈనాడు'లో ప్రచురితమయ్యాయి. వీటిపై విచారణలు నెమ్మదిగా సాగుతున్నా... అక్రమాలు మాత్రం ఆగుతున్నాయి. రెవెన్యూలో రికార్డుల అందుబాటులో లేకపోవడం, అధికారుల హాజరు లేమి, సాంకేతిక కారణాలతో అక్రమాల నిర్ధారణ జరగడం లేదు. కానీ అక్రమాలను గుర్తిస్తున్న అధికారులు వెంటనే ఆన్‌లైన్, వెబ్‌ల్యాండ్‌లో అక్రమాలను నియంత్రణలో ఉంచుతున్నారు.

- నాగులుప్పలపాడు మండలం కనపర్తిలోని ప్రభుత్వ భూములను అక్కడి తహసీల్దారు మరో ఇద్దరు అధికారులతో కలిసి అక్రమంగా రాసిచ్చేశారు. అనధికారికంగా వందలాది ఎకరాలను ఆన్‌లైన్ చేశారు. ఎకరం రూ. లక్ష చొప్పున బేరం పెట్టి అమ్మేశారు. ఈ తతంగం మొత్తాన్ని ఆగస్టు మొదటి వారంలో 'ఈనాడు' ప్రత్యేక పరిశోధన, ప్రాథమిక ఆధారాలతో బయటపెట్టింది. వీటిలో చాలా వరకు ఆన్‌లైన్‌లోనే రద్దు చేశారు. పట్టాలు రద్దు చేయగలిగారు. అక్రమాలపై విచారణకు ఆదేశించినా రికార్డులు లేక, సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతోంది.
- పుల్లలచెరువు మండలంలోని ప్రభుత్వ భూముల అక్రమాలపై కొన్ని కథనాలు ప్రచురితమయ్యాయి. అక్టోబరు 28న ప్రచురించిన ఓ కథనంపై అధికారులు విచారణకు ఆదేశించారు. అప్పటి తహసీల్దారుపై చర్యలకు రంగం సిద్ధం చేశారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసిన భూములను తొలగించారు. ఇదే క్రమంలో లింగసముద్రం మండలంలోని భూ అక్రమాలను 'ఈనాడు' అక్షరాలతో బయటపెట్టింది.

ధ్యాం ధాం

09-10-2017 : ధాం... ధ్యాం...!

విషయం: నిర్మించిన నెల రోజులకే చెక్‌డ్యాములు పగిలిపోయాయి. నిర్మాణాల్లో నాణ్యత లోపాల కారణంగా ఒక్క వానకే కొట్టుకుపోయిన వైనంపై కథనం.

స్పందన: అధికారులు విచారణ చేపట్టారు. నాణ్యత లేమి కారణంగానే అని తేలింది. గుత్తేదారుడి నుంచి నిధుల రికవరీ చేసేలా ఆదేశాలు ఇచ్చారు. మళ్లీ నిర్మాణం చేపడతానని గుత్తేదారు హామీ ఇచ్చారు.

05-12-2017 గంజాయి గుట్టు రట్టు

విషయం: యర్రగొండపాలెంలోని పాలుట్ల గ్రామంలో రహస్యంగా గంజాయి సాగు జరుగుతోంది. కొందరు అక్రమార్కులు అనధికారికంగా గుట్టుగా గంజాయి సాగు ఆరంభించిన వైనాన్ని ఈనాడు కథనం ద్వారా బయటపెట్టింది.

స్పందన: అధికారులు స్పందించారు. వెంటనే ఈ సమీప గ్రామాల్లో తనిఖీ చేశారు. గంజాయి సాగుని తొలగించారు. రూ. లక్ష విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

నాయకుల నీడలో... అవినీతి ఊడలు

- రాజకీయ అండతో చెలరేగిపోతున్న ఎస్సైలు
- ఇసుక, పేకాట, మద్యం... అన్నింటా వసూళ్లు

14-09-2017 పోలీసులకు ముకుతాడు

విషయం: ఎమ్మెల్యేలు, నాయకుల సిఫార్సులతో పోస్టింగుల్లోకి వస్తున్న ఎస్సైలు అవినీతి పాల్పడుతున్నారు. ఎక్కడెక్కడ ఎలా అవినీతి జరుగుతుందో వివరిస్తూ సూటిగా ప్రస్తావిస్తూ కథనం ప్రచురించాం.

స్పందన: ఈ కథనంపై జిల్లా ఎస్పీ సత్య ఏసుబాబు స్పందించారు. ఎస్సైలపై విచారణ జరిపించారు. మద్దిపాడు ఎస్సైని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు ఎస్సైలకు మెమోలు ఇచ్చారు. జిల్లాలోని ఎస్సైలు అందరితోనూ సమీక్షించి, అప్రమత్తం చేశారు.

అదిగదిగో గంజాయి...

- పాలుట్ల.. కృష్ణానది వెంట సాగవుతున్న పంట
- వై.పాలెం.. దోర్నాలల్లో జోరుగా విక్రయాలు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే

ప్రమాదకరమైన నిషేధిత గంజాయి సాగు నల్లమల కేంద్రంగా విస్తరిస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడం.. అధికారుల నిఘా, పర్యవేక్షణ సాధ్యం కాకపోవడంతో గంజాయి వ్యాపారులు నల్లమలను అడ్డాగా మార్చు...

- పాలుట్ల కేంద్రంగా సాగు: నల్లమల అడవిలోని పాలుట్లపెంట గిరిజన గూడెంలోని పొలాల్లో ఇది చాన్నాళ్లుగా గుట్టుగా సాగవుతోంది. గంజాయి వ్యాపారులు ఇక్కడి కొంతమంది గిరిజన రైతులకు ఎక్కువ డబ్బు ఎరగా చూపి సాగులోకి దించుతున్నారు. ఈ



ప్రతిభ

2017 క్రీడలు

జనవరి

8: చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ టైటిల్‌ను రాబర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్) గెలుచుకున్నాడు.

22: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్ ప్రి గోల్డ్ టైటిల్ నెగ్గింది. ఫైనల్లో చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను ఓడించింది.

28: ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా సెరెనా విలియమ్స్ (అమెరికా) నిలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నెగ్గాడు. ఫైనల్లో రఫెల్ నాదల్ (స్పెయిన్)ను ఓడించాడు.

ఫిబ్రవరి

7: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సౌరభ్ వర్మ నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రితూపర్ణ దాస్ చేజిక్కించుకుంది.

12: భారత అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్‌లో పాకిస్థాన్‌పై నెగ్గింది.

మార్చి

7: మొబైల్ తయారీ సంస్థ ఒప్పో అయిదేళ్ల కాలానికి రూ. 1079 కోట్లు చెల్లించి టీమిండియా స్పాన్సర్‌షిప్ సొంతం చేసుకుంది.

ఏప్రిల్


2: ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా పీవీ సింధు నిలిచింది. రన్నరప్ కరోలినా మరిన్ (స్పెయిన్).

23: మాంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. ఈ టోర్నీ విజేతగా నిలవడం నాదల్‌కు ఇది పదోసారి కావడం విశేషం. దీంతో క్లే కోర్టులపై అత్యధికంగా 50 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు.

30: భారత స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప ఆసియా స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన దీపిక పల్లికల్‌పై నెగ్గింది.

మే

6: అజ్లాన్‌షా హాకీ టోర్నీ విజేతగా బ్రిటన్ నిలిచింది. మలేసియాలోని ఇఫోలో జరిగిన టోర్నీలో ఆస్ట్రేలియా రన్నరప్‌గా, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.



15 జులై

వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా గార్బైన్ ముగురుజ (స్పెయిన్) నిలిచింది. రన్నరప్ వీనస్ విలియమ్స్ (అమెరికా).



29 అక్టోబరు

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ నెగ్గాడు. తద్వారా ఒక ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డు సృష్టించాడు.

పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేత...?

21: ఐపీఎల్ -2017 (సీజన్ 10) విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో రైజింగ్ పుణె సూపర్ జైంట్స్‌పై విజయం సాధించింది. మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా ముంబయి నిలిచింది.

28: దక్షిణ కొరియా జట్టు సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచింది. ఫైనల్లో చైనాపై నెగ్గింది.

జూన్

4: తెలుగు తేజం భమిడిపాటి సాయి ప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గాడు. సాయి కెరియర్‌లో ఇదే తొలి ప్రి గోల్డ్ టైటిల్.

10: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా జెలెనా వోస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. రన్నరప్ సిమోనా హలెప్ (రొమేనియా).

✪ పురుషుల సింగిల్స్ విజేతగా రఫెల్ నాదల్ (స్పెయిన్) నిలిచాడు. రన్నరప్‌గా వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు.

18: ఇండోనేషియా ఓపెన్ సూపర్‌సిరీస్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ కజుమస సకాయ్ (జపాన్).

10 ఫిబ్రవరి

హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ద్విశతకం (204) నమోదు చేశాడు. తద్వారా వరుసగా 4 టెస్ట్ సిరీస్‌ల్లో డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు.



1 మార్చి

2015-16 సీజన్‌కు బీసీసీఐ వార్షిక అవార్డులను ప్రకటించింది. పాలీ ఉమ్రిగర్ అవార్డును విరాట్ కోహ్లికి ప్రకటించారు. 2011-12, 2014-15 లో కూడా ఈ అవార్డు గెలుచుకున్న కోహ్లి, మూడుసార్లు దీనికి ఎంపికైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.

జులై

9: భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 29 (12 + 5 + 12) పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

15: వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేతగా రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నిలిచాడు. లండన్‌లో జరిగిన ఫైనలో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

23: మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. లండన్‌లోని లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గింది. భారత్ జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించారు.

24: యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. రన్నరప్ - భారత క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్.

ఆగస్టు

6: లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ స్వర్ణం నెగ్గాడు. ఉసేన్ బోల్ట్ (జమైకా) తన చివరి రేసులో కాంస్యానికే పరిమితమయ్యాడు.

17: బల్గేరియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కు చెందిన లక్ష్యసేన్ నెగ్గాడు.

27: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఒకుహర (జపాన్) నెగ్గింది. రన్నరప్‌గా పీవీ సింధు నిలిచింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) నెగ్గాడు.

సెప్టెంబరు

5: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా హరియాణాకు చెందిన కవితాదేవి చరిత్ర సృష్టించింది.

7: కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్ స్వర్ణాలు నెగ్గారు.

10: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను స్లోన్‌స్టీవెన్స్ (అమెరికా) గెలిచింది. ఫైనల్లో మాడిసన్ కీస్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. రన్నరప్ - కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా).

17: కొరియా ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా పీవీ సింధు నిలిచింది. సియోల్‌లో జరిగిన ఫైనల్లో ఒకుహర (జపాన్)పై నెగ్గింది.

అక్టోబరు

22: ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో 2-1 తో మలేసియాపై నెగ్గింది.

✪ డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ లీ హ్యున్ (దక్షిణ కొరియా).

28: భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా అండర్ -17 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. కోల్‌కతాలో జరిగిన ఫైనలో 5-2 గోల్స్‌తో స్పెయిన్‌ను ఓడించింది.

30: బ్రిటన్ రేసర్ లూయిస్ హామిల్టన్ ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు.

నవంబరు

5: మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. జపాన్‌లోని కకామిగహరలో జరిగిన ఫైనల్లో చైనాపై నెగ్గింది.

8: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ విజేతలుగా నిలిచారు.

27: భారత స్టార్ పంకజ్ అడ్వాణీ ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్ విజేతగా నిలిచాడు. పంకజ్ కెరియర్‌లో ఇది 18 వ ప్రపంచ టైటిల్.

డిసెంబరు

8: ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బాల్ అవార్డును పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోకు పారిస్‌లో ప్రదానం చేశారు. రొనాల్డో ఈ అవార్డు గెలుచుకోవడం ఇది అయిదోసారి.

27: దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజబెత్‌లో ఐసీసీ ప్రయోగాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

28: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను విశ్వనాథన్ ఆనంద్ గెలుచుకున్నాడు.

2017 పర్యటనలు

జనవరి

7: ఏడు రోజుల పర్యటన నిమిత్తం పోర్చుగల్ ప్రధానమంత్రి ఆంటోనియో కోస్టా దిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

11: భారత పర్యటనలో భాగంగా కెన్యా అధ్యక్షుడు ఉహురు కెన్యాట్టా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని మోదీలతో దిల్లీలో సమావేశమయ్యారు.

ఫిబ్రవరి

21: అమెరికా నుంచి వచ్చిన 26 మంది శాసనకర్తల బృందం ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమైంది. అమెరికాలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బృందం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

✪ భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మార్చి

6: ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ రెండు రోజుల పాటు జకార్తాలో పర్యటించారు. మొట్టమొదటి ఐఓఆర్ఏ (ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) నాయకత్వ సదస్సులో పాల్గొన్నారు.

7: ఉగాండా ప్రధానమంత్రి రుహాకనా రుగుండా అయిదు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

ఏప్రిల్

8: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

10: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మోదీతో సమావేశమయ్యారు.

28: సైప్రస్ అధ్యక్షుడు నికోస్ అనస్తాషియెస్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మే

11: ప్రధాని మోదీ రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించారు. కొలంబోలో నిర్వహించిన అంతర్జాతీయ వేసక్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

31: ప్రధాని మోదీ స్పెయిన్ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మారియానో రజోయ్‌తో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

జూన్

1: మోదీ రష్యా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమయ్యారు. నాగ్‌పుర్-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగవంతమైన రైలు సర్వీసు ఏర్పాటుకు ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

3: ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో పారిస్‌లోని అధ్యక్ష భవనం ఎల్సీ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు.

9: కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు.

24: ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటనలో భాగంగా పోర్చుగల్ ప్రధాని ఆంటోనియా కోస్తాతో సమావేశమయ్యారు.

27: మూడు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.

✪ అమెరికా పర్యటన తర్వాత మోదీ నెదర్లాండ్స్ చేరుకుని, ప్రధాని మార్క్ రూత్‌తో సమావేశమయ్యారు.

జులై

5: ప్రధాని మోదీ మూడురోజుల ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జెరూసలేంలో చర్చలు జరిపారు. అధ్యక్షుడు రూవెన్ రివ్లిన్‌తోనూ సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ సందర్శించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

7: జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఆగస్టు

24: నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు. ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి.

31: స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు డోరిస్ లూథర్డ్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

సెప్టెంబరు

4: చైనాలోని షామన్‌లో జరిగిన బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

12: బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

14: రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని షింజో అబే ప్రధాని మోదీతో గాంధీనగర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అక్టోబరు

4: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాలుగు రోజుల తొలి విదేశీ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు ఒమర్‌గులేహ్‌తో జిబూతీలో సమావేశమయ్యారు.

24: అఫ్గనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు.

30: ఇటలీ ప్రధానమంత్రి పవోలో జెంటిలోని భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

నవంబరు

1: భారత పర్యటనలో భాగంగా భూటాన్ రాజు జిగ్మేఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో దిల్లీలో సమావేశమయ్యారు.

13: మనీలాలో 'ఆసియాన్' వాణిజ్యవేదిక సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

14: మనీలాలో నిర్వహించిన 15 వ ఆసియాన్-భారత్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు.

డిసెంబరు

13: కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ పెట్రీషియా స్కాట్‌ల్యాండ్ నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

23: రష్యా ఉపప్రధాని దిమిత్రీ రొగోజిన్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

రచయిత – సీహెచ్ కృష్ణప్రసాద్

1 ఏప్రిల్

భారత్‌లో ఆరు రోజుల పర్యటనకు వచ్చిన మలేసియా ప్రధానమంత్రి నజీబ్ అబ్దుల్ రజాక్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.



30 మే

ప్రధాని మోదీ నాలుగు దేశాల పర్యటనలో భాగంగా జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌తో బెర్లిన్‌లో సమావేశమయ్యారు. 12 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు.



6 సెప్టెంబరు

ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మొదటిసారిగా మయన్మార్ చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూచీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



5 అక్టోబరు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇథియోపియా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు మాలాతు తెషోమేతో రాజధాని అడిస్ అబాబాలో చర్చలు జరిపారు.



Beesula Rajaiah, Mahadevpur

Q: Respected sir, please explain the meanings of the following words in Telugu with examples.

1. Perception 2. Perpetuate 3. Crave for
4. Take leave of 5. Supervision 6. Astonishment
7. Case of

A: 1) దేన్నైనా మనం అర్థం చేసుకునే తీరు. Eg: My perception of his nature is different from the others' perception of his nature.

2. Do something bad. Eg: He perpetuated the murder.

3. పరితపించి పోవడం. Eg: Having lost his mother in his early age, he is craving for a mother's love.

4. వీడ్కోలు పలకడం. Eg: He took leave of his father before going to America.

5. పర్యవేక్షణ. Eg: Under his supervision the work was done well.

6. విపరీతమైన ఆశ్చర్యం. Eg: I was filled with astonishment when I heard that I won a lakh rupees in the lottery.


7. The correct expression is 'in case of' = ఆ పరిస్థితిలో

Eg: In case of serious illness go to a doctor.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

VOCABULARY



1. Expedite = Speed up. (వేగవంతం చేయడం)

Eg: The manager wanted the setting up of another branch of the company expedited.

✪ Expedite X Slow down (తాత్సారం చేయడం).

Eg: The progress of the work on the bridge has slowed down.

2. Interrupt = To cause a break (అంతరాయం కలిగించడం).

Eg: To announce something, he interrupted the programme.

✪ Interrupt X Continue (కొనసాగించడం).

Eg: They continued the programme without any interruption.

3. Sedentary = Not moving / seated at a place / stationary (ఒకేచోట కూర్చుని చేసే పని)

Eg: A clerk's job is a sedentary job (because they are seated most of the time and do not move).

✪ Sedentary X mobile (moving) (కదిలే).

Eg: A police constable's job is mobile.

4. Transparent = a) Allowing light to pass through so that objects on the other side can be seen (పారదర్శకమైన).

Eg: Glass is transparent X opaque (కాంతిని అడ్డుకునే)

b) Easy to understand (సులభంగా అర్థం చేసుకునే).

Eg: His ideas are very transparent

✪ Transparent X dark / difficult to understand (అర్థం కాని).

5. Adequate = Enough (చాలినంత)

Eg: He has adequate money to buy a house.

✪ Adequate X Inadequate / meagre (తక్కువైన).

Eg: His earnings are so meagre that he cannot buy a house.



Writer

- M. Suresan

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to:
pratibhadesk@eenadu.net

Wish strongly for something...

Chinna Gowd

Q: Sir, please define the following words in Telugu with some examples.

1. Conjugation of tenses
2. Voice (active& passive)
3. Transcoding information
4. Vowel 5.Consonant 6. Dipthongs
7. Semi-vowels 8. Spotting errors
9. Paranyms 10. Aspect.

A: 1) Conjugation of tenses means forming the present tense, the past tense and the future tense of a verb, along with the subdivisions - the simple, continuous, the perfect and the perfect continuous tenses of a verb. (ఒక verb కు Tenses ఏర్పరచడాన్ని conjugation అంటారు. ప్రస్తుతం, ఎప్పుడూ, అలవాటు ప్రకారం చేసేది present tense. గతంలో ఉండటం, జరిగిన వాటిని past tense అంటాం. భవిష్యత్‌లో జరిగేదాన్ని future tense అంటాం.

2. In the active voice, we say, somebody does something, and in the passive voice, we say something is done by somebody (Active voice అంటే ఒకరు ఒక పని చేశారు అని చెప్పడం. Passive voice అంటే ఒకరి చేత ఒక పని చేయబడింది అని చెప్పడం).

Eg: Active Voice: Ramana says something.
Passive voice: Something is said by Ramana.

Only verbs with objects have passive voice, except in the case of imperative sentences like, orders, requests, etc. (ఆజ్ఞలు, విన్నపాలు లాంటి వాక్యాలకు తప్ప, object లేని verbs కు passive voice ఉండదు.)

3. Transcoding information is adapting information to the digital version. This is technical, and however much it may be explained here, it is difficult to understand. (డిజిటల్ పద్ధతిలో సమాచారాన్ని మార్చడాన్ని Transcoding అంటారు. ఇది పూర్తిగా సాంకేతికం.)

4. Vowel sounds are sounds which we utter

SPOKEN ENGLISH
ఆంగ్లభాషణ 972

with our mouths open, vowel sounds అంటే తెలుగులో అచ్చులు. and the tongue or the lips not touching the other parts of the mouth. Vowels are not letters but the sounds of speech made by the organs of the mouth. (అచ్చులు అంటే అక్షరాలు కావు. నోటితో ఉచ్చరించే శబ్దాలు. In English the sounds represented by a, e, i, o, and u are vowel sounds. ఆంగ్లంలో a, e, i, o, u లు తెలిపే శబ్దాలను vowels అంటారు).

5. Consonant sounds are those which are made by the contact of one organ of the mouth with another organ of the mouth. Except the sounds represented by a, e, i, o and u are consonants. Consonants అంటే హల్లులు. ఆంగ్లంలో a, e, i, o, u లతో లేని శబ్దాలను consonants అంటాం.


6. Diphthongs are sounds formed by a combination of two vowels in a single syllable, in which the sound begins as one vowel, and moves towards another. Eg: Coin, loud, side. In coin, the sound begins with o and moves towards i. So here, the combination of the sounds of 'o' and 'i' is a diphthong.

7. A semivowel is a sound that is between a vowel and a consonant. Eg: H and Y.

8. Spotting errors means finding out the mistakes in a sentence.

9. Paranyms are euphemisms, that is, expressing an unpleasant matter in a pleasant manner. Eg: He is not such a fool as to be cheated by anybody.

10. Aspect is the positioning of something - it has other meanings too.



Kaja Syamala

Q: Please let me know the following in English

ఈ రోజుల్లో వచ్చే సినిమా హీరో, హీరోయిన్స్‌ను చూడలేకపోతున్నాం. చూడటానికి ఎవరూ బాగుండటం లేదు - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లో ఏమనాలి?

A: We find it difficult to see / we cannot see the heroes and heroines of today, as none of them is good looking.

Raju Surla

Q: Dear sir, please explain the following words in Telugu with examples.

1. Convulsed with 2. Convicted of
3. Convinced of 4. Distinguish from
5. Die for

A: 1. బాగా వణికిపోవడం, మన అదుపు లేకుండా

Eg: Because of a high fever, he was convulsing.

2. Punished (శిక్షపడటం). **Eg:** The judge convicted him to six months in jail.

3. This is the same as No 2.

4. Make a difference (వ్యత్యాసం చూపడం).

Eg: The teacher distinguished him from the others in the class because he was very clever.

5. Wish strongly for something.

Eg: Having lost his parents he is dying for parental love.

Grammar & Usage



In the last lesson we have seen the uses of was/were, the past doing word (Eg: saw, went, took, loved, linked, etc.) Now we are going to see the past perfect forms and the past perfect continuous forms.

Examples of the past perfect continuous tense: a) Had been, b) had + PP (past participle / V3).

'Had been' talks of an earlier of two past states of being (గతంలో రెండు ఉండటాలు ఉన్నప్పుడు, ముందర ఉన్నదానికి had been వాడతాం.)

He had been an MLA, before he was a minister. (అతడు మంత్రిగా ఉండే ముందు MLA గా ఉన్నాడు. అంటే ఇప్పుడు మంత్రిగా కూడా లేడు).

He had been in Vijayawada and then he was in Mumbai (మొదట విజయవాడలో ఉన్నాడు. తర్వాత ముంబయిలో ఉన్నాడు - ఇప్పుడు ముంబయిలో కూడా లేడు)

'Had been' అనేది 'be' form కదా, అంటే అది ఉండటాన్ని తెలుపుతుంది. ఇప్పుడు had + PP (V3) గురించి తెలుసుకుందాం. ఉదా: had seen, had gone, had done, etc. This verb talks about an action earlier than another past action. అంటే గతంలో రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

Eg: a) He told me yesterday that he had seen the movie. (నిన్న నాతో చెప్పాడు తాను ఆ సినిమా (అంతకు ముందే) చూశానని - గమనించండి: ఇక్కడ గతంలో జరిగిన రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

b) The train had left before I entered the station (నేను స్టేషన్లోకి ప్రవేశించకముందే రైలు వెళ్లిపోయింది) - ఇక్కడ కూడా, రెండు గతంలో జరిగిన పనులు ఉన్నాయి. ముందు జరిగింది రైలు వెళ్లిపోవడం, తర్వాత నేను ప్రవేశించడం. ఇదీ had + PP (V3) ఉపయోగం. తర్వాతి verb, had been + ing: ఇది గతంలో ముందు ప్రారంభమై, రెండో పని జరిగేవరకు కొనసాగిన పనిని తెలుపుతుంది.


Eg: She had been working here until she got transferred (ఆమె బదిలీ అయ్యేవరకు ఇక్కడే పని చేస్తూ ఉండేది). ఇక్కడ ఆమె పని చేయడం, ఆమె బదిలీ అయ్యేవరకు కొనసాగింది. అందుకని ఒక పని ముందర ప్రారంభమై, రెండో పని జరిగే వరకు కొనసాగిన పనిని had been + ing form లో తెలుపుతాం. ఇవన్నీ కూడా past tense forms. మరి కొన్ని వివరాలు వచ్చేవారం.

గర్భిణి అనుమానాస్పద మృతి

● అత్తింటి వారే చంపేశారు : బాధితుల ఆరోపణ ● కడవకుదురులో విషాదం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రేమ్‌కాజల్

కడవకుదురు, (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురులో ఓ గర్భిణి అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. అత్తంటి వారే ఆమెను అంతమొందిచారంటూ బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాధితుల, స్థానికుల వివరాల ప్రకారం ... కడవకుదురుకు చెందిన బత్తిన సుబ్బారావు, రమాదేవిల రెండో కుమారుడు వెంకటేష్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం ఒంగోలుకు చెందిన పాపిన సుబ్బారావు, పద్మల కుమార్తె మంజువైష్ణవి (22)ని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆమె ప్రస్తుతం అయిదు నెలల గర్భిణి. కడవకుదురులోని అత్తారింటిలోనే ఉంటోంది. వెంకటేష్ రాయగడలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఇటీవలే కడవకుదురు వచ్చారు. శనివారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నర సమయంలో చేనుకు వెళ్లి ఇంటికొచ్చేసరికి కోడలు ఇంట్లో దూలానికి ఉరేసుకుని మృతిచెంది ఉందని అత్త రమాదేవి చెబుతోంది. ఆ సమయంలో తన కుమారుడు కూడా లేడని, స్థానికుడి సాయంతో మృతదేహాన్ని కిందకు దింపామని ఆమె అంటోంది. అయితే మధ్యాహ్న సమయంలో భార్యాభర్తలు వెంకటేష్, మంజువైష్ణవి ఆరుబయట ఘర్షణ పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఉరేసుకున్నట్లు చెబుతున్న దూలానికి నాలుగు అడుగుల కిందనే డబుల్‌కాట్ ఉంది. దూలానికి వేలాడుతున్న చీర వదులుగా ఉంది. సంఘటన స్థలాన్ని చీరాల డీఎస్పీ ప్రేమ్‌కాజల్, ఇంకొల్లు సీఐ శేషగిరిరావు రాత్రి మృతదేహాన్ని పరిశీలించారు. మంజువైష్ణవి తల్లిదండ్రులు సుబ్బారావు, పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తింటివారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమరిశెట్టి సురేష్ తెలిపారు.

అత్తింటివారే కారణం

ప్రేమించి పెళ్లి చేసుకొని నిత్యం హింసించి చివరకు చంపేశారని మృతురాలి తల్లిదండ్రులు పద్మ, సుబ్బారావు, అన్న రవితేజ, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కట్నం తెమ్మని భర్త వెంకటేష్, అత్త రమాదేవి, బావ, తోటికోడలు వేధించేవారని వారు ఆరోపించారు. ఒక్కోసారి అంగన్‌వాడీ కేంద్రంలో పెట్టే అన్నం తిని తమ బిడ్డ రోజులు గడిపిందని పద్మ రోదిస్తూ ఎస్సైకు వివరించింది. కుమార్తె నర్సు కోర్సు చదివినా ఆదరించలేదని ఆమె విలపించింది.



బ్యాంకులో ఇచ్చిన రూ.పది నోట్ల కట్టలను చూపుతున్న పంచాయతీ కార్యదర్శులు



పంచాయతీ కార్యదర్శి గదిలో ఉంచిన నగదు సంచులు

పింఛను పంచాలంటే... సంచులు మోయాల్సిందే!

సామాజిక భద్రత పింఛను పంపిణీ చేయాలంటే... బస్తాల్లో నగదు తీసుకువెళ్లాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. విషయానికి వస్తే... మార్కాపురం మండలంలో 3,500 మంది పింఛనుదారులు ఉన్నారు. ఈ ఏడాది నూతనంగా మరో 400 మందికి మంజూరు చేశారు. వీరందరికీ కలిపి నెలకు రూ.50 లక్షల వరకు పంపిణీ చేస్తున్నారు. ఈ నగదును స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి తెస్తుంటారు. ఇప్పటి వరకు రూ.500, రూ.2 వేల నోట్లను ఇచ్చేవారు. గత రెండు నెలలుగా రూ.10, రూ.20, రూ.100 నోట్లు ఎక్కువగా ఉన్నాయని చెప్పి... బ్యాంకు వారు వాటినే కార్యదర్శులకు అందజేస్తున్నారు. అంత మొత్తానికి... చిన్న నోట్లను బస్తాల్లో తీసుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా పంపిణీ సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై బ్యాంకు అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

జాతీయ తైక్వాండోలో ఓవరాల్ ఛాంపియన్ ఆంధ్రప్రదేశ్

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు వేదికగా శనివారంతో ముగిసిన 21వ జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం ప్రారంభమైన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, మహారాష్ట్ర, ఝార్ఖండ్ జట్లు పాల్గొన్నాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవగా.. ద్వితీయ స్థానాన్ని కర్ణాటక కైవసం చేసుకుంది. మహారాష్ట్ర మూడో స్థానంలో నిలిచింది. మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే దామచర్ల హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మంత్రి, ఎమ్మెల్యేలకు అఖిల భారత తైక్వాండో సంఘం అధ్యక్షుడు, ఏడో డాన్ వి.మారుతీ ప్రసాద్ జ్ఞాపికలు అందజేశారు. పోటీల్లో భాగంగా క్రీడాకారులు తమ ప్రతిభతో ఆకట్టుకోగా- శిక్షణ సందర్భంగా జూనియర్ తైక్వాండో క్రీడాకారులు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి.



పోటీలో తలపడుతున్న తైక్వాండో క్రీడాకారులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: 2018 సంవత్సరం జయప్రదం కావాలంటే..., లక్ష్మీదేవి అనుగ్రహం కోసం సంప్రదాయరీత్యా 2018ని ఎలా స్వాగతించాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: సామాన్యుడు (జగపతిబాబు).

సాయంత్రం

04-30: పుష్పకవిమానం (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...) కమల్‌హాసన్, రేవతి, ఊర్వశి నటించిన 'ఆడవాళ్ళకు మాత్రమే' - చిత్ర విశేషాలు, 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: ఇట్స్ టైమ్ టు పార్టీ 2018 (గ్రాండ్ ఈవెంట్) న్యూఇయర్ స్పెషల్ నవ్వుల నజరానా...

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్
12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా
01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్
02:00 పటాస్ పంచెస్ రిపీట్
03:00 క్రిరాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్
05:00 సండే కామెడీ మూవీ.. 'శ్రీ కనక మహాలక్ష్మీ రికార్డింగ్ డాన్స్ ట్రూప్'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్
08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్
09:30 నా షో నా ఇష్టం రిపీట్
10:30 సినిమా చూపిస్త మావ రిపీట్
11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

★ సద్గురు సన్నిధిలో (ఉ.6:00)
★ మానస (ఉ.6:30, 7:00, 10:00, 10:30, 11:00)
★ సైజ్ జీరో (ఉ.7:30)
★ అమృతం (ఉ.8:00, మ.12:00, 1:00, సా.6:00, రా.8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.12:30, 1:30, సా.6:30, రా.08:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.2:00, రా.7:00, 9:00, 10:00)
★ డా.ఈటీవి (ఉ.9:30, మ.2:30, 3:30, రా.7:30, 9:30, 10:30)
★ అందరికి ఆరోగ్యం (మ.3:00)
★ అమృతం చిరుధాన్యాలు స్పెషల్ (రా.11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మధురానగరిలో (శ్రీకాంత్, నిరోషా) 10-00: మార్నింగ్ షో: బ్రహ్మచారి (ఏఎన్నార్) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మగమహారాజు (చిరంజీవి) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: రాజ్‌కుమార్ (శోభన్‌బాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: నర్తనశాల (ఎన్టీఆర్, సావిత్రి) 10-00: సూపర్‌మస్తీ: వండర్‌ఫుల్ ఈవెంట్.

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఆకుకూర చిరుధాన్యాల పూరీ & బుల్గుర గోధుమ బెర్రీ క్రేప్స్, ఉ.8:30 వావ్ ఏమి రుచి - బొహెమియన్ సాస్ & ఆనియన్ రింగ్స్, ఉ.9.30: గోరుముద్దలు - సూజీ & బ్రెడ్ పిజ్జా, ఉ.9.45: మమ్మీస్ కిచెన్ - కోకోనట్ కాజు మైసూర్ పాక్, ఉ.11.00: బాబాయ్ హోటల్ - తెలగపిండి ఎండు రొయ్యలు కూర & రొయ్యల కారం, ఉ.11.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా ముర్గ్, మ.12.00, రా.8.30: సూపర్ భీమ్ - గేమ్ షో, మ.1.00, సా.5.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం (న్యూ ఇయర్ స్పెషల్స్), మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా షెఫ్ - పొటాటో వీల్స్, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - పుట్నాలపిండి పాపిడి & స్వీట్ ఊతప్పం, మ.2.45: పదండి విందుకు - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - మఖనీ ఔర్ పన్నీర్ మఖ్‌మలీ, సా.3.30: కారాలు, పొడులు - మెంతి గసాల కారం పొడి & మెంతి రోటి పొడి, సా.4.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా ముర్గ్, రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఖీమ సమోసా, రా.7.45: డైట్ మెనూ - మష్రూమ్ ఆమ్లెట్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల ఛాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ౦, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360 ౦, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వైద్యరంగం@2017, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మహాగణపతి దేవస్థానం, కల్పతి అగ్రహారం, పాలక్కడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360౦, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360౦, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360౦, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ నందీశ్వరస్వామి దేవస్థానం, రాయచూర్, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: వైద్యరంగం@2017, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360౦, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఏ ఛానల్లో ఏముంది.. 31-12-2017

SVBC: **ఉదయం:** 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 వేదసూక్తం, 11-30 స్పెషల్ న్యూస్ - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 నరసింహ దివ్యక్షేత్రాలు, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి సేవ + స్పెషల్ న్యూస్ + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ ఆలయం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 లైవ్ నామసంకీర్తనం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీగణేశ సహస్రం, 6-30 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 అర్చన, 7-30 శ్రీ కనకధారస్తోత్రం, 8-00 పుణ్యక్షేత్రం, 9-00 వారఫలం, 10-00 వైకుంఠవైభవం, 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం.. జీవననాదం, 04-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనక ధారస్తోత్రం, 5-30 శ్రీగణేశసహస్రం, 06-00 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 భక్తివిశేషాలు 7-30 అదృష్టం-2018, 8-30 వైకుంఠవైభవం, 9-00 వారఫలం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు 11-00 స్వాగతం-2018 (లైవ్).

జీ తెలుగు: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 జీటియమ్- టెలీషాపింగ్, 07-30 ఓం కారం, 08-00 డా. సుభాష్ చంద్ర షో, 10-00 సినిమా: సుప్రీమ్, 9-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017, **మధ్యాహ్నం:** 01-00 సినిమా: రారండోయ్ వేడుక చూద్దాం, 04-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017 , **సాయంత్రం:** 06-00 సినిమా: శ్రీమంతుడు, **రాత్రి:** 09-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 10-00 గోల్డ్‌రష్ (రిపీట్), 11-00 పోలీస్ డైరీ.

మా: **ఉదయం:** 06-30 మ్యూజిక్ బాక్స్, 07-00 ఫిల్మ్ బేస్డ్, 07-30 విహారి, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 09-00 సినిమా: సింగం–3, **మధ్యాహ్నం:** 12-30 సినిమా: జనతా గ్యారేజ్, 04-00 సినిమా: మన్యం పులి, **సాయంత్రం:** 07-00 సినిమా: ఫిదా, 10-00 సాహో రే 2018.

జెమిని: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 స్పెషల్ ప్రోగ్రామ్, 08-30 సినిమా: కిట్టు ఉన్నాడు జాగ్రత్త, **మధ్యాహ్నం:** 11-20 సినిమా: అల్లుడు శీను, 02-25 సినిమా: టెంపర్, **సాయంత్రం:** 05-30 సినిమా: పైసా వసూల్, **రాత్రి:** 08-30 ఫిదా: మీ ఫేవరేట్ స్టార్‌తో.., 09-30 బ్లాక్ బాస్టర్, 10-30 హ్యాపీ హ్యాపీ 2018.

HBO: ఉదయం: 06-14 స్టార్ ట్రెక్, 08-19 బీతోవెన్, 09-57 ది డిక్టేటర్, 11-23 ఐరన్‌మ్యాన్, మధ్యాహ్నం: 01-36 ది హ్యాంగ్ ఓవర్ పార్ట్ 2, 03-19 మడ్‌గాస్కర్: ఎస్కేప్ 2 ఆఫ్రికా, సాయంత్రం: 04-58 ది డార్క్‌నైట్ రైజెస్, రాత్రి: 08-00 ట్రాన్స్‌ఫార్మర్స్ : రివెంజ్ ఆఫ్ ది ఫాలెన్, 10-43 జి.ఐ.జో :రిటాలియేషన్.

STAR MOVIES: **ఉదయం:** 06-16 పెర్సీ జాక్సన్: సీ ఆఫ్ మాన్‌స్టర్స్, 08-23 ది అడ్వెంచర్స్ ఆఫ్ టిన్‌టిన్, 10-30 జుమాంజి, **మధ్యాహ్నం:** 12-40 జూటోపియా, 02-46 ట్రోల్స్, **సాయంత్రం:** 04-34 ఇండిపెండెన్స్‌డే :రిసర్జెన్స్, రాత్రి: 07-06 కుంగ్ ఫూ పాండా 3, 09-00 రోగ్ వన్: ఎ స్టార్ వార్స్ స్టోరీ, 11-48 ఛాపి.

PIX: ఉదయం: 06-00 ది గార్డియన్, 07-50 2012, 11-15 ది షాలోస్, మధ్యాహ్నం: 01-00 ది మమ్మీ రిటర్న్స్, 03-51 బిగ్ హీరో 6, సాయంత్రం: 06-03 ది కరాటే కిడ్, రాత్రి: 09-14 లూసి, 11-00 హిట్స్.

StarGOLD: ఉదయం: 05-30 లిటిల్ కృష్ణ 3: ది వండరస్ ఫీట్స్, 07-30 సింగం రిటర్న్స్, 10-35 సర్దార్‌జీ 2, మధ్యాహ్నం: 01-35 హౌజ్‌ఫుల్ 2, సాయంత్రం: 05-00 సన్ ఆఫ్ సర్దార్, రాత్రి: 07-55 సింగం, 11-00 బజరంగీ బాయ్‌జాన్.

ప్రకాశం జిల్లా.. క్రీడల ఖిల్లా..!

- కొనియాడిన శాప్ ఎండీ బంగార్రాజు
- అధికారులతో కలిసి మినీ స్టేడియం పనుల పరిశీలన
- పనుల జాప్యంతో అధికారులపై అసహనం
- ఫిబ్రవరిలో అందుబాటులోకి తెస్తామని వెల్లడి

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే

ప్రకాశం జిల్లా క్రీడాకారుల్లో అంతులేని ప్రతిభ దాగుందని, వివిధ రాష్ట్ర స్థాయి పోటీల జట్లలో 30 శాతం మంది జిల్లా క్రీడాకారులు ఉండటమే అందుకు నిదర్శనమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎండీ ఎన్.బంగార్రాజు కొనియాడారు. శనివారం ఆయన డీఎస్‌డీవో యతిరాజ్, హౌసింగ్ ఏఈ పవన్‌కుమార్, డీఈ నాగేశ్వరరావు, కాంట్రాక్టర్ చెన్నుపాటి ప్రసాద్‌తో కలిసి ఒంగోలులోని మినీ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే ప్రకాశం జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎక్కువన్నారు. కేవలం జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఎంతో మంది సత్తా చాటారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జన్మభూమి కార్యక్రమంలో క్రీడలను మమేకం చేశారని, ఆ కార్యక్రమాన్ని జిల్లా నుంచే ప్రారంభిస్తున్న నేపథ్యంలో తాను మినీ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ మండలాల్లో శిక్షకులను నియమించి.. వారికి సరైన శిక్షణ ఇస్తున్నామని.. మినీ స్టేడియంతోపాటు యరజర్లలో 45 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్రీడా ప్రాంగణం జిల్లా క్రీడాకారులకు వరంగా మారనుందన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంను ఫిబ్రవరి రెండో వారంలో అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్టేడియంను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అందుబాటులోకి రానున్న మినీ స్టేడియంను చక్కగా వినియోగించుకుని క్రీడల్లో మరింత రాణించాలని క్రీడాకారులకు సూచించారు. వివిధ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటగల 14 నుంచి 17 ఏళ్ల వయసున్న 100 మంది క్రీడాకారులను గుర్తించామని, వారికి ముందుగా ఏపీలోని అకాడమీలు, ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయి అకాడమీల్లో శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ క్రీడావనిపై ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్ఠలు చాటేలా తయారు చేస్తున్నామన్నారు. స్టార్ షెట్లర్లు పీవీ సింధు, శ్రీకాంత్‌తో పాటు ఇతర క్రీడల్లో రాణిస్తున్న వారిని జిల్లాలకు పంపి.. వర్ధమాన క్రీడాకారులతో వారిని మమేకం చేస్తామన్నారు. తద్వారా కొత్తతరం క్రీడాకారుల్లో పోరాట స్ఫూర్తిని నింపుతామన్నారు. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 11వరకూ జన్మభూమి క్రీడా పోటీల్లో భాగంగా ప్రతి గ్రామంలో త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడో తేదీ అన్ని మండల కేంద్రాల్లో 5కెరన్, ఫిబ్రవరి 20 నుంచి మార్చి 15 వరకూ టాలెంట్ హంట్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రతిభావంతులను గుర్తించి వారికి ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు.


పనులను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న శాప్ ఎండీ బంగార్రాజు

ఇప్పటి వరకూ ఏం చేశారు?

మినీ స్టేడియం నిర్మాణ పనుల్లో జాప్యంపై శాపం ఎండీ బంగార్రాజు అసహనం వ్యక్తం చేశారు. తాను ఎనిమిది నెలల కిందట పరిశీలనకు వచ్చినప్పటికీ, ఇప్పటికీ పనుల్లో పెద్ద మార్పు లేదని అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ప్రకాశం తీర ప్రాంతం కావడంతో తరుచూ తుఫాన్లు సంభవించడాన్ని పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా డిజైన్లు రూపొందించాలన్నారు. విద్యుత్తు పరికరాలు స్టాండర్డ్‌వే వాడాలన్నారు. మంచినీటి వసతి కోసం శుద్ధజల కేంద్రం వద్దని, మున్సిపాలిటీ నీరే ఉత్తమమని అన్నారు. స్టేడియంలో 500 లీటర్లు, 200 లీటర్ల సామర్థ్యంలో రెండు నీటి నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి స్టేడియం అంతటా కుళాయిలు ఏర్పాటు చేయాలని డీఎస్‌డీవో యతిరాజ్‌కు సూచించారు. ట్రాక్‌ను ఏర్పాటు? నిర్మాణం ఎలా నిర్మాణం తదితరాలను కడపకు వెళ్లి పరిశీలించి రావాలని కాంట్రాక్టర్ చెన్నుపాటి ప్రసాద్ సూచించారు. దానికి ఆయన తాను ఇప్పటికే కర్నూలు వెళ్లి పరిశీలించి వచ్చానని, ఇక డిజైన్లకు సంబంధించిన నమూనాలు కూడా ముందురోజే తనకు వచ్చాయని బదులిచ్చారు.

మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలన

అనంతరం ఒంగోలుకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సైతం మినీ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. అప్పటి వరకూ తాను పరిశీలించిన విషయాలను బంగార్రాజు వారికి వివరించారు. స్టేడియాన్ని అన్ని హంగులతో త్వరితంగా పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి, ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

బండ్లమిట్ట పాఠశాలలో 'విదేశీ' సందడి

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను అమెరికాకు చెందిన ఆరుగురు వనితలు శనివారం సాయంత్రం సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలకు కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజన పథకం, గత నాలుగేళ్లల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు తదితర వివరాలను ప్రధానోపాధ్యాయుడు సాయిశ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందానికి విన్సెంట్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత నెల రోజులుగా భారతదేశంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విదేశీయులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

- స్వచ్ఛ సర్వేక్షణ్ సభలో గజల్ శ్రీనివాస్


సభకు హాజరైన విద్యార్థులు, ప్రజలు


మొక్కలతో గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే దామచర్ల, అధికారులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పరిశుభ్రతలో ఒంగోలును ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రజల మీదనే ఉందని స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక అద్దంకి బస్టాండ్ కూడలిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో.. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తే ఆరోగ్యకర సమాజాన్ని చూడవచ్చన్నారు. పారిశుద్ధ్య కార్మికులు వేకువజామున మూడు గంటలకు నిద్ర లేచి మనం వేసిన చెత్తాచెదారం శుభ్రం చేస్తారని, ముందుగా వారి కృషిని అభినందించాలన్నారు. వారిని మన కుటుంబ సభ్యులుగా భావించి గౌరవించాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులను వేదిక మీదికి పిలిచి. . వారిని సత్కరించి కాళ్లకు నమస్కరించారు. మరో ముఖ్య అతిథి దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గత ఏడాది జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో దేశవ్యాప్తంగా నాలుగు వేల పట్టణాల్లో ఒంగోలు 70వ స్థానంలో నిలిచిందని.. ఈ సారి మొదటి పది స్థానాల్లో నిలిచేందుకు కృషి జరుగుతోందన్నారు. గత మూడేళ్లలో నగరంలో ఎంతో మార్పు తీసుకురాగలిగామన్నారు. డంపింగ్ యార్డు, డ్రెయిన్ల నిర్మాణంతో పారిశుద్ధ్యం మెరుగుపడిందన్నారు. ఇంటి నుంచే స్వచ్ఛభారత్ మొదలు కావాలన్నారు. సభలో గజల్ శ్రీనివాస్, నూకతోటి శరత్ బాబు స్వచ్ఛభారత్‌పై గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ బ్రహ్మయ్య, ఎంఈ సుందరామిరెడ్డి, నగర స్వచ్ఛ సర్వేక్షణ్ బ్రాండ్ అంబాసిడర్లు గోరంట్ల రవికుమార్, ఆరిగ శ్రీనివాసరావు, నగర తెదేపా అధ్యక్షుడు కొటారి నాగేశ్వరరావు, తెదేపా నాయకులు టీవీ శ్రీరామ్మూర్తి, మాజీ కౌన్సిలర్లు దాచర్ల రమణయ్య, ఈదర సురేష్, కె.రాంబాబు పాల్గొన్నారు.

వెన్నాడిన దురదృష్టం

దురదృష్టం వెన్నాడి... రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. వీరిలో ఒకరు ట్రాక్టర్ డ్రైవర్ కాగా మరొకరు ఆటో చోదకుడు. గ్రోత్‌సెంటర్, పేర్నమిట్ట ప్రాంతాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

సొంత ట్రాక్టర్ కిందే పడి...


వల్లెపు బుజ్జి మృతదేహం

గ్రోత్‌సెంటర్ (మద్దిపాడు), న్యూస్‌టుడే: ఓ డ్రైవర్ తన ట్రాక్టర్ కిందే పడి దుర్మరణం పాలయ్యాడు. గ్రోత్‌సెంటర్‌లో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దొడ్డవరం గ్రామానికి చెందిన వల్లెపు బుజ్జి (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన రాళ్ల ముక్కలు తెచ్చేందుకు తన భార్య రత్తాలుతో కలిసి గ్రోత్‌సెంటర్‌కు వెళ్లారు. హ్యాస్ గ్రానైట్ కంపెనీ సమీపంలో రాళ్లు లోడు చేసుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను వెనక్కు తిప్పేందుకని బుజ్జి... ట్రాక్టర్ ఎక్కబోయారు. ఈ క్రమంలో గేర్‌రాడ్‌ను ఊతంగా పట్టుకున్నారు. అప్పటికే వాహనం ఆన్‌లో ఉండడంతో... గేరు పడి ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు ఉరికింది. ఈ క్రమంలో బుజ్జి అదుపుతప్పి పడిపోయారు. ఆయన మీదుగా చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త ఇలా మృతి చెందడంతో భార్య రత్తాలు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు మృతదేహాన్ని తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ చక్రాల కింద నలిగి ఆటో డ్రైవర్...


ప్రమాద దృశ్యం

పేర్నమిట్ట (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: దురదృష్టవశాత్తు లారీ కింద పడి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందారు. పేర్నమిట్ట పోలీసు చెక్‌పోస్టు సమీపంలో శనివారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పేర్నమిట్టకు చెందిన దారా చెన్నయ్య ఆటో నడుపుతుంటారు. శనివారం రాత్రి తన ఆటోను పార్కింగ్ స్థలంలో ఉంచేందుకు... రహదారికి అటుగా ఉన్న వాహనాన్ని ఇటుగా తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆటో బోల్తా పడి... చెన్నయ్య రహదారిపై పడిపోయారు. అదే సమయంలో చీమకుర్తి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కంటెయినర్ ఆయన మీదుగా వెళ్లింది. చక్రాల కిందపడి తల భాగం నుజ్జవడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు.

మద్యం దుకాణం తొలగించాలని రాస్తారోకో

- స్తంభించిన వాహనాలు


భారీగా నిలిచిన వాహనాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలోని మద్యం దుకాణం తొలగించాలని కోరుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు శనివారం జాతీయ రహదారిపై బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించారు. ఎంపీపీ వేగినాటి ఓసూరరెడ్డి మాట్లాడుతూ 'పాఠశాలకు కేవలం 68 మీటర్ల దూరంలో దుకాణం ఏర్పాటు చేయడం అన్యాయం. మద్యం ప్రభావం విద్యార్థులపై అధికంగా పడుతోంది. తాగిన సీసాలను బడి ఆటస్థలంలో పగులగొట్టడంతో గాజు పెంకులు పిల్లలకు గుచ్చుకుంటున్నాయి. తాగుబోతుల గోలతో తరగతి గదుల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్పు చేయాలని ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వారం రోజుల్లోగా దుకాణాన్ని తొలగించకపోతే అన్ని పాఠశాలల విద్యార్థులతో జాతీయ రహదారిని స్తంభింపజేస్తాం' అని హెచ్చరించారు. హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ప్లకార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. దుకాణాన్ని తొలగించాలని కోరుతూ విద్యార్థులు చేసిన నినాదాలు మిన్నంటాయి. సుమారు అరగంట సాగిన రాస్తారోకోతో రహదారికి రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. జడ్పీటీసీ సభ్యుడు తాతపూడి ఐజయ్య, మండల ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రంగయ్య, నాయకులు పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాయ్! బుజ్జీ!!

హాయ్... నేస్తాలూ... బాగున్నారా... ప్చ్... 2017 ఇట్టే గడిచిపోయింది. హాయిగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేశాం. సంవత్సరమంతా బోలెడు సంఘటనలు జరిగాయి. అందులో కొన్ని మనల్ని సంతోషపెడితే.. కొన్ని ఏడిపించేశాయి... మరికొన్ని మన ముఖాల్లో నవ్వులు పూయించి అలరించాయి. ఆశ్చర్యపరిచి... ఆటాడించి, మాయ చేసి... ఊరించి ఊరడించాయి ఇంకొన్ని. సరదాగా వీటికి అవార్డులు ప్రకటించేద్దామా... కొత్త ఏడాదిలో అడుగుపెట్టే ముందు... ఒక్కసారి మరొక్కసారి... ఆ ముచ్చట్లు గుర్తుకు చేసుకుందామా!

ఎన్నెన్నో గుర్తులు!



హాలీవుడ్ హీరో...

ఆడుతూ పాడుతూ ఆడుకునే వయసులోనే మన నేస్తం హాలీవుడ్‌లో హీరో అయిపోయాడు. ఈ ఏడాది మెరిసిన చిన్నారిగా నిలిచాడు. ఎందుకంటే తను ఇంగ్లిష్ సినిమాలో పెద్ద పాత్రనే దక్కించుకున్నాడు. అవునూ! ఈ అబ్బాయి పేరు రోనీ ఆకురాతి. వీళ్ల సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. అయితే వీళ్ల అమ్మా నాన్నాలతో కలిసి అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉంటాడు. నటన మీద తనకున్న ఆసక్తిని గ్రహించిన వాళ్ల అమ్మ రోనీని యాక్టింగ్ స్కూల్లో చేర్చారు. అక్కడే తను నటన పాఠాలు నేర్చుకున్నాడు. చివరికి 'గ్రోయింగ్ అప్ స్మిత్' సినిమాలో హీరోగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అదీ అంత తేలికగా ఏం రాలేదు. ఆ పాత్ర కోసం వెయ్యి మందికి పైగా పిల్లలు పోటీపడ్డారు. అందరికంటే రోనీ హావభావాలు దర్శకుడికి బాగా నచ్చడంతో చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

జీవి కొంచెం... ఆయువు ఘనం!



శాస్త్రవేత్తలు ఎప్పుడూ పరిశోధనలు చేసి కొత్త కొత్త సంగతులు బయటపెడుతుంటారుగా. అలా ఈ ఏడాది ఓ ఆసక్తికరమైన విషయం తెలుసుకున్నారు. అదేంటంటే... సముద్రపు లోతుల్లో ఉండే ట్యూబ్ వార్మ్ అనే జీవుల్లో ఒకటైన 'ఎస్కార్పియా లామినటా' గురించి. దేహమంతా గొట్టాల్లా ఉండే ఈ జీవి ఏకంగా 300 ఏళ్ల కన్నా ఎక్కువే జీవిస్తుందట. అందుకే ఇప్పుడున్న జీవరాశులన్నింటిలో అత్యధికంగా బతికే ప్రాణి ఇదే కావచ్చని అనుకుంటున్నారు పరిశోధకులు. ఎక్కువగా గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రం లోపల ఉండే ఈ జీవి ఆకారం చిన్నది, దానికి తోడు లోతుల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు దీని గురించి తెలియలేదట. ఏది ఏమైనా భలే జీవి కదూ!

కొత్త కొత్త చాక్లెట్!



చాక్లెట్... ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే ఇప్పటి వరకు వీటిల్లో డార్క్, మిల్క్, వైట్ చాక్లెట్లే మనకు తెలుసు. కానీ ఈ ఏడాదిలో కొత్త రంగు కొత్త రుచితో ఓ చాక్లెట్ వచ్చి వాటి పక్కన చేరిపోయింది. పేరు రూబీ చాక్లెట్. ఎరుపు గులాబీ రంగులు కల గలిపి ఉంటుంది. ఇప్పటికే తినే ఉంటారుగా. 'అదేంటీ? చిన్న చిన్న చాక్లెట్ బిళ్లలు చాలా రంగుల్లోనే ఉంటాయే మరి దీని ప్రత్యేకత ఏంటో' అనే సందేహం వచ్చిందా? అసలు విషయం ఏమంటే.. వాటన్నింటిలో కృత్రిమ రంగులు కలుపుతారు. కానీ డార్క్, మిల్క్, వైట్, రూబీ చాక్లెట్ రంగులు మాత్రం సహజసిద్ధమైనవి. ఎలాంటి రంగులు కలపకుండా తయారుచేసినవన్నమాట. రూబీ కోకో బీన్స్‌తో తయారు చేశారీ రూబీ చాక్లెట్‌ని. తెలుపు రంగు చాక్లెట్ బార్ మార్కెట్లోకి వచ్చాక అంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చాక్లెట్లలో కొత్తరంగు వచ్చింది ఈ ఏడాదిలోనే.





గిరగిరా తిప్పేసింది!

ఈ ఏడాదిలో పిల్లల దగ్గర్నించి పెద్దల వరకు ఎవరి చేతిలో చూసినా ఆ వస్తువే ఎక్కువగా కనిపించింది. అందరితో తెగ ఆడేసుకుంది.. ఆటాడించింది. అదేనండి... ఫిడ్జెట్ స్పిన్నర్. మీరూ కొనే ఉంటారుగా! 2017 మార్కెట్లోకి వచ్చిన బొమ్మలన్నింటిలో మొదటిస్థానం దీనిదే. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోనూ ఎక్కువగా కొనుగోలైందీ ఇదే. ఈ బొమ్మతో ఎలా ఆడాలో చూపిస్తూ చేసిన వీడియోలను కోట్ల మంది వీక్షించారు. చేతిలో పట్టేంత పరిమాణంలో మూడు రెక్కలతో ఉండే ఈ చిన్న బొమ్మ పరికరం బేరింగుల సాయంతో బొంగరంలా తిరిగేస్తుంది. ఆట విడుపుకే కాకుండా ఈ బొమ్మ ఒత్తిడిని దూరం చేస్తుందని పేరు తెచ్చుకుంది. ఈ ఏడాదిలో ఆకట్టుకున్న ఈ స్పిన్నర్‌ని ఎప్పుడో 1993లోనే కనిపెట్టారు.

ఆకు కాదిది జీవి..



ఈ ఏడాది శాస్త్రవేత్తలు గుర్తించిన ఓ రకం కీటకం అందరినీ మాయ చేసింది. ఎందుకంటే అదిఅచ్చం ఆకులాగే ఉంటుంది. ఈ జీవి కాట్యాడిడ్ పురుగుల జాతిలో కొత్తది. దాని శరీరం, కాళ్లు.. శరీరభాగాలన్నీ చిగురుటాకుల్లాగే ఉంటాయి. కనుమాయ చేసేలా ఉన్న ఇది శాస్త్రవేత్తల కళ్ల నుంచీ ఇప్పటి వరకూ తప్పించుకుంది. చివరికి ఈ ఏడాదిలో మాత్రం దొరికిపోయింది. మలేసియాలో బోర్నియోలో ఈ వింత పురుగును గుర్తించారు. ఆకులు అలముల మధ్యలో ఉన్న దీన్ని పరిశీలనగా చూస్తే తప్ప ఇది జీవన్న విషయం ఎవ్వరికీ తెలియదు. వీటిల్లో ఆడకీటకాలు ఇలా గులాబిరంగులో నిగనిగలాడుతూ ఉంటాయి. మగవి ఆకుపచ్చ రంగులో ఆకులాగే ఉంటాయి.

పే...ద్ద ఫెర్రిస్ వీల్!



మనకు రైడ్లంటే భలే సరదా. వాటిల్లో ఎక్కాలన్నా... వాటి కబుర్లు వినాలన్నా మనకెంతో ఇష్టం మరి. అందుకే ప్రపంచంలో వింతైన భారీ రైడ్లు ఏర్పాటు చేస్తే ఆ సంగతులు వెంటనే చెప్పేసుకుంటాం. అలా ఈ ఏడాదిలో కొత్తగా వచ్చింది ఓ ఫెర్రిస్ వీల్. చైనాలోని వీఫాంగ్ నగరంలో ఏర్పాటు చేశారు దీన్ని. పెద్ద చక్రంలా ఉండి గుండ్రంగా రయ్యి రయ్యిమని తిప్పేసే ఫెర్రిస్ వీల్ తెలుసుగా. వాటిల్లోనే భిన్నమైందిది. ఆ ప్రత్యేకత ఏమిటంటే... చక్రం మధ్యలో చువ్వలు లేని ఏకైక ఫెర్రిస్ వీల్. పైగా ప్రపంచంలోని ఎత్తయిన వీల్స్‌లో ఒకటైన 'లండన్ ఐ' కన్నా ఇదే పెద్దది. 1,771 అడుగుల ఎత్తులో ఉన్న బైలాంగ్ రివర్ బ్రిడ్జ్‌పై కట్టిన ఈ జెయింట్ వీల్ ఎత్తు ఏకంగా 476 అడుగులు. మొత్తం 36 గదులతో భారీ ఉంగరంలా అందర్నీ ఆకర్షించింది. గిరగిరా తిరిగేస్తూ ఎక్కిన వారికి గుండె జారిపోయినట్టు గమ్మత్తయిన అనుభూతినిస్తోంది. తెగ ఆకట్టుకుంది.



ఎమోజీల సందడి..

ఈ ఏడాది వచ్చిన, పిల్లలకు ఎక్కువగా నచ్చిన.. యానిమేషన్ సినిమా 'ది ఎమోజీ'. ఫోను, మేసేజింగ్ యాప్‌ల్లో మనం ఎక్కువగా ఎమోజీల్ని వాడేస్తుంటాం. వాటికే నోరుంటే అవి మాట్లేడేస్తే ఎలాగుంటుంది? అదే ఈ సినిమాలో చూడొచ్చు. దీనిలో హీరో ఎమోజీ జీన్. తోటి ఎమోజీలన్నీ ఒక్కొక్క హావభావాన్నే పలికిస్తే తాను మాత్రం చాలా రకాల హావ భావాల్ని పలికిస్తుంది. అయితే అదే తన గొప్పదనం అని గుర్తించకుండా పక్కవాటిలా మారాలనుకుంటుంది. అందుకు కోడ్ కనిపెట్టడం, చివరికి తనలా ఉండటమే ప్రత్యేకత అని తెలుసుకోవడం కథ. అయితే ఎమోజీ బొమ్మలు మాట్లాడుకోవడం, వాటి హావభావాలు, వేషధారణ... చూస్తుంటే అన్నీ భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఈ సినిమాని ఆసక్తిగా చూశాయి. సోనీ పిక్చర్స్ తీసిన ఈ సినిమాలో వేషధారణలు తమాషాగా ఉన్నాయి. అలాంటివి ధరించి కొంత మంది వీధుల్లో ఒక్కచోట చేరారు. గిన్నిస్ రికార్డు కొట్టారు.

ఎంత పనిచేసింది!



ఈ ఏడాది కంప్యూటర్లు, ఫోన్లలో పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేసిన గేమ్ బ్లూవేల్. బ్లూవేల్ ఛాలెంజ్ పేరుతో ఇది ఆటగాళ్లను ఆత్మహత్య చేసుకునేటట్లు ప్రేరేపించి వారి జీవితాల్ని బలితీసుకుంటుంది. నిజానికి ఈ బ్లూవేల్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడే ఆట కాదు. సాఫ్ట్‌వేర్ కూడా కానే కాదు. ఇంటర్నెట్‌కు ఆకర్షితులైన పిల్లలకు ప్రత్యేక స్నేహితులుగా పరిచయం చేసుకుని రహస్యంగా ఆన్‌లైన్ ఛాలెంజ్‌లు ఇస్తుంది. బ్లేడుతో చేతిపై చిత్రాలు గీసుకోవడం లాంటి హింసతో కూడిన టాస్క్‌లతో ప్రాణాలు తీసేస్తుంది. ఈ ఏడాదే వచ్చిన ఈ ఆట కొంత మంది ప్రాణం తీసి వారి ఇంట్లో వారికి తీరని వేదనను మిగిల్చింది. తల్లిదండ్రుల్ని ఎక్కువ కలవర పెట్టిన ఈ గేమ్ ఈ ఏడాది మనల్ని చాలానే భయపెట్టేసింది. ఈ ఆటను నిషేధించే స్థాయికి తీసుకెళ్లింది.



పోలీసు బాస్... నలదలపూరు చిన్నోడు

▶ వరసగా జిల్లాకు రెండో సారీ అవకాశం ▶ నూతన డీజీపీగా మాలకొండయ్య

రాష్ట్ర నూతన డీజీపీ అవకాశం మళ్లీ మన జిల్లా బిడ్డకే దక్కింది. ప్రస్తుతం డీజీపీగా పని చేస్తున్న నండూరి సాంబశివరావు ఒంగోలుకు చెందిన వారే. ఆయన నేడు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో రాష్ట్ర నూతన డీజీపీగా 1985 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత ఆర్టీసీ ఎండీ, వైస్ ఛైర్మన్ మన్నం మాలకొండయ్య నియమితులయ్యారు. ఈయన వలేటివారి పాలెం మండలం నలదలపూరు గ్రామానికి చెందిన వారు. రాష్ట్రస్థాయి అత్యున్నత పోలీసు అధికారి స్థానం వరసగా రెండోసారి జిల్లాకు దక్కడం విశేషం.

–న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం



ఇద్దరూ ఇద్దరే..

నూతన డీజీపీ మాలకొండయ్య కుటుంబానిది పూర్తిగా వ్యవసాయ నేపథ్యం. ఆయన తల్లిదండ్రులు మన్నం రుక్మిణమ్మ, శ్రీరాములు. 1958 జులై ఒకటో తేదీ జన్మించిన మాలకొండయ్య పాఠశాల విద్య స్వగ్రామంలోనే జరిగింది. 1974లో గ్రామంలోని జడ్పీ హైస్కూల్ నుంచి పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. అనంతరం గుంటూరు జేకేసీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1980 బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ పూర్తి చేసి... కొన్నాళ్లపాటు వరంగల్ కార్పొరేషన్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేశారు. బ్యాంకు ఉద్యోగం చేస్తూనే న్యాయ విద్యను అభ్యసించారు. అనంతరం 1984లో సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వరంగల్ జిల్లా ములుగు ఏఎస్పీ, వరంగల్ అదనపు ఎస్పీ, కాకినాడ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. అదిలాబాద్, గుంటూరు, మెదక్ జిల్లాల్లో ఎస్పీ పనిచేసి తన ప్రత్యేకతను చాటుకున్నారు. వైజాగ్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీగా, గుంటూరు డీఐజీ, ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ సెల్ జేఎండీగా, అప్కా డైరెక్టర్‌గా పని చేశారు. 2015లో డీజీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. తాజాగా పోలీసు శాఖలో అత్యున్నత డీజీపీ పదవిలో నియమితులయ్యారు.



సొంతూర్లో గ్రామస్థులతో కలిసి వెళుతున్న మాలకొండయ్య

అందరిలాగే అల్లరీ చేసేవాడు..

ఇప్పుడైతే ఆయన రాష్ట్ర పోలీసు బాస్.. బాల్యంలో మాత్రం ఆయన అచ్చ తెలుగు పల్లెటూరి పిల్లగాడే. . అల్లరీ బాగానే చేసేవాడని ఆయన్ను చిన్నతనం నుంచి చూసిన గ్రామస్థులు, బాల్య మిత్రులు చెబుతుంటారు. ప్రాథమిక విద్యంతా స్వగ్రామంలోనే సాగడంతో బాల్యంలో ఒకవైపు చదువుకుంటూనే తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు సైతం వెళ్లే వారు మాలకొండయ్య. మేపడానికి పశువులనూ తోలుకెళ్లేవారు. ఆ క్రమంలో అప్పుడప్పుడూ బడికి డుమ్మా కొట్టేవారు. వారి కుటుంబ పెద్దల్లో ఒకరైన మన్నం కోటయ్య అంటే ఆయనకు భయం.. ఆయన ఈ పద్ధతిని వారించి బుద్ధిగా చదువుకోవాలని సూచించడంతో మాలకొండయ్య పూర్తిగా చదువుపైనే దృష్టి సారించారు.



వలేటివారిపాలెం నలదలపూరులోని స్వగృహం

గ్రామాభివృద్ధికి చేయూత

ఉన్నత స్థాయిలో నిత్యం ఎన్నో కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉన్నా... మాలకొండయ్య స్వగ్రామంపై మమకారాన్ని వీడలేదు. తరచూ పండగలు, శుభకార్యాలకు వస్తుంటారు. ఏటా కనీసం రెండుసార్లు గ్రామానికి వస్తుంటారు. అందరినీ అప్యాయంగా పలకరిస్తుంటారు. గ్రామీణ వాతావరణాన్ని పూర్తిగా ఆస్వాదిస్తుంటారు. చిన్ననాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకునేవారు. ఎక్కడా తన హోదాను, అధికార దర్పాన్ని ప్రదర్శించేవాడు కాదని ఆయన చిన్ననాటి స్నేహితులు చెబుతున్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిచ్చారు. పాఠశాల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణానికి స్నేహితులతో కలిసి రూ.25లక్షలు విరాళంగా అందజేశారు. గ్రామంలో విద్యుత్తు ఉపకేంద్రం, పశువైద్యశాల నిర్మాణాలకు కృషి చేశారు. రూ.పది లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. మన ఊరు ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేసి స్వగ్రామం దాహార్తిని తీర్చారని ఆయన చిన్ననాటి స్నేహితులు మన్నం సుబ్బారావు, వలేటి అంకయ్య, బత్తిన కృష్ణారావు, పొన్నగంటి రామయ్య చెప్పారు. ఇటీవలే ఆయన తన తన స్వగ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల తమ తమ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకులకు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఇక్కడే మకాం వేసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ ఊరివాడు, తమలో ఒకడు రాష్ట్ర పోలీసు బాస్‌గా ఎంపిక కావడంతో నలదలపూరులో సందడి వాతావరణం నెలకొంది.

ఐపీఎస్ అధికారిగా పలు జిల్లాల్లో కీలక బాధ్యతలను నిర్వర్తించిన మాలకొండయ్య సమర్థుడైన ముక్కుసూటి అధికారిగా పేరొందారు. ఐఏఎస్ అధికారిణి పూనంను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇద్దరే. ఉద్దండులుగా.. సమర్థులైన అధికారులుగా పేరు తెచ్చుకున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాలకొండయ్య తండ్రి శ్రీరాములు కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. తల్లి రుక్మిణమ్మ ప్రస్తుతం కుమారుడి వద్దనే ఉంటున్నారు. మాలకొండయ్యకు ఒక సోదరి ఉన్నారు. ఆమెను లింగసముద్రం మండలం పెదపవని గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఆయన బావ మృతి చెందడంతో వారి పిల్లల బాధ్యతను మాలకొండయ్య తీసుకున్నారు.

▲ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకల్లో స్నేహితులతో కలిసి

నీటి కోసం కోటి లెక్కలు!

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది గట్టెక్కాలంటే ఎంత కావాలి? అనే వివరాలను విడివిడిగా రూపొందించారు.

ఆ మూడే అధికం...!

జిల్లాలో గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, వై.పాలెం ప్రాంతాల్లో తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో శాశ్వత పథకాల ప్రణాళికలతో పాటు, బోర్లు తవ్వకం, నీటి రవాణా, వనరుల వినియోగం అంశాలపై పరిశీలన చేశారు.

◗ గిద్దలూరు నియోజకవర్గంలో కష్టాలు తీరాలంటే రూ. 800 కోట్ల వరకు అవసరం ఉంది. గుండ్లమోటు ఆనకట్ట ద్వారా నీటి సరఫరా, సప్లయి ఛానల్ మరమ్మతులు, శాశ్వత తాగునీటి పథకాల నిర్మాణానికి ఈ నిధుల అవసరం ఉంది. తాత్కాలికంగా గట్టెక్కాలన్నా ఏడాదికి రూ. 30 కోట్లు తప్పనిసరి. నీటి రవాణా, కొత్త బోర్లు తవ్వకానికి వినియోగిస్తారు.

◗ మార్కాపురంలో ప్రస్తుతం సాగర్ నీటిని కొన్ని వార్డులకు, రవాణా ద్వారా కొన్ని వార్డులకు అందిస్తున్నారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలంటే రూ. 500 కోట్లు అవసరం. సాగర్ నీటిని అన్ని వార్డులకు ఇచ్చేందుకు, కొత్తగా చెరువులు, బోర్లు తవ్వేందుకు ఈ నిధులు అవసరం. తాత్కాలికంగా అయినా ఈ ప్రాంతంలో 100 బోర్లు తవ్వించాలి, రోజుకు కనీసం 80 గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని అందించాలి. అందుకు తాత్కాలిక అవసరాలుగా ఏడాదికి రూ. 25 కోట్లు కావాలి.

◗ కనిగిరి నియోజకవర్గంలో శాశ్వత అవసరాలు తీరాలంటే మరో మంచినీటి చెరువు తవ్వించాల్సి ఉంది. రామతీర్థం నీటిని ఇక్కడకు తరలించి సరఫరా చేయాల్సి ఉంటుంది. అందుకు రూ. 210 కోట్లు అంచనాలు సిద్ధం చేశారు. తాత్కాలికంగా అయితే రూ. 10 కోట్లు కావాలి.

◗ చీరాలకు కొమ్మమూరు కాలువ ద్వారా నీటిని అందించాల్సి ఉంది. కొండపి, ఎస్.ఎన్.పాడు, అద్దంకి, దర్శి నియోజకవర్గాలకు శాశ్వత అవసరాలు తీరాలంటే మరో రూ. 500 కోట్ల అవసరం ఉంది. తాత్కాలిక అవసరాలకు రూ. 70 కోట్ల అవసరం ఉంది.

పథకాలను వినియోగించాలి...

నిజానికి జిల్లాలోని తీవ్రమైన సమస్యలున్న ప్రాంతాల్లో కీలకంగా దృష్టి పెడితే చిన్న చిన్న పనుల ద్వారా నీటిని అందుకోవచ్చు. కానీ ప్రజాప్రతినిధుల ప్రణాళికలన్నీ భారీగానే ఉన్నాయి. ఆశలు, నిధుల మూటల మధ్య చిన్న పనులపై శ్రద్ధ వహించడం లేదు.

◗ దొనకొండ, అద్దంకి సమీపంలోని ధర్మవరంలోనూ ఆరేళ్ల కిందట నిర్మించిన మంచినీటి చెరువులు వృథాగా ఉన్నాయి. రూ. 12 కోట్లు వ్యయం చేసినా ఫలితం చూపించలేదు. వీటిని పట్టించుకుని మరో రూ. కోటి వ్యయం చేస్తే సమీపంలోని 22 గ్రామాలకు నీటిని అందించవచ్చు.

◗ వై.పాలెం, తర్లుపాడు ప్రాంతాల్లో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన పథకాలు వృథాగా మారాయి. చిన్నచిన్న సమస్యలు, పైపు లైన్లు సక్రమంగా వేయని కారణంగా రూ. 100 కోట్లతో చేసిన పనులను పక్కన పెట్టారు. వీటిపై దృష్టి పెట్టి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తే ప్రయోజనం ఉంటుంది. నడిగడ్డ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో తాగునీటి వనరులు బాగున్నా... సాగర్ నీటి రవాణాకే అధికంగా వ్యయం చేస్తున్నారు.

◗ అద్దంకి, దర్శి, ఎస్.ఎన్.పాడు నియోజకవర్గాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో సాగర్ నీటితో నింపితే నాలుగు నెలలు సరిపోతాయి. ఈ నీటిని పూర్తిగా వినియోగించడం లేదు. చెరువుల్లో శుద్ధి లేమి, భూమి పొరల్లో లోపాల కారణంగా చెరువులను వృథాగా ఉంచుతున్నారు. వీటిపైనా శ్రద్ధ పెట్టి చిన్నపాటి వ్యయం చేస్తే సాగర్ జలాలను సద్వినియోగంలోకి తీసుకురావచ్చు. కానీ ఈ చెరువుల్లో నీటిని నింపి చేపలను పెంచుతున్నారు. జిల్లాలో తాగునీటి అవసరాలు, పరిష్కార మార్గాలపై గ్రామీణ తాగునీటి విభాగం ఎస్ఈ 'ఈనాడు'తో మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు అనుగుణంగాను, మా పరిశీలనలు, ప్రత్యామ్నాయ మార్గాలకు నిధుల అవసరం ఎంత ఉంది? అనే అంశంపై త్వరలోనే సమావేశం నిర్వహిస్తామన్నారు.

గీత దాటితే సహించను

▶ జిల్లాలో పార్టీ కార్యక్రమాలపై చంద్రబాబు అసంతృప్తి



సీఎం చంద్రబాబు వీక్షణ సమావేశంలో పాల్గొన్న మంత్రి శిద్దా, తెదేపా అధ్యక్షుడు జనార్దన్ తదితరులు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో పార్టీ సమావేశాలు సరిగా జరగడం లేదని, క్యాలెండర్ ప్రకారం గ్రామ, మండల, జిల్లా సమావేశాలు, నియోజకవర్గాల సమన్వయ కమిటీ సమావేశాలు జరగడం లేదని తెదేపా అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం విజయవాడ నుంచి జిల్లా పార్టీ నాయకులతో ముఖ్యమంత్రి వీక్షణ సమావేశం నిర్వహించగా- జిల్లా పార్టీ కార్యాలయం నుంచి రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు, జిల్లా తెదేపా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌తోపాటు ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాతోపాటు రాష్ట్రంలో కడప, చిత్తూరు పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. పార్టీ నిర్దేశించిన విధంగా ఆయా తేదీల్లో తప్పనిసరిగా సమావేశాలు జరగాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల్లో ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. నియోజకవర్గాల్లో ఎక్కడైనా వివాదాస్పదంగా మారితే సహించేది లేదన్నారు. జనవరి రెండో తేదీ జరిగే జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలన్నారు. పార్టీకి ఉపయోగపడేవారిని, పార్టీ అభివృద్ధికి పాటుపడేవారు ఇతర పార్టీల నుంచి రావాలనుకుంటే.. వారిని సాదరంగా ఆహ్వానించాలన్నారు. గ్రూపులు కట్టకుండా కలిసికట్టుగా పని చేయాలని ఉద్బోధించారు. పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు వారి నియోజకవర్గాల పరిధిలో సమస్యలు పరిష్కరించాలని, అభిప్రాయ బేధాలు లేకుండా ముందుకు పోవాలన్నారు. జన్మభూమిలో అందరూ పాల్గొని పండగలా జరపడంతోపాటు ప్రజలకు పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే నియోజకవర్గాలకు గ్రేడ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలతో సంబంధం లేకుండా ఉండే వారికి రానున్న ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకం కావాలని, పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి రవిచంద్రశేఖర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రాకుల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పోరాడితేనే ఎస్టీ జాబితాలో చోటు

▶ మత్స్యకార సంఘాల సదస్సులో మంత్రి కొల్లు రవీంద్ర

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులంతా ఐకమత్యంతో పోరాడితే ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేరుస్తాయని రాష్ట్ర న్యాయ, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ అన్ని రంగాల్లో అణగారిన మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని ఎంతో కాలంగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్రంలోని 14 మత్స్యకారతెలను ఏకతాటిపైకి తీసుకువచ్చి సమస్యలపై పోరాటం ప్రారంభమయ్యాయ. .. తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి అధికారికంగా మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్యంత్రి హాజరైనప్పుడు ఎస్టీ జాబితా గురించి ప్రస్తావించగా- సానుకూలంగా స్పందించారని అన్నారు. డిమాండ్ సాధన కోసం ఇప్పుడు 13 జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని, అనంతరం రాష్ట్ర స్థాయిలో ఒక బహిరంగ సభ జరిపి మన ఐకమత్యాన్ని చాటుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిర్ణయం తీసుకోవడానికి ముందుకొస్తాయన్నారు. మత్స్యకారులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకుని అన్ని జిల్లాల్లో రాజకీయ పదువుల్లోకి రావాలన్నారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ మత్స్యకారులు ప్రాణాలకు తెగించి చేస్తున్న వృత్తి వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.16వేల కోట్ల ఆదాయం వస్తోందన్నారు. అయినా.. వారి సామాజిక స్థితి మెరుగుపడలేదన్నారు. బీసీఏ జాబితాలో ఉండటం వల్ల మత్స్యకారులకు చాలా నష్టం జరుగుతోందని, ఎస్టీల్లో ఉంటే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సంప్రదాయ మత్స్యకారులంతా అనాదిగా తెలుగుదేశం పార్టీని కనిపెట్టుకుని ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని అన్నారు. ఛైర్మన్ కొండూరి పాలుశెట్టి ఉద్యమాన్ని ప్రభుత్వాలు గుర్తించేలా ఉమ్మడిగా పోరాటం చేయాలన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ మత్స్యకారులు పిల్లల్ని బాగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకురావాలన్నారు. సదస్సులో తెదేపా నాయకుడు కరణం వెంకటేష్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు రాసాని కృష్ణ, మేకల జక్రయ్య, వాయిల మోహనరావు, చాపల రమణయ్య, బొమ్మిడి గణేష్, తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు నగరంలో ప్రదర్శన జరిపారు. మత్స్యకార మహిళల కోలాటం ఆకట్టుకుంది.


మత్స్యకార సంఘాల సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

సామాజిక బాధ్యతతో యువశక్తి ముందడుగు

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: యువశక్తి చదువు, ఆటపాటలతోపాటు సామాజిక బాధ్యతతోనూ మెలగాల్సిన అవసరం ఉందని యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా యువజన సర్వీసులశాఖ- స్టెప్ ఆధ్వర్యంలో యువ మహోత్సవ్-2018 పేరుతో శనివారం ఒంగోలు క్విస్ కళాశాలలో నిర్వహించిన యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయాలన్న లక్ష్యంతో ఈ ఏడాది అన్ని జిల్లాల్లో డివిజన్ స్థాయిలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అన్ని జిల్లాల్లో ముగిసిన తర్వాత జనవరి నెలాఖరులో రాష్ట్ర స్థాయిలో ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ కేంద్రాలు నెలకొల్పి యువతకు వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారనారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ దొనకొండలో పారిశ్రామిక వాడ పనులు పూర్తయితే దాదాపు 50వేల కొత్త ఉద్యోగాలకు అవకాశం లభిస్తుందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆర్మీ ఉద్యోగాల శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న అభ్యర్థులకు ఉచితంగా బూట్లు, ట్రాక్ సూట్లు అందజేశారు. అనంతరం యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాప్ ఎండీ బంగ్రారాజు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ రాఘవ, క్విస్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.నాగేశ్వరరావు, స్టెప్ సీఈవో రవి, మేనేజరు సత్యనారాయణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజరు షేక్ మీరావళి తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నేడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాక

పర్చూరు, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు ఆదివారం పర్చూరు వస్తున్నట్లు నాగేంద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ తేళ్ల సుబ్బారావు తెలిపారు. పర్చూరు, నాగులపాలెం, ఉప్పుటూరు పొలిమేర్లలోని పుట్ట వద్ద నాగేంద్రస్వామి, ఆంజనేయస్వామి వార్లను ఉదయం 8.30 గంటలకు ఆయన దర్శించుకుంటారని చెప్పారు. న్యాయమూర్తికి రాక సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.


రాఘవేంద్రనాయుడు, సాహిత్‌రెడ్డి


ప్రణీత్, బాలసుందర్

జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: డిసెంబరు 28 నుంచి 30వతేదీ వరకూ హైదరాబాద్ దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన దక్షిణ భారత స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఒంగోలు సమీపంలోని సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తాము పాల్గొన్న రెండు విభాగాల్లోనూ ఉత్తమ ప్రతిభ చూపి మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. ఆరోగ్యం- సంక్షేమం విభాగంలో 'తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం' అన్న అంశంతో రాఘవేంద్రనాయుడు, సాహిత్‌రెడ్డి మొదటి బహుమతి పొందారు. ఆహార భద్రత విభాగంలో 'సేంద్రీయ వ్యవసాయ ప్రాముఖ్యంపై పరిశోధన, జీవకీటక నాశిని- బ్రహ్మాస్త్రం' అన్న అంశంతో ప్రణీత్, బాలసుందర్ మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మేజర్ సురేష్‌బాబు, ప్రధానాచార్యులు రమణయ్య మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శనలకు వీరు అర్హత సాధించారన్నారు.

అద్దంకి

రేపు ఒంగోలులో ఎమ్మెల్సీ సంబరాలు

అద్దంకి, న్యూస్‌టుడే : శాసనమండలి సభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఒంగోలులోని తన స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు తెదేపా నాయకులు మల్లిపెద్ది త్రివేణిబాబు తెలిపారు. కరణం అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఒంగోలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. ఇదే విషయాన్ని పంగులూరు మండల తెదేపా అధ్యక్షుడు చింతల సహదేవుడు కూడా తెలిపారు.

రేపు నూతన సంవత్సర వేడుకలు

అద్దంకి, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు పట్టణంలోని ర.భ.అతిథిగృహం వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కరి అరుణ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల నుంచి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఈ వేడుకలకు హాజరు కావాలన్నారు. అందరికీ భోజన వసతి ఏర్పాటు చేశామని వెల్లడించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

మేదరమెట్ల, న్యూస్‌టుడే : ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ సైన్స్, మాథమేటిక్స్... ఎన్విరాన్‌మెంట్ ఎగ్జిబిషన్ ఫర్ చిల్డ్రన్-2017లో మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి జె.క్రాంతి కుమార్ ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్.ఎం. రావి ఝాన్సీలక్ష్మిబాయి అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆమె అధ్యక్షత వహించారు. విద్యార్థి ప్రదర్శించిన 'ఈజీ లెర్నింగ్ మెథడ్స్ ఆఫ్ మాథ్స్' బోధనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలగా సాధన చేయాలని సూచించారు. ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థిని, ప్రాజెక్టుకు సహకరించిన గైడ్‌టీచర్ కె.పోతురాజును పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అద్దంకి: అద్దంకిలో శనివారం సాయంత్రం జరిగిన వేర్వేరు ఘటనల్లో ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయని ఎస్సై ఎ.సుబ్బరాజు తెలిపారు. మార్టూరు మండలం బొబ్బేపల్లికి చెందిన చింతలపూడి నాగేశ్వరరావు అత్తగారి ఊరైన బల్లికురవ మండలం గొర్రెపాడు వచ్చారు. అక్కడి నుంచి అద్దంకికి ద్విచక్రవాహనంపై వస్తుండగా చిన్నకొత్తపల్లి డొంక వద్ద ఆయన ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి అంచుల్లోకి దూసుకుపోయింది. దీంతో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు అద్దంకి 108 వాహనంలో క్షతగాత్రుడ్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. కలవకూరు రోడ్డులోని వైఎస్సార్ బహుళ అంతస్తుల భవనంలో నివాసముంటున్న రామానందరెడ్డి ఒంగోలు నుంచి అద్దంకి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. రామ్‌నగర్‌కు రాగానే ఆగి ఉన్న కారు తలుపు తీయడంతో అది రామానందరెడ్డికి తగిలి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలు తగలాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు



తలకు గాయమైన రామానందరెడ్డి

మహాసభలపై ప్రచారం

పంగులూరు, న్యూస్‌టుడే : అఖిలభారత గ్రామీణ డక్ సేవకుల ప్రకాశం డివిజన్ మహాసభలు ఆదివారం అద్దంకి వేమారెడ్డి సేవాసమితి వసతి గృహంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజినల్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసకుమార్ తెలిపారు. మహాసభలు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సంఘం నాయకులు హనుమంతరావు, లక్ష్మీనారాయణ, మీరావలి తదితరులతో కలిసి శనివారం మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కలిసి, మహాసభలు జయప్రదానికి విజ్ఞప్తి చేశారు. సభల్లో సంఘం జాతీయ నాయకులు మహదేవయ్య, బి.వి.రావు, రాష్ట్ర నాయకులు రఘుబాబు, జయరాజు తదితరులు పాల్గొన్నారు. మహాసభల్లో జి.డి.ఎస్.ల సమస్యలు- పరిష్కారాలు తదితర అంశాలపై ప్రసంగిస్తారని, జిల్లాలోని తపాలా శాఖలో అంతర్భాగంగా ఉన్న జి.డి.ఎస్‌లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

కృష్ణమ్మ బిరబిరా.. మాగాణి గలగల

◗ ఆశాజనకంగా దిగుబడులు

సాగర్ జలాశయం కుడికాలువ నుంచి విడుదలైన కృష్ణమ్మ అద్దంకి బ్రాంచి కాలువ, గుండ్లకమ్మ నదుల్లో పరవళ్లు తొక్కుతోంది. ఈ నెల 2 నుంచి రెండోవిడత విడుదల చేసిన సాగర్ నీటిని ఆయకట్టు పరిధి పంటలకు అందిస్తున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆయకట్టుకు ఈ నీరు విడుదల చేయగా ఆరంభంలో నీటి పంపిణీ విషయమై ప్రకాశం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయంలో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఒక పంటకు నీరు ఇవ్వకపోవడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుతడి పంటల కింద మొక్కజొన్న సాగు చేపట్టారు.



తిమ్మాయపాలెం వద్ద గుండ్లకమ్మలో కృష్ణమ్మ పరవళ్లు



కళ్లంలో ధాన్యం నూర్పిళ్లు

అద్దంకి, న్యూస్‌టుడే :

అద్దంకి బ్రాంచి కాలువ పరిధిలో మాగాణి సాగుకు నీరిచ్చే అవకాశం లేకుండా పోయింది. కొంతమంది రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్న చోట మాగాణి సాగు చేశారు. అద్దంకి బ్రాంచి కాలువ పరిధి ఆయకట్టు మొత్తం 1.75 లక్షల ఎకరాలు కాగా బోర్ల కింద సుమారు 10 వేల ఎకరాల్లో మాగాణి సాగు చేశారు. ఆరంభంలో బోర్ల కింద సాగు చేసిన పంట భూములకు క్రమంగా సాగర్ నీటిని అందించారు. అద్దంకి మండలం ధర్మవరం, బల్లికురవ మండలం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వి.కొప్పెరపాడు, అంబడిపూడి తదితర గ్రామాల్లో మాగాణి సాగు చేపట్టిన రైతులు ఎకరాకు 42 బస్తాల వరకు దిగుబడి సాధిస్తున్నారు. శనివారం నాటికి 18/0 వద్ద 950 క్యూసెక్కులు ఉండగా 33/2 మైలురాయి వద్ద 560 క్యూసెక్కులు సరఫరా అవుతుంది. అద్దంకి, వెంపరాల మేజర్లలో 60 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది.



అద్దంకి మేజరుకు విడుదలైన సాగర్ నీరు

గుండ్లకమ్మలో పెరిగిన ఒరవడి

గుండ్లకమ్మ నదిలోనూ సాగర్ నీటి ఒరవడి పెరిగింది. తొలుత 100 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుండగా క్రమంగా నేడు 500కు పెరిగింది దీంతో పక్షం రోజుల నుంచి సాగర్ నీరు గుండ్లకమ్మ జలాశయానికి చేరుకుంటున్నాయి. ఎగువన భారీ వర్షాలు కురిసిన సమయంలో ప్రవహించిన మాదిరిగా గుండ్లకమ్మలో నీటి సరఫరా అవుతోంది. అందువల్లే గుండ్లకమ్మ నదీపరీవాహకంలోని ఎత్తిపోతల పథకాలు పని చేయడం ప్రారంభిస్తున్నాయి. ఈ నీటి ఆధారంగానే గుండ్లకమ్మలో నీటిమట్టం పెరిగి జలాశయం ఆయకట్టుకు నీటిని విడుదల చేయగలుగుతున్నారు. గుండ్లకమ్మ జలాశయం గరిష్ట నీటిమట్టం 24.38 మీటర్లు కాగా ప్రస్తుతం 22 మీటర్ల వరకూ నీరు చేరింది.

గండ్లు పూడ్చివేత

సాగర్ జలాలను కాలువ చివరి భూములకు అందించేందుకు గాను అద్దంకి మేజరు కాలువపై ఏర్పడిన గండ్లను పూడ్చి వేశారు. ఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల కాలువపై పర్యటించిన అధికారులు వాటిని గుర్తించి దిగువ స్థాయి సిబ్బందిని హెచ్చరించారు. ఈ క్రమంలో కాలువ చివరి భూములకు నీరు అందుతుంది. ఇదే క్రమంలో నీటి సరఫరా నిలిపివేసే చివరి రోజుల్లో కలవకూరు, గుర్రంవారిపాలెం చెరువులకు నీరు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు. మొత్తం మీద సాగర్ జలాలు ఆయకట్టులోని రైతులు సాగు చేసిన పొలాలకు పూర్తిస్థాయిలో అందుతున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.



విద్యార్థి హేమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

బొమ్మనంపాడు విద్యార్థి ప్రతిభ

బొమ్మనంపాడు (అద్దంకి) : బొమ్మనంపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 7వ తరగతి విద్యార్థి యేనుగంటి హేమంత్‌కుమార్ జిల్లాస్థాయిలో జరిగిన సైన్సు, లెక్కల ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపాడు. లెక్కల ప్రతిభా పరీక్షల్లో మొదటిస్థానం సాధించగా సైన్సు ప్రతిభా పరీక్షల్లో ద్వితీయస్థానం దక్కించుకున్నాడు. శనివారం పాఠశాలలో విద్యార్థి హేమంత్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

అలుపెరుగని పోరాట యోధుడు శ్రీరాములు

నాగులపాడు (అద్దంకి): కమ్యూనిస్టు నాయకునిగా అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు పచ్చవ శ్రీరాములు అని సీపీఐ నాయకులు అన్నారు. ఇటీవల మృతి చెందిన శ్రీరాములు సంతాపసభ నాగులపాడులో శనివారం నిర్వహించారు. మానం వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సీపీఐ నాయకులు ఎం.వెంకయ్య, రైతు నాయకులు హనుమారెడ్డి, కెవెల్‌డిప్రసాద్, గొల్లపూడి వెంకటేశ్వర్లు, ఆంజనేయులు మాట్లాడారు.

గనుల్లో తనిఖీలు

గురిజేపల్లి (సంతమాగులూరు), న్యూస్‌టుడే: గురిజేపల్లిలోని అయిదు గ్రానైట్ గనుల్లో మైనింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే మొత్తం 29 గనులు పరిశీలించి వివరాలు నమోదు చేసినట్లు పర్యవేక్షణాధికారి జాన్ తెలిపారు. తనిఖీల్లో అంబేడ్కర్, లక్ష్మీనారాయణ, అరవింద్ చౌదరి, మోషే పాల్గొన్నారు.

1 నుంచే పింఛన్ల పంపిణీ

అద్దంకి, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసాలో భాగంగా వితంతు, వృద్ధులు, వికలాంగుల పింఛన్లను మండల గ్రామాలన్నిటిలో సోమవారం నుంచే పంపిణీ చేస్తారని ఎంపీడీవో సి.హేమాద్రినాయుడు తెలిపారు. మొత్తం 4802 మంది లబ్ధిదారులకు రూ.59,92,000లు పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు.

అద్దంకిలో పట్టపగలు చోరీ

◗ రూ.1.03 లక్షల నగదు అపహరణ

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకిలో జీవిత బీమా కార్యాలయం పక్కనే చరవాణి సిమ్‌కార్డులు అమ్మే దుకాణం సొరుగులో ఉంచిన రూ.1.03 లక్షల నగదును శనివారం మధ్యాహ్నం అపరిచిత వ్యక్తులు దొంగిలించారు. బాధితురాలు, దుకాణ యజమాని రమాదేవి అందించిన సమాచారం ప్రకారం.. . ఈ దుకాణాన్ని ఆమె కుమారుడు గోపు శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఆమెను దుకాణంలో ఉంచి ఇంటికి భోజనానికి వెళ్లారు. అంతకుముందే బకాయిదారులు ఇచ్చిన నగదు రూ.1.03 లక్షలను గల్లాపెట్టె సొరుగులో పెట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దుకాణానికి వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఆయెను టెలినార్ కంపెనీకి చెందిన రూ.20 రీఛార్జి కార్డులు కావాలని కోరారు. వాటిని తీసుకుని వారు వెళ్లిపోయారు. ఆ తరువాత గల్లాపెట్టెలో ఉంచిన నగదు విషయమై గుర్తొచ్చిన ఆమె పరిశీలించగా నగదు కనిపించ లేదు. కొంతసేపటికి తేరుకున్న ఆమె అగంతుకులు తనను మైకంలో పడవేసి నగదు అపహరించారని చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని, పక్కనే జీవిత బీమా సంస్థ, జియో వ్యాపార సంస్థల్లోని నిఘా కెమెరాలు పరిశీలించారు. ఆచూకీ తెలియరాలేదు. బాధితురాలు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సీసీ కెమెరాలో పరిశీలిస్తున్న పోలీసులు



నగదు అపహరణకు గురైన దుకాణం ఇదే

అద్దంకి

తెరపై ఈనాడు

అద్దంకి: కళామందిర్-ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయి), శ్రీరామ- 2 కంట్రీస్, విఎన్ ఎస్- హలో, మినీ వీఎన్ఎస్- ఒక్క క్షణం

నిధుల బాధ్యత నాది అభివృద్ధి మీది



గాంధీబొమ్మ కూడలిలో నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న దృశ్యం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు తెచ్చే బాధ్యత తనదని, ఇదే సమయంలో వాటిని సమర్ధవంతంగా వినియోగించి అభివృద్ధి పనులు జరిపించాల్సిన బాధ్యత నగరపంచాయతీ పాలకమండలిదేనని ఎమ్మెల్యే జి. రవికుమార్ అన్నారు. 12వ వార్డులో శనివారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ధన్వంతరి దత్తపాదుకాక్షేత్రంలోని స్వామికి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. గాంధీబొమ్మ కూడలి, మారంవారి వీధి, చిలకావారి వీధి, నాగులబండ బజారు, మాధవస్వామి గుడి ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. మంచినీరు సక్రమంగా అందడం లేదని, అనధికార విద్యుత్తు మోటార్లు వినియోగించడం వల్ల కుళాయిల్లోకి నీరు పూర్తిస్థాయిలో అందడం లేదని స్థానికులు ఆయనకు చెప్పారు. నాగులబండ బజారు, చిలకావారివీధుల్లో ఎంతోకాలంగా నివాసముంటున్న ఇళ్లకు ఇంటి పన్నులు విధించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

12వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. నాగులబండ బజారు సమీపం నుంచి నర్రావారిపాలెం కల్యాణ మండపం వరకు రూ.30 లక్షలతో నిర్మించనున్న పనులను ప్రారంభించారు. పనులు నాణ్యంగా లేకుంటే బాధ్యత స్థానికులదేనని అన్నారు. ఎప్పుడు, ఎలాంటి అనుమానాలు వచ్చినా వెంటనే పని నిర్వాహకులను నిలదీయాలని కోరారు. 14వ ఆర్థికసంఘం నిధులు రూ.10 లక్షలకు తోడు మరో రూ.20 లక్షలతో ఈ నిర్మాణం చేస్తున్నామని కమిషనర్ డి.వి.ఎస్. నారాయణరావు వెల్లడించారు. నగరపంచాయతీ వైస్‌ఛైర్మన్ చిన్ని శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త నాగినేని రామకృష్ణ, నాగులపాడు సహకార సంఘం అధ్యక్షుడు సందిరెడ్డి రమేష్, కరి పరమేష్, నర్రా నాగేశ్వరరావు, అత్తులూరి రమేష్‌బాబు, రామసుబ్బారావు, చిన్ని హనుమ, మామిడి రాంబాబు, గార్లపాటి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసకుమార్, చుండూరి మురళీసుధాకర్, కోట సాంబశివరావు, కుందారపు రామారావు, నర్రావుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జేబుదొంగ అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడుతున్న జేబుదొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు పొద్దుటూరు నుంచి దుస్తుల వ్యాపారానికిగాను అద్దంకి వచ్చిన మేడా సునీల్‌కుమార్ వలపర్ల వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా... ఆయన జేబులోని నగదు అపహరించేందుకు ప్రయత్నం చేశాడు. జేబుదొంగను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

అంబడిపూడి (బల్లికురవ) న్యూస్‌టుడే : పదవీ విరమణ చేయనున్న అంబడిపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.లక్ష్మికి శనివారం ఉపాధ్యాయులంతా సన్మానం చేశారు. బహుమతులను అందజేశారు. ఎంఈవో వీరరాఘవయ్య, సత్యకిషోర్, శ్రీనివాస్, జమాల్, వీరాంజనేయులు, పార్థసారది, ఆదిబాబు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయనిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కాల నిర్ణయ పట్టికను ఆవిష్కరిస్తున్న కరణం

కాల నిర్ణయ పట్టిక ఆవిష్కరణ

అద్దంకి, న్యూస్‌టుడే : 2018 నూతన సంవత్సర కాలనిర్ణయ పట్టికను శాసనమండలి సభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి శనివారం ఆవిష్కరించారు. అద్దంకి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి నాగసూరి హనుమత్‌ప్రసాద్, దామా సురేంద్రలు వీటిని తయారు చేయించారు. నూతి ప్రసాదరావు, రామకోటేశ్వరరావు, మన్నం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థులు

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలోని రవీంద్రభారతి విద్యాలయంలో శనివారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు ఎల్ఎం.కృష్ణ నూతన సంవత్సర కేక్‌ను కోసి పంచారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రవీంద్రభారతి పాఠశాలలో చిన్నారుల వేషధారణ

సేద్యం వైపు యువత

మేదరమెట్ల, న్యూస్‌టుడే: సేద్యం వైపు యువత ఆసక్తి చూపించడం శుభపరిణామమని మదర్‌ల్యాండ్ అవైల్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు పి.పూర్ణచంద్ర రావు పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి జనవరి 7వరకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి 26 మంది రైతులు, సిబ్బంది శనివారం బయలుదేరారు. ఈ బస్సుకు ఏవో ప్రసాదరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీఈవోలు, వ్యవసాయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



శిక్షణకు బయలు దేరనున్న అధికారులు, బస్సు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఉప్పుమాగులూరు (బల్లికురవ) న్యూస్‌టుడే : విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా కార్పొరేట్ జనరల్ మేనేజర్ కక్కెర్ల వెంకటేశ్వర్లు కోరారు. ఉప్పుమాగులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బడి పిలుస్తోంది నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. . 2016 - 17లో పదిలో ఉత్తమంగా నిలిచిన గాదె రాంజేంద్రబాబు, గోరంట్ల కోమలకు రూ.5వేల నగదును పారితోషికంగా అందించారు. కక్కెర పద్మజ, కక్కెర గోపాలకృష్ణమూర్తి, బరోడా బ్యాంక్ మేనేజర్ గిరిబాబు, సత్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి. వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

2 నుంచి జన్మభూమి గ్రామ సభలు

సంతమాగులూరు, న్యూస్‌టుడే : మండలంలోని 20 పంచాయతీల్లో 5వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామ సభలు జనవరి 2 నుంచి ప్రారంభమవుతాయని సంతమాగులూరు ఎంపీడీవో శ్రీనివాసకుమార్ శనివారం తెలిపారు. 2న ఫత్తేపురం, మామిళ్లపల్లి, 3న బండివారిపాలెం, కుందుర్రు, 4న కొప్పరం, పరిటాలవారిపాలెం, 5న మిన్నెకల్లు, మక్కెనవారిపాలెం, 6న ఏల్చూరు, పాతమాగులూరు, 7న కొమ్మాలపాడు, పుట్టావారిపాలెం, 8న కామేపల్లి, సజ్జాపురం, 9న గురిజేపల్లి, చవిటిపాలెం, 10న తంగేడుమల్లి, అడవిపాలెం, 11న వెల్లలచెరువు, సంతమాగులూరుల్లో సభలు ఉంటాయన్నారు. ఎంపీడీవో, తహసీల్దారు రెండు బృందాలుగా ఏర్పడి సంయుక్తంగా గ్రామ సభల నిర్వహణను పర్యవేక్షిస్తారని తెలిపారు.

యువతకు వృత్తి విద్యలో ఉచిత శిక్షణ

సంతమాగులూరు, న్యూస్‌టుడే : ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వృత్తి విద్యలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రెబలైజర్ ప్రభుదాసు శనివారం తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడులో 70 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామని, భోజన వసతి కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు తమను సంప్రదించాలని కోరారు.

ప్రసన్నాంజనేయునికి ప్రత్యేక పూజలు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనృసింహస్వామి దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రీతిపాత్రమైన వారం అయినందున ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దర్శనానికి వరుస కట్టారు. ఆకుపూజలు, గోత్రనామార్చనలు జరిగాయి. మధ్యాహ్నం 150 మందికి అన్నసంతర్పణ చేశారు.. సాయంత్రం జరిగిన పల్లకీసేవలో స్వామి, అమ్మవార్లకు నగరోత్సవం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సహాయక మిషనర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గ్యాస్ సమాచారం

అద్దంకి: ఆదివారం సెలవు. **సంతమాగులూరు:** వెంకటసాయి హెచ్‌పీ గ్యాస్ పంపిణీదారు ఈ నెల 30 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు ఆదివారం గ్రామీణంలో సిలిండర్లు సరఫరా చేస్తారు. **బల్లికురవ :** స్థానిక హనుమాన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 30 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సోమవారం సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. **పంగులూరు:** పంగులూరు ఓందివ్యా ఇండేన్‌గ్యాస్ సిబ్బంది ఈనెల 31వరకు గ్యాస్ బుక్ చేసుకున్న ఖాతాదారులకు సోమవారం సిలిండర్లు సరఫరా చేస్తారు.

కొరిశపాడు : శ్రీ ఉమమహేశ్వర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారు ఈనెల 30 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సోమవారం సిలిండర్లు సరఫరా చేస్తారు.

పేదలకు అండగా రోటరీ

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : వృద్ధులు, పేదలకు అండగా రోటరీక్లబ్ నిలుస్తుందని మాజీ సహాయ గవర్నర్ వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) అన్నారు. శింగరకొండలోని రామనామ వృద్ధాశ్రమంలోని 36 మందికి శనివారం దుప్పట్లు, కండువాలు పంపిణీ చేశారు. చలికాలంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈచర్య తీసుకున్నట్లు వెల్లడించారు. దుప్పట్లు సమకూర్చిన దాతలకు సన్మానం చేశారు. క్లబ్ అధ్యక్ష, కోశాధికారి శ్రీలక్ష్మి, అంజాద్‌బాషా, యర్రా నరసింహారావు, కొల్లా రామాంజనేయులు, గోరంట్ల లక్ష్మీనారాయణ, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.



దుప్పట్లు తీసుకున్న వృద్ధులు. దాతకు సన్మానం చేస్తున్న దృశ్యం

గుప్పెడు బియ్యంతో అన్నదానం

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో గుప్పెడు బియ్యం పథకం ద్వారా రోగులకు అన్నదానాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన దేసు శివప్రసాదరావు తన తండ్రి జ్ఞాపకార్థం 150మంది రోగులకు అన్నసంతర్పణ చేశారు. మదర్ థెరెసా మహిళామండలి బాధ్యురాలు కొమ్ము సులోచన సహకారం అందించారు.

చీరాల



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ (న్యూ) జాతీయ అధ్యక్షులు విజయ్‌కుమార్

పథకాలపై అవగాహన

యద్దనపూడి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ, ఆరోగ్యరక్ష పథకాలపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శనివారం యద్దనపూడి జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ ప్రతినిధి కిరణ్‌కుమార్ విద్యార్థులకు అనేక అంశాలను వివరించారు. మాణిక్యరావు తదితరులు ఉన్నారు.

ఉద్యమ కెరటం కుటుంబరావు

వేటపాలెం, న్యూస్‌టుడే: కస్తూరి కుటుంబరావు ఓ ఉద్యమ కెరటమని, చేనేత, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు పోరాటాలు చేశారని, బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించటమే ఆయనకు నిజమైన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏఐఎఫ్‌టీయు(న్యూ) రాష్ట్ర నాయకులు కస్తూరి కుటుంబారావు సంస్మరణ సభ స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం నిర్వహించారు. సభకు ఎంఎస్ సాయి అధ్యక్షత వహించారు. జాతీయ అధ్యక్షులు గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కుటుంబరావు కార్మిక ఉద్యమాల్లో అంకితభావంతో పనిచేశారన్నారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, చీరాల ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాసరెడ్డి, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, రైతుకూలి సంఘ ఇల్లా కార్యదర్శి లలితకుమారి, చేనేత నాయకులు వార్తి సుబ్బారావు, పింజల భూషణం, బాబు తదితరులు కుటుంబరావు సేవలను కొనియాడారు.

నేత్రపర్వం..కావడి ఉత్సవం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక చీరాల శివాలయం ప్రాంగణంలోని వల్లీదేవసేన సమేత శ్రీషణ్ముఖ స్వామికి శనివారం రాత్రి కావడి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు, అర్చనలు, నైవేద్యాలు, హారతులు సమర్పించారు. రాత్రికి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. పురవీధులగుండా విశేషంగా దర్శనమిస్తున్న స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. నిర్వహణ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నగరోత్సవంలో పాల్గొన్న పురప్రజలు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేయాలి

విఠల్‌నగర్(చీరాల),న్యూస్‌టుడే : జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని వివిధ ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో శనివారం రాత్రి అఖిలపక్ష నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. డివిజన్ కార్యదర్శి బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైకాపా పట్టణాధ్యక్షుడు జైసన్‌బాబు, నాయకులు పి.బాబురావు, రమేష్, ఆశీర్వాదం, డి.నాగేశ్వరరావు, మేడా వెంకటరావు తదితరులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి తోడ్పాటు అవసరమన్నారు. రైతులను ఆదుకోవడానికి నూతన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో అనేక పరిశ్రమలను జిల్లాకు తీసుకొస్తామని ప్రకటనలు చేశారని వాటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆది నుంచీ అదే నిర్లక్ష్యం

- సున్నిత సమస్య పరిష్కారంలో యంత్రాంగం విఫలం
- నాలుగు రోజుల పాటు చీరాలలో ఉద్రిక్తత
- దేవర సుబ్బులు ఘటన ఓ గుణపాఠం

కొందరు వ్యక్తుల దాడిలో గిరిజన మహిళ చికిత్స పొందుతూ ప్రాణం కోల్పోయిన విషాద సమయమది. ఓ వైపు బాధితుల ఆవేదన .. మరోవైపు కరవైన సాంత్వన ! ఈ సున్నిత సమస్యను చాకచక్యంగా పరిష్కరించి అంత్యక్రియలు సాఫీగా నిర్వహించేలా చూడాల్సిన యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దీంతో నాలుగు రోజులు చీరాల, గవినివారిపాలెంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎట్టకేలకు శనివారం దేవర సుబ్బులు అంత్యక్రియలు పూర్తవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చీరాల, న్యూస్‌టుడే :

గవినివారిపాలేనికి చెందిన దేవర సుబ్బులు పట్ల మాజీ సర్పంచి వర్గీయుల వ్యవహార శైలి గత కొంతకాలంగా వివాదస్పదంగా మారింది. దీంతో బాధితురాలు పలుమార్లు రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా వారిలో స్పందన కరవైంది. కలెక్టరేట్ వద్ద ఆమె ఆత్మహత్యాయత్నం చేసినా పరిస్థితిలో మార్పురాలేదు. తదనంతరం ఆమెపై దాడి జరిగిన తర్వాత విజయవాడలోని వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించింది. దీంతో ఈ నెల 27 రాత్రికి మృతదేహం చీరాల వచ్చింది. అప్పటి నుంచి అంత్యక్రియలు నిర్వహించడానికి అడుగడుగునా అవాంతరాలు ఎదురయ్యాయి.

నిర్ణయాలు తీసుకోవడంలో అలసత్వం

ఈ నెల 28 మృతదేహాన్ని పోస్టుమార్టం చేయటానికి స్థానిక పోలీసులు సమాయత్తం కాగా కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులే దర్యాప్తు చేయటమేమిటని ప్రశ్నించారు. బయటి అధికారుల చేత కేసు దర్యాప్తు చేయించాలని, రిమ్స్ నుంచి వైద్య నిపుణుడిని తీసుకొచ్చి పోస్టుమార్టం చేయించాలని, కుటుంబ సభ్యులకు న్యాయం చేసే విషయంలో ఆర్డీవో హామీ ఇవ్వాలని పట్టు బట్టారు. అయితే ఈ విషయంలో ఒక నిర్ణయానికి రావటానికి అధికారులు చాలా సమయం తీసుకున్నారు. మొదట్లో తహసీల్దార్ వచ్చి ఒంగోలు నుంచి వచ్చిన ఆచార్యుడి చేత పోస్టుమార్టం చేయించేందుకు ప్రయత్నించారు. మిగిలిన డిమాండ్ల హామీ లేకుండా పోస్టుమార్టానికి అంగీకరించేది లేదని కుటుంబసభ్యులు స్పష్టం చేయడంతో రెండో రోజు వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం వరకూ ఇదే ప్రతిష్టంభన కొనసాగింది. సున్నితమైన ఈ అంశాన్ని బాధితులు, గవినివారిపాలెం గ్రామస్థులకు వివరించి అంత్యక్రియలు పూర్తయ్యేలా చేయడంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.



అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తున్న కుటుంబ సభ్యులు

జిల్లా అధికారుల నుంచి స్పందన కరవు

ఈ విషయంలో జిల్లా అధికారుల నుంచి కూడా స్పందన కొరవడింది. భూ వివాదం విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతోపాటు తనకు న్యాయం చేయాలని సుబ్బులు ఆత్మహత్య యత్నం చేసినా యంత్రాంగం మాత్రం ఉలుకూ పలుకూ లేకుండాపోయారు. తరువాత మృతదేహాన్ని పోస్టుమార్టం సమయంలో కూడా బాధితులతో మాట్లాడి ఒప్పించేందుకు ప్రయత్నం చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.

రాజకీయ పక్షాల రంగప్రవేశంతో..

సుబ్బులు విషయంలో గడిచిన నాలుగు రోజులుగా చీరాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ప్రజా, దళిత, గిరిజన సంఘాల నాయకులతోపాటు వైకాపా, లెఫ్ట్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలను రప్పించారు. దీంతో క్షీరపురిలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలలో ఆందోళన నెలకొంది. అధికారుల అలసత్వంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎట్టకేలకు ఆర్డీవో శ్రీనివాసరావు బాధితులకు న్యాయం చేస్తానని శుక్రవారం హామీ ఇవ్వడంతో స్పందించిన బాధితులు మృతదేహాన్ని గవినివారిపాలెం తరలించి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఇష్టపడి పనిచేస్తే విజయం



వివరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

చీరాల, న్యూస్‌టుడే : విద్యార్థులు తాము చేసే పనిని మొదట ఇష్టపడి చేస్తే విజయం దానంతట అదే వస్తుందని మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఏ.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం చైతన్యభారతి కళాశాలలో విద్యార్థులలో భయాలను పోగొట్టడం, ఆత్మహత్యల నివారణ, పరీక్షలంటే భయం లేకుండా చేయటం వంటి అంశాలపై కామాక్షి కేర్ వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ ప్రతి విషయంలో మంచి చెడులు ఉంటాయని ఇందులో మంచిని తీసుకుంటే మనం ముందుకెళ్లడం సులువుగా ఉంటుందన్నారు. సానుకూల దృక్పథం ఉంటే ఎటువంటి అంశాన్నైనా పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైద్యశాల ఎండీ టి.దేవరాజ్, ప్రిన్సిపల్ సోమేశ్వరరావు, రాంబాబు, సురేష్, ఉస్మాన్, వెంకటేశ్వర్లు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై నిరంతర పోరాటం

చీరాల, న్యూస్‌టుడే : పేదల సమస్యలపై కమ్యూనిస్టులు నిరంతర పోరాటం చేస్తూనే ఉంటారని, అలాంటి వారికి ప్రతిరూపమే బూదరాజు కపర్ధి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భావ వేడుకలను శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. సీనియర్ నాయకుడు కపర్ధిని సన్మానించారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి మేడా వెంకటరావు, నాయకులు బాబురావు, నూతి లక్ష్మయ్య, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్కపల్లి రామకోటయ్య, చండూరి వాసు తదితరులు మాట్లాడుతూ కపర్ధి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. సీనియర్ న్యాయవాదిగా అనేక సేవలు అందించినట్లు తెలిపారు. పేదలకు అండగా ఉండేది కమ్యూనిస్టులేనని చెప్పారు. ప్రజల సమస్యలపై పోరాడుతూ వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల దేవదానం, బి.సంజీవరావు, జంగా మోహనరావు, మణిబాబు, అమరా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

జన్మభూమి సభలకు విధిగా హాజరుకావాలి

చీరాల గ్రామీణం: జనవరి 2 నుంచి జరగనున్న జన్మభూమి గ్రామ సభల్లో అధికారులందరు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జన్మభూమి గ్రామసభల అంశంపై మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చీరాల మండలంలో 15 పంచాయతీలో జనవరి 2నుంచి 11వరకు జరగనున్న గ్రామ సభలు సజావుగా జరిగేందుకు అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా ఈ గ్రామసభల్లో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత జన్మభూమిలో వచ్చిన అర్జీలు పరిష్కారాలు, అదేవిధంగా ప్రస్తుతం జన్మభూమి సభల్లో వచ్చే అర్జీలపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్లు

తెరపై ఈనాడు

చీరాల గ్రామీణం: సాయి ప్యాలెస్: ఒక్క క్షణం, సంగం:ఎంసీఏ, మోహన్: హలో, శాంతి: 2 కంట్రీస్ , **వేటపాలెం:** విజయభాస్కర్: జవాన్

చీరాల



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జనవరిలో ఎస్ఎఫ్ఐ 40వ జిల్లా మహాసభలు

చీరాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ 40వ జిల్లా మహాసభలు జనవరి 3,4 తేదీలలో పాపరాజుతోట బాపనమ్మ కల్యాణ మండపంలో జరుగుతున్నట్లు ప్రతినిధులు తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను శనివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జిల్లా విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ గురించి జిల్లా ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవటం బాధాకరమన్నారు. సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు ఎన్నో సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి 2012లో నిర్ణయించిన మెస్‌ఛార్జీలనే నేటికీ అమలు చేస్తున్నారని, దీంతో చాలీచాలని భోజనంతోనే సరిపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మహాసభల్లో జిల్లాలో విద్యారంగ సమస్యలపై చర్చించుకుని వాటిని పరిష్కరించేందుకు భవిషత్తులో చేయబోయే కార్యక్రమాలపై చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జి.ఆదిత్య, అశోక్, కిషోర్, శివ, పి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

నేడు పద్య పఠన పోటీలు

చీరాల, న్యూస్‌టుడే : ప్రఖ్యాత తెలుగుకవి తుమ్మల సీతారామమూర్తి జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాంజలి అధ్యక్షుడు కాకరపర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగే ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు ముందుగా వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. హైస్కూలు, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు.

గ్యాస్ సమాచారం

చీరాల: 26.12.2017, వేటపాలెం:27.12.2017

కూరగాయల ధరలు

చీరాల: టమాటా: 20, దుంప:30, బీరకాయ:35, బెండకాయ:35, దొండకాయ:40, కాకరకాయ :40, క్యారెట్:60, మిర్చి: 50

బస్సు సమాచారం

తేది: 31-12-2017

సమయం	సర్వీసు	ఊరి పేరు	వయా	ఖాళీలు
5.30	ఎక్స్‌ప్రెస్	శ్రీశైలం	ఒంగోలు	30
7.45	అల్ట్రాడీలక్స్	కాకినాడ	విజయవాడ	20
1.30	అల్ట్రాడీలక్స్	బెంగళూరు	కడప	00
3.00	సూపర్‌లగ్జరీ	షాపూర్	పర్చూరు,ఒంగోలు	05
4.00	సూపర్‌లగ్జరీ	షాపూర్	మార్టూరు, అద్దంకి	08
8.30	సూపర్‌లగ్జరీ	బీహెచ్ఈఎల్	మిర్యాలగూడ	00
9.00	సూపర్‌లగ్జరీ	బీహెచ్ఈఎల్	మిర్యాలగూడ	03
9.30	సూపర్‌లగ్జరీ	బీహెచ్ఈఎల్	మిర్యాలగూడ	08
10.00	సూపర్‌లగ్జరీ	ఈసీఐఎల్	మిర్యాలగూడ	00
10.30	ఇంద్రా ఏసీ	బీహెచ్ఈఎల్	మిర్యాలగూడ	05

రిజర్వేషన్ ఫోన్ నంబర్ 9959225734

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

చీరాల పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా చీరాల డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్‌చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ బృందాలతోపాటు షీ టీమ్‌లు కూడా తిరుగుతాయని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా వాడరేవు, రామాపురం ఇతర సముద్రతీర ప్రాంతాలలో కూడా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు.

ముగిసిన సాధికార మిత్రల శిక్షణ

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటిలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ఆరాతీసి సమగ్ర నివేదికను అందజేయాలని ఏడీఏ రాజకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సాధికార మిత్రలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అధికారి రాజకుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో సాధికార మిత్రలు బాధ్యతతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా అప్పగించిన కుటుంబాలకు సంబంధించి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం మోహన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో ఫాతిమా, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రాజకుమారి

వీఆర్ఎస్, వైఆర్ఎన్ ప్రిన్సిపల్‌గా బ్రహ్మయ్య

చీరాల, న్యూస్‌టుడే : వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా అర్థశాస్త్ర అధ్యాపకుడు ఎం.బ్రహ్మయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న జాగర్లమూడి రేవతి శనివారం పదవీ విరమణ చేయటంతో బ్రహ్మయ్య బాధ్యతలు చేపట్టారు. 1985లో కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా నియమితుడైన బ్రహ్మయ్య ప్రస్తుతం శాఖాధిపతిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ తనను మొదటి నుంచి ప్రోత్సహించి తన ఉన్నతికి కారణమైన కరణం బలరామకృష్ణమూర్తితోపాటు కార్యదర్శి వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బ్రహ్మయ్య

కాలమానిని ఆవిష్కరణ

కొత్తపేట(చీరాల),న్యూస్‌టుడే : క్రమమైన జీవనానికి కాలమానిని ఎంతో ఉపయోగకరమని వేటపాలెం తహసీల్దార్ కేఎల్ మహేశ్వరరావు పేర్కొన్నారు. కొత్తపేటలో ప్రసిద్ధి చెందిన ఓంకార క్షేత్రం ఆలయ కాలమానిని శనివారం దేవాలయం వద్ద తహసీల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి జీవితం సక్రమమైన నడవడికతో ప్రశాంతంగా సాగటానికి ఆధ్యాత్మికత తోడ్పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు టి.సత్యనారాయణ, వీఆర్‌కె శర్మ, నరేంద్ర, రామశేఖర్, బి.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తదితరులు

భావ వ్యక్తీకరణపై పట్టు సాధించాలి


చల్లారెడ్డిపాలెం,(వేటపాలెం), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచే ఆంగ్లంలో మాట్లాడటంతోపాటు భావ వ్యక్తీకరణపై పట్టు సాధించాలని బెంగళూరుకి చెందిన ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఆఖరి సంవత్సరం ఈసీఈ విభాగం విద్యార్థులకు ఏర్పాటు చేసిన కెరీర్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన అతిథోపన్యాసంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానాచార్యుడు డాక్టరు పి.రవికుమార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు విద్యార్థుల భవిష్యత్తుకి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ఈసీఈ ప్రధాన విభాగాధిపతి డాక్టరు కె.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫణీంద్రకుమార్

2 నుంచి జన్మభూమి గ్రామసభలు

వేటపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని రెండోతేదీ నుంచి జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేఎల్ మహేశ్వరావు తెలిపారు. 2న వేటపాలెం, 3న పుల్లరిపాలెం, 4న పందిళ్లపల్లి, 5న చల్లారెడ్డిపాలెం, 6న రామన్నపేట, 8న కొత్తపేట, 9న అక్కాయిపాలెం, 10 పాపాయిపాలెం, 11న దేశాయిపేటలో గ్రామసభలు జరుగుతాయన్నారు. గ్రామసభలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద మాత్రమే నిర్వహిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





దర్శి

తెదేపా హామీలను నెరవేర్చాలి

దర్శి, న్యూస్‌టుడే: తెలుగుదేశం ప్రభుత్వం దర్శి నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డివిజన్ సీపీఎం కార్యదర్శి తాండవ రంగారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సందు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొనకొండను పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేస్తామని, దర్శిలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేస్తే, 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఎర్రచెరువును మంచినీటి చెరువుగా మార్చడానికి రూ.35 లక్షలు ఇస్తున్నామని, దొనకొండ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి మూడున్నర సంవత్సరాలు గడిచినా, ఇంత వరకు అమలు కాలేదని విమర్శించారు. జనవరి 8 నుంచి కనిగిరిలో జరిగే జిల్లా మహాసభల్లో దర్శి నియోజకవర్గ అభివృద్ధికి తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలుపై చర్చించి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని తాండవ రంగారావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్లూరి కొండారెడ్డి, సీపీఐ నాయకులు కరుణానిధి, ప్రజాసంఘాల నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, ఆర్.మోహన్, కోటయ్య, కోటిరెడ్డి, జూపల్లి కోటేశ్వరరావు, రుషి, కర్నా హనుమయ్య, చిరుపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు తాండవ రంగారావు

వెలిగొండను త్వరగా పూర్తి చేయాలి

పెద్దారవీడు: మంత్రి సోమిరెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కలిసి వెలుగొండను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కరవు ప్రాంతం అయిన పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెలుగొండను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు


అంగన్‌వాడీ శాశ్వత భవనం


నూతన విద్యుత్తు సబ్‌స్టేషన్

అభివృద్ధి వైపు కొత్తపల్లి అడుగులు

☛ రైతులకు వరంగా విద్యుత్తు సబ్‌స్టేషన్ ☛ సీసీ రోడ్లతో కొత్త కళ

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో నిర్మించిన 33/11 కె.వి. విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిసర ప్రాంత రైతులకు వరంగా మారింది. బోర్లపై పంట పండించే రైతులకు లోవోల్టేజ్ సమస్యను తీర్చింది. దీని నిర్మాణంపై పరిసర ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్, ప్రధాన రహదారి వెంట కాలువలు.. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, నాలుగు అంగన్‌వాడీ శాశ్వత భవనాలు ఇలా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. రూ.7 లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు, రూ.7.80 లక్షలతో ఒకటి, రూ.5 లక్షలతో మరొకటి నిర్మించారు. రూ.1.02 కోట్లతో గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి కాలువలు నిర్మించారు. దీంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా గ్రామ శివారుకు చేరుతుంది. 14వ ఆర్థిక సంఘం, ఉపాధి నిధులు రూ.6 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో సమస్య తొలగిపోయిందని గ్రామస్థులు అంటున్నారు.


ప్రధాన రహదారి వెంట నిర్మించిన కాలువలు

భాజపా బలోపేతానికి కృషి

దర్శి, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.వి.కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యేరువ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం 106 పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులను కరవు కాటకాల్లో ఆదుకోవడానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లలో కార్యకర్తలు ఉండే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిండి నారాయణరెడ్డి, విస్తారక్ జె.శ్రీనివాసు, కాకర్ల ఆంజనేయులు, మాడపాకుల శ్రీను, వీరంరెడ్డి నాగిరెడ్డి, ఆలమోతు అమర్‌నాథ్, ఎ.కోటేశ్వరరావు, టి.జయప్రకాశ్, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ వెంకటేశ్వర్లు, వి.అంకిరెడ్డి, రంగనాయకులు, చరణ్, బోసుబాబు, అమరేశ్వరరావు, సుబ్బారావు, సుబ్బారెడ్డి, రాము, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అలంకరణలో వేంకటేశ్వరస్వామి

శ్రీవారికి విశేష పూజలు

పెదఉల్లగల్లు(ముండ్లమూరు), న్యూస్‌టుడే: మండలంలోని పెదఉల్లగల్లు గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. స్వామి వారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు నరసింహమూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు స్వామివారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ పరిసర గ్రామాల నుంచి భక్తులు విరివిగా తరలి వచ్చి పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు. మహిళా భక్తులు స్వామి వారికి పొంగళ్లు పొంగించారు. స్వామి వారికి పూలు, పండ్లు, కొబ్బరికాయ నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జన్మభూమిని విజయవంతం చేయాలి

తాళ్లూరు, న్యూస్‌టుడే : వచ్చే నెల రెండో తేదీ నుంచి నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎం.రాజేష్‌బాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఆ కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. గత జన్మభూమిలో ప్రజలు అందజేసిన అర్జీలకు పరిష్కారం తీరును సభల్లో వెల్లడించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం సూచించిన అంశాల గురించి తహసీల్దారు కేవీ కృష్ణారావు వివరించారు. రోజుకు రెండు గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహిస్తామన్నారు. కార్యాలయ పర్యవేక్షులు ఎస్.సత్యం, ఈఓఆర్డీ సురేష్, పలువురు అధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోజూ రెండు గ్రామాల్లో సభలు

ముండ్లమూరు న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు గ్రామసభలను జనవరి రెండు నుంచి నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని 19గ్రామ పంచాయతీల్లో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. 2వ తేదీ తూర్పుకంభంపాడు, నూజెల్లపల్లి, 3న పోలవరం, శంకరాపురం, 4న పసుపుగల్లు, కెల్లంపల్లి, 5న పెదఉల్లగల్లు, పులిపాడు, 6న మారెళ్ల, జమ్మలమడక, 7న పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం, 8న ఈదర, భీమవరం, 9న బొప్పిడివారిపాలెం, వేముల, 10న నాయుడుపాలెం, శింగన్నపాలెం, 11న ముండ్లమూరు గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

క్రీడా పాఠశాలగా ఎంపిక

తాళ్లూరు, న్యూస్‌టుడే : తాళ్లూరులోని సరస్వతి ఉన్నత పాఠశాలను క్రీడా పాఠశాలగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలకు సంబంధించిన 120 మంది చిన్నారులను ఎంపిక చేశారు. వీరికి వాలీబాల్, తైక్వాండో, వివిధ రకాల అథ్లెటిక్స్ పోటీల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా వ్యాయామోపాధ్యాయుడిని కేటాయించారు. వారికి ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇచ్చింది. వైద్య ఖర్చులకు రూ.రెండులక్షల వరకూ, ప్రమాద బీమా సౌకర్యం రూ.పది లక్షల వరకూ కల్పించింది. శనివారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ ఏవీ.రమణారెడ్డి చేతులమీదుగా చిన్నారులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.శ్రీరామమూర్తి, ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు హెల్త్ కార్డులు అందజేస్తున్న ఏవీ.రమణారెడ్డి


ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి శిద్దా, కలెక్టర్ వినయ్‌చంద్, ఎమ్మెల్సీ బలరాం


వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌చంద్, ఎస్పీ సత్యఏసుబాబు

సీఎం సభకు చురుకుగా ఏర్పాట్లు

దర్శి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న జన్మభూమి గ్రామసభకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జనవరి 2న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి దర్శిలో ప్రారంభించనున్నారు. ఇందు కోసం శివరాజనగర్‌లోని ఆదర్శ పాఠశాలలో సభను ఏర్పాటు చేస్తున్నారు. భారీ స్థాయిలో వేదిక నిర్మిస్తున్నారు. 40 వేల మంది జనాభా కుర్చునేందుకు అనువుగా సభా స్థలాన్ని బాగు చేశారు. ఆ పాఠశాలకు ఎదురుగా ఉన్న ఎన్జీవో స్థలంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర అటవీ, పరావ్యరణ, శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్సీ కరణం బలరాం, జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్, ఎస్పీ ఏసుబాబు శనివారం సాయంత్రం దర్శి వచ్చారు. రాత్రి 8 గంటల వరకు ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై సమీక్షించారు. సభా వేదికతో పాటు, ప్రాంగణాన్ని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. వాహనాలు నిలిపేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. వంద మంది మహిళలు ముగ్గులు వేసే విధంగా సుమారు మూడు ఎకరాల విస్తీర్ణాన్ని బాగు చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి 20 ప్రదర్శన శాలలను నెలకొల్పుతున్నారు. వీటికి సంబంధించిన అంశాలపైన చర్చించారు. ఉదయం నుంచే ఆర్‌అండ్‌బి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ఇక్కడే ఉండి ఏర్పాట్లను చూస్తున్నారు. ఆర్‌అండ్‌బి, విద్యుత్‌శాఖ ఎస్ఈలు దేవదాస్, సుబ్బరాజు, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు పోలప్ప, సరోజిని దేవి, స్టెప్ సీఈవో బి.రవి, కందుకూరు ఆర్డీవో మల్లికార్జునలు సభ ఏర్పాట్లను మంత్రికి, అధికారులకు వివరించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెదఉల్లగల్లు(ముండ్లమూరు), న్యూస్‌టుడే: పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో ఇండ్ల శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని పెదఉల్లగల్లు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. తరగతి గదుల, పాఠశాల ఆవరణ పరిశీలించి పరిశుభ్రంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలలో విద్యార్థుల హాజరు కంటే ఎక్కువ ఉండటంపై ఉపాధ్యాయులను అభినందించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొల్లినేని ఉషారాణి, ఉపాధ్యాయులు తిప్పిశెట్టి శ్రీనివాసులు, మందలపు సునీత, కె.శంకరరావు, వి.సుగుణవతి, బి.యశస్ర, పరిశీలకులు కంఠ శ్రీనివాసులు, గోగుల కోటేశ్వరరావు, బీసీఎం నాయక్, దారంయ రమణారెడ్డి, సీఆర్‌పీ కోటిసాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి

కూరగాయల ధరలు

దొండ కిలో రూ.20, పచ్చిమిర్చి-30, తోటకూర-07, గోంగూర-05, టమోటా-10, క్యాబేజీ-30, దోస-20, దుంపలు-25, బీట్‌రూట్-60, క్యారెట్-60, బీన్స్-100, గోరుచిక్కుళ్లు-30, వంకాయలు-30, మునగకాయలు-160, కాకర-30, బెండ-30, బీర-40, పొట్ల-30, సొర-15, కీరదోస-40

కిశోర వికాసంపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శిరీష

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం తాళ్లూరులోని వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సీహెచ్.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య పాల్గొని మాట్లాడారు. బాలికలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. చీమకుర్తిలోని బీఈడీ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థినులు బృందాలుగా వచ్చి కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ఐసీడీఎస్ పర్యవేక్షరాలు అరుణాదేవి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండ, న్యూస్‌టుడే: బాలికలకు సమాజంలో అన్ని విషయాలపై అవగాహన ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో కిశోర వికాసంపై శనివారం శిక్షణనిచ్చారు. వ్యక్తిగతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం విద్యకు సంబంధించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి రావాలన్నారు. వసతి గృహం సంక్షేమకురాలు పద్మావతి, కళాశాల విద్యార్థినులు సాయివెన్నెల, ఉషా, ప్రియా, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే సమాజంలో గుర్తింపు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ఉన్నత చదువులతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇందిరా, కేజీబీవీ ఎస్‌వో సునీత అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పథకం అమలుపై సమవయస్క బృంద సభ్యులు విద్యార్థులకు వివరించారు. శిక్షకులు ప్రవల్లిక, అనూష, శిరీషా, సుధారాణి, హరిత, హెప్సిబాలు లైంగికదాడులు, వేధింపులు, సంబంధిత చట్టాలు, కుటుంబ, సామాజిక విలువలు, భవిష్యత్తు ప్రణాళిక వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయనులు రత్నమాలినిదేవి, చంద్రకళ, సునీత, పుణ్యవతి, మహిమశిల్ప, వసుందరదేవి పాల్గొన్నారు.



కిశోర వికాసం యాత్ర ప్రారంభిస్తున్న ప్రముఖులు

ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు ఆలయాల్లో శనివారం ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రస్తుత ధనుర్మాసం ప్రాధాన్యాన్ని పురస్కరించుకొని తాళ్లూరులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే విశేషంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు ఉభయ దాతలుగా వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వార్లకు సుప్రభాత సేవలు, అష్టోత్తర, సహస్రనామార్చనలు చేశారు. విఠలాపురంలో నూతనంగా నిర్మించిన రామాలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లోని పూజారులు సంప్రదాయ బద్ధంగానూ పూజలు నిర్వహించారు. విఠలాపురంలోని కాలనీలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆల యంలోనూ విశేష పూజలు చేశారు. కొందరు భక్తులు ఉత్సాహంతో ఉదయాన్నే ఆలయాలకు తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు తరలి వచ్చిన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బీమా నగదు అందజేత

తాళ్లూరు, న్యూస్‌టుడే : తాళ్లూరు దళితవాడకు చెందిన కె.మోహన్‌రావు(51) శనివారం మృతి చెందడంతో చంద్రన్న బీమా పథకం ద్వారా మృతుడి కుటుంబీకులకు రూ.ఐదువేల నగదు పంపిణీ చేశారు. తక్షణం మట్టి ఖర్చులకు ఉపయోగపడేందుకు ఆ నగదును బీమామిత్ర అనంతలక్ష్మి అందజేశారు. మిగతా నగదును త్వరలోనే తెప్పించి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా మహిళా సంఘం నిర్వాహకురాలు ఎస్తేరురాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ జాబితాలో చేర్చితేనే రజకులకు న్యాయం'

గోగులదిన్నె (మార్కాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: ఎస్సీ జాబితాలో చేర్చితేనే రజకులకు న్యాయం జరుగుతుందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు చేపడుతున్న ఇంటింటికీ రజక సంఘం కార్యక్రమం శనివారం... గోగులదిన్నె, తర్లుపాడు మండలం లోని గానుగపెంట, పోతలపాడు గ్రామాల్లో నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి తిరుపతయ్య, నాయకులు టి.వి కాశయ్య, కె.వెంకటేశ్వర్లు, సురభి వెంకటేశ్వర్లు, టి.శ్రీను, పి.శివ, చిన్న, చిన్న కాశయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా హయాంలోనే దళిత వాడల అభివృద్ధి




సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకట్రావు

శింగన్నపాలెం(ముండ్లమూరు), న్యూస్‌టుడే: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే దళితవాడలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ మండలపు వెంకట్రావు అన్నారు. మండలంలోని శింగన్నపాలెం ఎస్సీ కాలనిలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్ల నిర్మాణం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. శనివారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక మంత్రి శిద్దా రాఘవరావు ప్రత్యేకంగా దృష్టి సారించి మండలంలోని పులిపాడు, కెల్లంపల్లి, శింగన్నపాలెం గ్రామాలకు సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఎస్సీ కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి దళితవాడలను పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో రూ.50 లక్షల సబ్ ప్లాన్ నిధులతో 1030 మీటర్ల మేర ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి మానం నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు గంధం పెదపుల్లయ్య, ఉపాధ్యాయులు లింగరావు, గ్రామస్థులు వెంకట్రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



దర్శి: వెంకటేశ్వర (హలో), శివశంకర (ఎంసీఏ), శ్రీనివాస (ప్రోజెక్ట్ జెడ్), భాస్కర (ఒక్క క్షణం).



దర్శి: స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజన్సీ పరిధిలో ఐవీఆర్ఎస్ ద్వారా ఈ నెల 30 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు మంగళవారం నుంచి సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తాళ్లూరు: తాళ్లూరులోని శ్రీ మంగా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 28 వరకు నమోదు చేసుకున్న అన్ని గ్రామాల్లోని వినియోగదారులకు ఆదివారం నేరుగా సిలిండర్లు అందజేస్తారు.

ముండ్లమూరు: స్థానిక వైష్ణవి భారత్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటలలోపు ఐవీఆర్ఎస్ ద్వారా నమోదు చేసుకున్న వినియోగదారులకు అదేరోజు సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండదు



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్

దొనకొండ, న్యూస్‌టుడే: మంచినీటి చెరువుల్లో నీరు నిండా ఉన్నందున ఈ వేసవిలో సమస్య ఉండదని ఎంపీడీవో అనుమల్ల రాజేందర్ చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. జనవరి 2 నుంచి నిర్వహించే జన్మభూమి- మా ఊరు గ్రామసభల్లో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలు గ్రామాల్లో తారు రోడ్లు, సీసీ రోడ్లు వేశామని, అక్కడక్కడ మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండ్లచెరువు విద్యుత్తు లైన్‌లో లో ఓల్టేజి ఎక్కువగా ఉండటం వల్ల బోర్లకు సరఫరా అందటం లేదని, వెంకటాపురంలో విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేస్తే తప్ప సమస్య తీరదన్నారు. త్వరలో ప్రతి పంచాయతీ వీధుల్లో ఎల్ఈడీ బల్బులు వేస్తారని, వాటికి సంబంధించిన లైన్లు వేస్తామన్నారు. పశువైద్యాధికారి మణిశేఖర్ మాట్లాడుతూ క్షీర సాగర పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులు తమ పశువులకు వినియోగించుకునేందుకు దాణా అందుబాటులో ఉందని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే తెప్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మగ్బుల్ అహ్మద్, ఏవో శైలజ రాణి, ఎంఈవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జన సేన సేవాదళ్ సమ్మేళనం

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడులోని జనసేన సేవాదళ్ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాబాషా, నాగార్జున, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

అలగాయపాలెం(ఉలవపాడు), న్యూస్‌టుడే: మత్స్యకార మహిళలకు రక్షణ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సిబ్బంది మాట్లాడుతూ.. ఎయిడ్స్, క్షయ వంటివి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది వెంకటేశ్వర్లు, కల్యాణి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాల గమనంలో కందుకూరు...

- ❖ మళ్లీ కలిసిరాని వ్యవసాయం
- ❖ పెరిగిన చోరీలు, నేర సంస్కృతి
- ❖ అభివృద్ధి పనుల వైపు అడుగులు



ముందుకు సాగని సోమశిల ఉత్తర కాలువ పనులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

మరి కొద్ది గంటల్లో నియోజకవర్గ ప్రజలు కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టనున్నారు. గత ఏడాది కాలంలో మొత్తం మీద వ్యవసాయం నిరాశాజనకంగా సాగింది. రైతులకు చేదు జ్ఞాపకాలను మిగల్చింది. అదే సమయంలో కొంత అభివృద్ధితో పాటు, మరికొన్ని ముఖ్యమైన సంఘటనలు ఈ ఏడాదిలోనే చోటుచేసుకున్నాయి. అదే సందర్భంలో నేర ప్రవృత్తి కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. దీంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రామాల వీలీన సమస్య, అంకమ్మ తల్లి భూముల వేలం విషయం ఓ కొలిక్కి రాగా, మున్సిపల్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఉద్యోగిపై దాడి సంఘటన నియోజకవర్గంలో రాజకీయంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అలాగే జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన వృద్ధుల వరుస హత్యలు, పదుల సంఖ్యలో జరిగిన దొంగతనాలు చర్చనీయాంశంగా మారాయి.

◗ రైతులకు 2017వ సంవత్సరం పూర్తిగా చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌ను పూర్తిగా కోల్పోగా, రబీలోనూ అంతంత మాత్రంగానే పంటలు సాగయ్యాయి. వరుసగా నాలుగో ఏడాది రాళ్లపాడు ప్రాజెక్టు రైతులు పంటలు వేసుకోలేని దుస్థితి నెలకొంది. సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు పనులు, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు ఈ ఏడాది కూడా అపరిష్కృతంగానే ఉన్నాయి. అయితే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు విషయంలో భూసేకరణ పనుల్లో కొంత ముందడుగు పడింది.

◗ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉండి, రాజకీయ ఎత్తుగడలకు వేదికగా ఉన్న మున్సిపాలిటీలో విలీన గ్రామాల సమస్య ఓ కొలిక్కి వచ్చింది. కందుకూరు మండలంలోని ఆనందపురం, దివివారిపాలెం పంచాయితీల్లోని 8 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ఈ ఏడాదిలోనే కోర్టు తీర్పు రావడం, ప్రభుత్వ పరంగా ఆదేశాలు వచ్చాయి. దీంతో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పెద్ద తలనొప్పిగా ఉన్న విలీన గ్రామాల సమస్య ఓ కొలిక్కి వచ్చినట్లయింది. అలాగే పలు వివాదాలకు కేంద్రంగా, పట్టణంలో అత్యంత విలువైన అంకమ్మ తల్లి దేవాలయం భూముల పంచాయితీ పరిష్కారమైంది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం దేవాదాయ శాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే అంకమ్మ తల్లి దేవాలయం భూములు సమస్య పరిష్కారమైనట్లైంది.

◗ మున్సిపల్ ఆర్ఐ రామయ్యపై చోటుచేసుకున్న దాడి సంఘటన రాజకీయంగా పెద్ద దుమారం రేపింది. తన సొంత పనులు చేయలేదనే కారణంతో పొన్నలూరు మండలానికి చెందిన అనుమోలు సుధాకర్ అనే గుత్తేదారుడు ఆర్ఐ దాడి చేశారు. దీంతో అటు రాజకీయంగానూ, ఇటు ఉద్యోగ వర్గాల్లోనూ ఈ సంఘటన దుమారం రేపింది. పలు రాజకీయ ఆరోపణలకు ఈ సంఘటన వేదికగా మారింది. ఈ ఘటనకు మద్దతుగా జిజిల్లాలోని అన్ని మున్సిపల్, నగర పంచాయితీ కార్యాలయాల్లో ఉద్యోగులు విధులు బహిష్కరించి సంఘీభావం తెలుపుతూ నిందితుడ్ని అరెస్టు చేయాలని ధర్నా చేశారు.

◗ కందుకూరులోని అధికారులు కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. సీనియర్ సివిల్ జడ్జి మహేంద్రఫణి కుమార్ తెలుగులో తన తీర్పును వెలువరించారు. అలాగే తండ్రిని పట్టించుకోని ఇద్దరు కుమారులకు ఆర్డీవో మల్లికార్జున శిక్ష విధించడంతోపాటు, తండ్రి పోషణ కోసం ఇద్దరి సంపాదన నుంచి కొంత మొత్తం చెల్లించేలా ఆర్డీవో తన కోర్టులో తీర్పు చెప్పారు. కన్న తల్లిని మోసం చేయడమే కాకుండా, ఆమె పోషణను గాలికొదిలేసిన కుమారుడికి ఆర్డీవో సీనియర్స్ సిటిజన్స్ చట్టాన్ని ఉపయోగించి సరైన బుద్ధి చెప్పారు. అతని పేరుపై ఉన్న పొలం పాస్ పుస్తకాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తల్లి పేరుపై కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలని తీర్పు చెప్పారు.



ఉద్యాన కళాశాలకు స్థలాన్ని పరిశీలిస్తు న్న అధికారులు



మాలకొండ ఆలయ అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోతుల రామారావు

◗ పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ లక్ష్మీనరసింహ ఆలయం అభివృద్ధికి అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఇటీవలే అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ ఆధునికీకరణ, గర్భగుడిలో సెంట్రల్ ఏసీ వంటి పనులకు రూ. 1.7 కోట్లతో ఎమ్మెల్యే పోతుల రామారావు భూమి పూజ చేశారు.

◗ గుడ్లూరు మండలంలోని చినలాటరపి వద్ద ఉద్యాన కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఈ ఏడాదిలోనే అనుమతిచ్చింది. అధికారులు భూములను సైతం కేటాయించారు.

◗ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నేర సంస్కృతి గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పెరిగిందనే చెప్పొచ్చు. ప్రధానంగా పట్టణంలో చోటుచేసుకున్న చోరీలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. వీటిలో పట్టణంలోని పాతబ్యాంకు బజార్‌లో జరిగిన వంద సవర్ల బంగారం దోపిడీ జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. అలాగే ఈ ఏడాది కాలంలో దాదాపు 20కి పైగా దొంగతనాల కేసులు చోటు చేసుకోవడం గమనార్హం. అలాగే వరుసగా చోటుచేసుకున్న ఒంటరి వృద్ధ మహిళల హత్యలు సంచలనం రేపాయి. వలేటివారిపాలెం నలదలపూరు గ్రామానికి చెందిన దామా వెంకట్రావ్ అనే వ్యక్తి తన అప్పులు తీర్చుకునేందుకు ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గుర్రంవారిపాలెంలోని లక్ష్మమ్మ, సింహాద్రినగర్‌లో నారాయణమ్మ అనే ఇద్దరు మహిళలను మూడు నెలల వ్యవధిలో హత్య చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. ఈ హత్యలు సంచలనం అయ్యాయి. అదేవిధంగా పట్టణంలో గుట్కా విక్రయదారులు, మట్కా ఆడేవారు అధికమయ్యారు.



లక్ష్మమ్మ మృతదేహం

ముస్లింలపై దాడులు తగవు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ముస్లింలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని వైకాపా పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం లాలాచెరువులో మహమ్మద్‌షారుఖ్ అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురికావడం దారుణమన్నారు. పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రతులను దగ్ధం చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇజాజ్‌అహ్మద్, సుల్తాన్, యాసిన్, సుల్తాన్‌మోహిద్దీన్, హుస్సేన్‌బాషా, భిక్షు, ఖాదర్‌బాషా, షాకీర్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.



పోకూరులో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జయరావు

ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పరిశీలన

పోకూరు(వలేటివారిపాలెం), న్యూస్‌టుడే: మండలంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన గృహాల నిర్మాణాలను ఆ శాఖ డీఈ జయరావు శనివారం పరిశీలించారు. మండలంలోని నేకునాంపురం, కాకుటూరు, పోకూరు తదితర గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు చేస్తామన్నారు. 2016-2017, 2017-18లో మంజూరైన గృహ లబ్ధిదారులందరికీ గ్రౌండింగ్ చేశామని చెప్పారు. ఆయన వెంట ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు, వర్కింగ్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఓబుల్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం పట్టణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై ఏడాది గడుస్తున్నా నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులపై నిర్లక్ష్య వైఖరి వీడకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకట రమణయ్య, రాజశేఖర్, షేక్ షరీఫ్, వెంగళనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరం వేడుకల్లో విద్యార్థులు



కేకుల కొనుగోలుకు దుకాణం వద్దకు వచ్చిన చిన్నారులు

సందడిగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను శనివారం నిర్వహించారు. ఆ పాఠశాలలో విద్యార్థులు నూతన వస్త్రాలను ధరించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కేక్ కోసి పంచి పెట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ షబ్బీర్, ఏజీఎం వేణుగోపాల్, డీన్ ఆర్.ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగసముద్రంలో...

లింగసముద్రం, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సర ముందస్తు వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు కేక్ కోసి ముందుస్తుగా సంబరాలను నిర్వహించుకున్నారు. అనంతరం మిఠాయిలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు మిఠాయి దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.



అవగాహన కల్పిస్తున్న సంస్థ సిబ్బంది

పరిశుభ్రతపై కిశోర బాలికలకు అవగాహన

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలల్లో ఉన్న కిశోర బాలికలకు కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు పరిశుభ్రత, పరిసరాలపై అవగాహన, బాల్యవివాహాల నిర్మూలన అనే అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. మండలంలోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమ, సూపర్‌వైజర్లు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణకు రైతులు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటూరులో రైతులకు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులకు కందుకూరు వ్యవసాయ డివిజన్ నుంచి 24 మందిని ప్రత్యేక బస్సులో శనివారం పంపించారు. ఏడీఏ నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బస్సును జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, ఎంపీపీ అనూరాధ జెండా ఊపి ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమం ఆదివారం నుంచి జనవరి 8వ తేదీ వరకు ఉంటుందని, సుభాష్‌పాలేకర్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్‌రహీం, పాలూరు సర్పంచి జి.వెంకారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు

రేపు భీంకోరేగావ్ విజయోత్సవ ర్యాలీ

పోకూరు(వలేటివారిపాలెం), న్యూస్‌టుడే: భీంకోరేగావ్ విజయోత్సవ ర్యాలీకి సంబంధించిన ప్రచార పత్రాన్ని పోకూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద జైభీమ్ సేన కార్యకర్త దయాకర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం రెండు గంటలకు కందుకూరులో భీంకోరేగావ్ విజయోత్సవ ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కల్యాణ్, మనోజ్, రాకేష్, సింగయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు పళ్లేలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

భోజన పళ్లేలు, గ్లాసుల పంపిణీ

చాగొల్లు(ఉలవపాడు), న్యూస్‌టుడే: చాగొల్లు ఇందిరానగర్ కాలనీలో విద్యార్థులకు అవిశా వెంకట రమణయ్య, శ్రీనివాసులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భోజన పళ్లేలు, గ్లాసులు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు బాలకోటయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెదపవనిలో భూ వివాదం

పెదపవని(లింగసముద్రం), న్యూస్‌టుడే: కాలువ పోరంబోకు భూమిని కొందరు ఎస్సీలు సాగు చేసుకునేందుకు వెళ్లగా ఓ వ్యక్తి ఆ భూమి తన పేరు మీద రిజిస్టర్ అయిందని అడ్డుకున్న సంఘటన పెదపవని గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వీఆర్వో గిరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సర్వే నెంబరు 389లోని 17.84 ఎకరాలు రెవెన్యూ దస్త్రాల్లో కాలువ పోరంబోకు భూమిగా నమోదైంది. అయితే అదే భూమిని గ్రామానికి చెందిన పట్టాభి రామ్మూర్తి అనే వ్యక్తి పేరుతో రిజిస్టర్ అయినట్లు పత్రాలు ఉన్నాయన్నారు. విషయంపై గొడవ నెలకొంది. సమాచారం అందుకున్న గుడ్లూరు ఎస్సై వేమన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తహసీల్దార్ వచ్చి భూమి ఎవరిదని నిర్ధరించే వరకు అందులోకి ఎవరూ ప్రవేశించరాదని, గొడవలు పెట్టుకోవద్దని ఎస్సై వారికి సూచించినట్లు వీఆర్వో తెలిపారు.

గడ్డి కాల్చి వేశారని ఫిర్యాదు

పెదపవని(గుడ్లూరు), న్యూస్‌టుడే: తన పొలంలోకి ఆర్.మాలకొండయ్య అనే వ్యక్తి ప్రవేశించి అందులోని గడ్డి కాల్చి వేశారంటూ పెదపవని గ్రామానికి చెందిన జి.పట్టాభి రామారావు గుడ్లూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై వేమన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాభిరామారావుకు చెందిన సర్వే నంబరు 389లో ఎ17-86 సెంట్ల పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన మాలకొండయ్య పొలంలోకి ప్రవేశించి గడ్డిని తగులబెట్టారంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

తెరపై ఈనాడు

రాజ్.. 2 కంట్రీస్, **యువరాజ్;** ఆక్సిజన్, **కోటేశ్వర;** ఒక్క క్షణం, **ప్రశాంతి;** ప్రాజెక్టు జడ్, **రాఘవ మల్టీఫెక్స్ 1..** ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి), **2;** హలో

గ్యాస్ సమాచారం

కందుకూరు: స్థానిక లక్ష్మీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 30వ తేదీ వరకు నమోదు చేసుకున్న పట్టణంలోని వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల ధరలు

కందుకూరు: స్థానిక రైతుబజారులో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి...
టమోటా రూ.10, కాకర రూ.16, వంకాయలు రూ.14, బెండకాయలు రూ.22, కాకరకాయలు రూ.16, పచ్చిమిర్చి రూ.18, బీరకాయలు రూ.35, బీన్స్ రూ.40, క్యారెట్ రూ.65, దొండకాయలు రూ.22, కాలీప్లవర్ రూ.30, క్యాబేజి రూ.50, ఉర్లగడ్డలు రూ.16, చామగడ్డలు రూ.34, దోసకాయలు రూ.15, మునగకాయలు రూ.70, సొరకాయ రూ.10, కీర దోసకాయ రూ.15, ఆకుకూర కట్ట రూ.05

కోలాహలంగా కేజీబీవీ క్రీడా పోటీలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు జీసీడీవో హేమలత పేర్కొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల డివిజన్ స్థాయి ఆటల పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. తొలుత జాతీయ, క్రీడా, కేజీబీవీ జెండాలను జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, ప్రకాశం కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ప్రతిభా కళాశాలల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. విద్యార్థులు క్రీడా వందనం చేశారు. కార్యక్రమంలో టీఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.నాగేశ్వరరావు, ఫిజికల్ లిటరసీ కోఆర్డినేటర్ ఎస్టీ.ప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, నాయకులు ఉన్నం వీరాస్వామి, పీడీలు వెంకటరావు, చిరంజీవిరెడ్డి, సుబ్బారావు, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, హాజీరాబేగం, సుబ్రహ్మణ్యం, మాల్యాద్రి, వేణు, విజయదుర్గ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మార్చ్‌పాస్ట్ చేస్తున్న క్రీడాకారిణులు


కబడ్డీలో తలపడుతున్న కనిగిరి- వెలిగండ్ల బాలికల జట్లు


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కంచర్ల, వెంకటేశ్వర్లు తదితరులు


దుస్తులు పంపిణీ చేస్తున్న ఏవో ఆమిర్‌బాషా, అల్లం వెంకటేశ్వర్లు

ఏకరూప దుస్తుల పంపిణీ

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోవూరు రహదారిలోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఓగూరుకు చెందిన అల్లం వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఉచితంగా వీటిని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి ఆమిర్‌బాషా పాల్గొని దుస్తులను పంపిణీ చేశారు. మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అజిత్ చౌదరి, వెంకట ప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి ఉపవాస దీక్షలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ జనవరి ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో ఉపవాస దీక్షలు చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉచ్చులూరి సుబ్బారావు తెలిపారు. ఆ సంఘం స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదులో మంద కృష్ణ మాదిగ చేస్తున్న దీక్షలకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ కార్యాలయం ఎదుట ఉపవాస దీక్షలు గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో చేపట్టాలని సూచించారు. ఎంఈఎఫ్ నాయకుడు భిక్షాలు మాట్లాడుతూ.. వెంటనే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు తలారి సురేష్, ఉచ్చులూరి నిరంజన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం జనవరి 2 నుంచి నిర్వహించనున్న 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో జి.హనుమంతరావు సూచించారు. స్థానిక కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటుచేసిన మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జన్మభూమిలో ఒక్కరోజు ఒక పంచాయతీలో నిర్వహించే వాళ్లని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో 10రోజులు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. రోజుకు ఒక అంశంపై సభలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతిరోజు ముఖ్యమంత్రి సందేశం చూపించేలా టీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ జి.అనూరాధ, జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, తహసీల్దార్ నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, జన్మభూమి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ 2018 సంవత్సర డైరీ, క్యాలెండర్లను స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడ తలారి సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిలర్ డి.బిక్షాలు, మాజీ కౌన్సిలర్ సుధీర్ సుకుమార్, కె.వెంకటేశ్వర్లు, మండల శాఖ గౌరవాధ్యక్షుడు జీవీ.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మునీర్‌బాషా, మండల శాఖ బాధ్యులు హబీబ్, కేవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఒంగోలులోని ప్రకాశం వైద్యశాల పీఆర్వో గోపీచంద్ తెలిపారు. ఈ శిబిరంలో కాలేయం, జీర్ణ కోశ వ్యాధి నిపుణులు, ఎముకలు, కీళ్ల శస్త్రచికిత్స నిపుణులు, జనరల్, లోపరోస్కిపిక్ సర్జన్ నిపుణులు కె.విష్ణువర్ధన్, బి.రాహుల్, బందా రాకేష్‌లు పాల్గొంటారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట నష్టం పరిశీలన

పెదపవని(లింగసముద్రం), న్యూస్‌టుడే: పెదపవని పంచాయతీ పరిధిలో సాగు చేసిన మినుము పంటను సర్పంచి నాయబ్‌రసూల్‌తో కలిసి వీఆర్వో గిరి శనివారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను గురించి రైతులను అడిగి తెలుసుకుని నమోదు చేశారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వివరాలు అందజేయాలని రైతులను వీఆర్వో కోరారు.

'వాగ్దానాల అమలులో ప్రభుత్వం విఫలం'

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని వక్తలు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో గుడ్లూరులో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రాంతీయ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావంతో డివిజన్‌లోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆదుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయాలన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూసేందుకు రాళ్లపాడు జలాశయంలో నీటిని ఎక్కువ మొత్తంలో నిల్వ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వక పోవడం దారుణమని, ఎన్నికల వాగ్దానాలను పక్కకు పెట్టి ప్రజలను మోసం చేస్తోందదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎం.జాలయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కుమార్

రైతులకు తైవాన్ స్ప్రేయర్ల అందజేత

లింగసముద్రం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతుల కోసం రాయితీపై పలు పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఏవో బి.రవి కుమార్ సూచించారు. యాభై శాతం రాయితీపై రైతులకు తైవాన్ స్ప్రేయర్లను స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రాయితీపై విత్తనాలతో పాటు అనేక వ్యవసాయ పరికరాలను ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు లోమడ ప్రసాద్, ఎంపీఈవో బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కనిగిరి

వెలిగొండను త్వరగా పూర్తి చేయాలి

పెద్దారవీడు: మంత్రి సోమిరెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కలిసి వెలుగొండను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కరవు ప్రాంతం అయిన పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెలుగొండను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నీటి పారుదల శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని తలకొండపాడు ఎస్సీ కాలనీలో కుటుంబ తగాదా నేపథ్యంలో ఇరువర్గాలు దాడులు చేసుకున్న సంఘటనలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సురేష్, ఇజ్రాయెల్‌లను ఎస్‌ఐ రామకృష్ణ అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు.


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

విస్తృతంగా సీపీఎం ఇంటింటి ప్రచారం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో వలసలను నివారించే దిశగా ప్రభుత్వ పథకాలు ఫలితాలను ఇవ్వడం లేదని సీపీఎం ప్రాంతీయ మండల కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు విమర్శించారు. మండలంలోని హనుమంతునిపాడు, వేములపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనిగిరిలో జనవరి 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. దళితుల సమస్యలపై జిల్లా మహాసభలో చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాలకొండయ్య, భాగ్యలక్ష్మి, రాము, వైఆర్.మూర్తి, దేవరాజ్, ఏబు తదితరులు పాల్గొన్నారు.

గణితం అర్థమయ్యేలా బోధించాలి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గణితాన్ని సులభతరంగా బోధించాలని సి.ఎస్.పురం ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి సముదాయ అధ్యక్షుడు కె.బాలచంద్రయ్య తెలిపారు. సి.ఎస్.పురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సి.ఎస్.పురం, పామూరు, పీసీపల్లి మండలాలకు సంబంధించి ప్రాథమికోన్నత స్థాయి గణిత సముదాయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టి ఇష్టాన్ని పెంచాలని చెప్పారు. సముదాయ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాదిరి పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో సీఆర్పీ వి.సతీష్ కుమార్, మూడు మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేలం పాటను నిర్వహిస్తున్న అధికారులు

భైరవకోనకు పెరిగిన వేలం ఆదాయం

సి.ఎస్‌పురం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం అయిన భైరవకోనలో శనివారం వేలం పాటలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌ఛార్జి ఇన్స్‌పెక్టర్ జి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వి.నారాయణరెడ్డి వేలం ప్రక్రియను చేపట్టారు. దుకాణాల నిర్వహణ, వాహన నిలుపుదల, కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు విక్రయ హక్కు, ఫ్యాన్సీ ఐటమ్స్ అమ్ముకును హక్కు, మిఠాయిలు, లడ్డు, ప్రసాదాలు అమ్ముకొను హక్కులకు వేలం నిర్వహించగా రూ.14,50,000 ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఇదే వేలంపాటల ద్వారా గత ఏడాది 11,88,000 ఆదాయం రాగా గత ఏడాది కంటే ఈ ఏడాది కంటే రూ.2,62,000 ఆదాయం పెరిగింది. కార్యక్రమంలో భైరవకోన పాలక మండలి అధ్యక్షుడు ఎం.వి.నరసరాజు, పాలక మండలి సభ్యులు ఎస్.నారాయణరాజు, జి.రామచంద్రారెడ్డి, పి.తిరుపాలు, పి.తిరుపతయ్య, వేలం పాటదారులు పాల్గొన్నారు.

కాలచక్రంలో కనిగిరి...

• ఇటు వేగంగా అభివృద్ధి • అటు పెరిగిన నేర ప్రవృత్తి
• 2017లో మెరుపులు.. మరకలు

కనిగిరి, న్యూస్‌టుడే

మరో కొద్ది గంటల్లో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టనున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా గత ఏడాది కాలంలో ఎన్నో ఉదంతాలు చోటుచేసుకున్నాయి. వీటిలో మంచి, చెడు సంఘటనలూ ఉన్నాయి. మొత్తం మీద వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. రైతులకు 2017 చేదు జ్ఞాపకాలను మిగల్చగా, కొంత అభివృద్ధితో పాటు, మరికొన్ని ముఖ్యమైన సంఘటనలు ఈ ఏడాదిలోనే చోటుచేసుకున్నాయి. అదే సందర్భంలో నేర ఉదంతాలూ సంభవించాయి. కనిగిరి అంటేనే వలసలు.. కరవు కాటకాలు.. ఫ్లోరైడ్‌కు నెలవు. పొట్ట కూటి కోసం, బతుకు దెరువు కోసం, ఉద్యోగాల కోసం ఎందరో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి.

- కనిగిరి సామాజిక వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది. పేద రోగులకు ఆసరాగా ఉండేలా కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో 50 అదనపు పడకలు, పామూరులో నూతనంగా కమ్యూనిటీ వైద్యశాల నిర్మాణం.
- నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ పట్టింది. గతంలో వాహనాల్లో కనిగిరి నుంచి పామూరు వెళ్లాన్నా, కనిగిరి నుంచి సీఎస్‌పురం వెళ్లాలన్నా రెండు గంటలకు పైగా ప్రయాణం పట్టేది. అయితే రూ.70 కోట్ల వ్యయంతో కనిగిరి నుంచి సీఎస్‌పురం వరకు.. సీఎస్‌పురం నుంచి పామూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో పరిస్థితి మారింది.
- నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంతో కనిగిరి రూపురేఖలు మారనున్నాయని ఈ ప్రాంత వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇన్ని రోజులు స్తబ్ధుగా ఉన్న కేంద్రం ఒక్కసారిగా నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.
- అగ్రికల్చర్, హార్టీకల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలు నియోజకవర్గంలో ఏర్పడ్డాయి. శీలంవారిపల్లిలో అగ్రికల్చర్, హార్టీకల్చర్ కళాశాలలు మంజూరవగా.. కనిగిరి, పామూరులలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరయ్యాయి.
- రూ. 3 కోట్లతో సీఎస్‌పురం చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభమయ్యాయి. పాలేటిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి రూ18 కోట్లు, చెరువుల మరమ్మతుల కోసం రూ.53 కోట్లు వెచ్చించారు. కనిగిరిలో స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి.
- ఫిబ్రవరి 5న వేములపాడు ఘాట్ రోడ్డులో మహిళను కొందరు హత్య చేశారు. గుంటూరుకు చెందిన మహిళను ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వ్యక్తి హతమార్చినట్లు పోలీసులు తేల్చారు.
- పీసీపల్లి మండలం పెదఇర్లపాడులో చిన్నారి షియోనిని పాత నేరగాడు రాపూరి పేరయ్య చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం యత్నం చేసి వంటిపై ఉన్న నగలు తీసుకుని పారిపోయాడు. ఇతన్ని పోలీసులు పట్టుకుని కటకటాల వెనక్కి పంపారు.
- కనిగిరి పట్టణం శివనగర్ కాలనీకి చెందిన యువతిపై కార్తీక్, సాయి, పవన్‌లు అనే ముగ్గురు యువకులు అత్యాచార యత్నం చేశారు. ఈ దృశ్యాలను సామాజిక మాధ్యమంలో ఉంచారు. ఈ ఉదంతం రాష్ట్రంలోనే సంచలనం రేపింది.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు


శివనగర్ కాలనీ యువతిని పరామర్శించడానికి వచ్చిన ఎస్పీ సత్యఏసుబాబు, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని


నడికుడి రైల్వేలైన్ నిర్మాణ భూముల చిత్రపటాన్ని పరిశీలిస్తున్న జేసీ


సంచలనం రేపిన చిన్నారి షియోని కుమారి హత్యోదంతం

సందడిగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు


హెచ్‌ఎంపాడు ప్రాథమిక పాఠశాలలో కేక్ కోస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని హనుమంతునిపాడు ప్రాథమిక పాఠశాలలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ శనివారం ముందస్తు వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.శేషయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కోసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ ఆర్నూరి కేశవరావు, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, మాచర్ల కేశవరావు, మర్రి మోషే, సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని హనీ కాన్సెప్ట్ స్కూల్లో నూతన సంవత్సరం వేడుకలను శనివారం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, పాఠశాల యాజమాన్యం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. 2018 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ముక్కు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కనిగరి: నృత్యం చేస్తున్న బాలికలు

అజరామరం.. ఘంటసాల గానం

కనిగిరి, న్యూస్‌టుడే: అమర గాయకుడు ఘంటసాల అని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘంటసాల స్వరాలయం ఆధ్వర్యంలో ఆయన జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ.. ఘంటసాల గాత్రం అజరామరం అన్నారు. ఆయన పాడిన పాటలు నేటికి ప్రతి తెలుగువారి ఇండ్లలో ఉంటాయన్నారు. సంగీతం ఉన్నన్ని రోజులు ఆయన తెలుగు వారి గుండెల్లో పదిలంగా ఉంటారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ షేక్ చినమస్తాన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగుటూరి గోవిందరావు, న్యాయవాది షేక్ గఫార్, ఘంటసాల స్వరాలయం అధ్యక్షుడు షేక్ కరిముల్లా, డా. గురుబ్రహ్మం, కోఆప్షన్ సభ్యుడు షేక్ బుజ్జా, నాగేశ్వరరావు, బషీర్, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన గీతాలు అకట్టుకున్నాయి.


ఘంటసాల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి కాశిరెడ్డి, ఛైర్మన్ చినమస్తాన్

కూరగాయల ధరలు

టమాటా-10, మిర్చి-20, దొండ-30, బెండ-30, బంగాళదుంప-25, దోస-10, వంగ-25, క్యారెట్-45, గోరుచిక్కుడు-30, కాకర-60, చిక్కుళ్లు-60, చామదుంప-25

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పామూరు, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మండల బాధ్యుడు కదిరి పార్థసారథి, ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల కోసం శనివారం దరఖాస్తులను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు హరిబాబు, దేవరపు మాల్యాద్రి, తొలుసూరి రమేష్, తుమ్మా ఆంజనేయరెడ్డి, ముబీనామౌలాలి, ఆర్‌ఆర్ రఫి, గంగరాజు యాదవ్, గువ్వల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల, న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభల ప్రణాళికను శనివారం ఎంపీడీవో యజ్ఞేశ్వరరావు తెలిపారు. గ్రామసభలు జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు వివరించారు. 2న పందువ నాగులవరం, గుడిపాటిపల్లి, 3న జాళ్లపాలెం, 4న రాళ్లపల్లి, వెదుళ్లచెరువు 5న మొగళ్లూరు, 6న మోటుపల్లి, ఇమ్మడిచెరువు 7న రామలింగాపురం, రామగోపాలపురంలో సభలుంటాయన్నారు. 8న హుస్సేన్‌పురం, బల్లవరం, గోకులం, 9న మరపగుంట్ల, నాగిరెడ్డిపల్లి, 10న కొటాలపల్లి, చోడవరం, 11న గన్నవరం, కంకణంపాడు గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్టు వివరించారు.

పామూరు, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న అయిదో విడత జన్మభూమి -మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఎంపీడీవో నాగభూషణరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామసభలకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు మండలంలోని 23 పంచాయతీల్లో నిర్వహించనున్న 'జన్మభూమి- మా ఊరు' గ్రామభలను అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని ఎంపీపీ తోడేటి పెదఅల్లూరయ్య, జడ్పీటీసీ సభ్యుడు ఎం.డేవిడ్ కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమంపై అధికారులతో వారు శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలకు అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సీహెచ్.చెంచురామయ్య, గొర్రెల పెంపకందారుల జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు చల్లా రాఘవులు, తహసీల్దార్ వి.పుల్లారావు, ఎంపీడీవో కె.శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి పి.మునిపార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్తు శాఖల ఏఈఈలు జె.పవన్‌కుమార్, షేక్ మస్తాన్‌వలి, బి.రామకోటి, ప్రభుత్వ వైద్యాధికారి మహబూబ్‌వలి, ఏపీవో జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పామూరు: అర్జీలను స్వీకరిస్తున్న పార్థసారథి, ఎంపీపీ నాగేశ్వరరావు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: జనవరిలో నిర్వహించనున్న జన్మభూమి, పల్స్ పోలియో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో చెన్నయ్య కోరారు. మండలంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా, ఆరోగ్య ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో సాంక్రమిక వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వుండి ఎప్పటికప్పుడు జ్వరాలు సోకిన వారిని గుర్తించి వారికి చికిత్స నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కృష్ణ, చెన్నయ్య, నాగరాజు, పద్మావతి, సుజాత, నారాయణమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనాడు మీతోడు

మీ సమస్య ఏదైనా దాని పరిష్కారానికి మీకు 'ఈనాడు' తోడుగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా మీరు ఎదుర్కొంటున్న సమస్య, మీ పేరు, గ్రామం తెలుపుతూ మాకు ఫోన్ చేయడమే. సంబంధిత అధికారి దృష్టికి మీ ఇబ్బందిని తీసుకెళ్లి ఆయన సమాధానాన్ని పత్రికలో ప్రచురిస్తాం.

కనిగిరి	: 80085 74114
హనుమంతునిపాడు	: 80085 74120
వెలిగండ్ల	: 80089 02891
పామూరు	: 95422 78304

తీరిన తాగునీటి ఇక్కట్లు

స్పందనకు వందనం

వెలిగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని మొగళ్లూరు గ్రామంలోని ప్రధాన రహదారిలో చేతిపంపు పని చేయటం లేదు. దీంతో స్థానికులు వాడుక నీటికి ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని 'ఈనాడు- మీతోడు' దృష్టికి తెచ్చారు. సర్పంచి కోటిరెడ్డి స్పందించి బోరును బాగు చేయించారు. దీంతో నీటి ఇక్కట్లు తీరాయి.

సంక్షేమంలో సాధికార మిత్రలే కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం సురేష్

వెలిగండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన చేయాలని ఏపీఎం సురేష్ కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సాధికార మిత్రలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సాధికార సర్వే ఆధారంగా ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి మహిళల జీవనోపాధులను మెరుగు పరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు శీనువాసులు, వెంకటేశ్వర్లు, నారాయణమ్మ, రాజేశ్వరి, యాసిన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల చోరీపై కేసుల నమోదు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని బోడావులదిన్నె, సి.ఎస్.పురం గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలను ఎత్తుకెళ్లారంటూ రెండు కేసులు నమోదయ్యాయని ఏఎస్సై జేబీఎన్.ప్రసాద్ తెలిపారు. సి.ఎస్.పురం గ్రామానికి చెందిన ఎలికా శ్రీనివాసులుకు చెందిన 8 గొర్రెలు, బోడావుదిన్నె గ్రామానికి చెందిన లాకా కొండలరావుకు చెందిన మూడు గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారంటూ ఫిర్యాదులు అందాయని, ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తెరపై ఈనాడు

కనిగిరి: సుదర్శన్- హాలో, శ్రీనివాస- ఎంసీఎ(మిడిల్ క్లాస్ అబ్బాయి), **పామూరు:** **శేషమహల్:** ఎంసీఎ(మిడిల్‌క్లాస్ అబ్బాయి), **కేబీ సినీమ్యాక్స్:** 2 కంట్రీస్

కస్తూర్బా బాలికలకు లింగ వివక్షపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో సిబ్బంది

సి.ఎస్‌పురం, న్యూస్‌టుడే: సిఎస్.పురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు కనిగిరి కలాం డీఎడ్ కళాశాల విద్యార్థినులు లింగ వివక్షపై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థినులకు లింగ వివక్షత, బాల్య వివాహాలు, కౌమారదశ, పోషణ సౌందర్యం, ప్రేమ- ఆకర్షణ మధ్య తేడా వంటి అంశాలపై వివరించారు. కౌమార దశలో బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డీఎడ్ విద్యార్థినులు డి.ప్రత్యూష, కె.చంద్రకళ, పి.శైలజ, డి.అనిత, ఎ.వి.శారద శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారిణి ఎస్డీ.హసీనాబేగం, వెలిగండ్ల ఐసీడీఎస్ పర్యవేక్షకులు షేక్ షకీలాబేగం, ఉపాధ్యాయనులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు, ఆరోగ్యంపై మండలంలోని హనుమంతునిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కిశోర బాలికలకు వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి లక్ష్మీప్రసన్న శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థినులకు కౌమారదశ, బాల్య వివాహాలు, లింగ వివక్ష, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. 18 సంవత్సరాలు నిండనిదే వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వివాహాలు ఎక్కడైనా జరిగితే ఐసీడీఎస్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఎస్.సుజాత, సూపర్‌వైజర్ రేణుక, పాఠశాల ఉపాధ్యాయనులు పాలొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం స్థానిక కార్యాలయంలో ఛైర్మన్ షేక్ చినమస్తాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ వీవీ.మనోహరరావు, వార్డు సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, షేక్ జిలానీ, షేక్ దిల్షాద్ బేగం, యర్రబల్లి జార్జి, షేక్ నజీముద్దీన్‌లు మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడటం లేదన్నారు. తీర్మానాల ఆమోదానికే సభలు నిర్వహిస్తున్నట్టు ఉందని విమర్శించారు. నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, కాలువల్లో పూడికతీత పనులు చేయడం లేదని అన్నారు. ఇందుకు ఛైర్మన్ చినమస్తాన్ మాట్లాడుతూ.. అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. నీళ్లు రాని వార్డులకు ట్యాంకరు ద్వారా సరఫరా చేయిస్తానన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చేస్తామని కమిషనర్ కేవీ.పద్మావతి సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ బుజ్జా, పీర్ల మస్తాన్, చింతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ చినమస్తాన్, కమిషనర్ పద్మావతి



పారిశుద్ధ్యంపై ప్రశ్నిస్తున్న వైస్ ఛైర్మన్ మనోహరరావు, వార్డు సభ్యుడు నజీముద్దీన్



మహాసభల గోడపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ మహాసభల గోడపత్రాల విడుదల

కనిగిరి, న్యూస్‌టుడే: పామూరు పట్టణంలో జనవరి 3,4 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ దర్శి చెంచయ్య భవన్‌లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వై.రవీంద్రాబాబు, సీపీఐ నాయకులు గోడపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ కార్మిక, కర్షకులు, ప్రజల పక్షాన నిలచి వారి సమస్యల కోసం నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాసిన్, జిలానీ, సుబ్రహ్మణ్యం, రామారావు, తిరిపాలు, మోహన్, జాపర్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంగళరెడ్డి

ఇనిమెర్లలో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

ఇనిమెర్ల(పామూరు), న్యూస్‌టుడే: మహాత్ముల ఆశయాలను అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వెంగళరెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెర్ల ప్రాథమిక పాఠశాలలో వాసవీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పేద విద్యార్థులు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వాసవీ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణారావు, వాసవీ క్లబ్ సభ్యులు నటుకుల లక్ష్మీచైతన్య, లక్ష్మీ అనసూయ, మంచికంటి ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి

పండుగలను సంతోషంగా నిర్వహించుకోవాలి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పండుగలను అన్ని మతాల వారు కలసి మెలసి జరుపుకోవాలని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, సివిల్ సర్జన్ పద్మజ అన్నారు. సింగరాయకొండ ప్రాథమిక వైద్యశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, సతీష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పృథులగిరిలో విశేష పూజలు

మర్రిపూడి, న్యూస్‌టుడే: పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయం శనివారం భక్తులతో కళకళలాడింది. అర్చకులు స్వామివారిని సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



సహాయ కార్యకర్తను సన్మానిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు

అంగన్‌వాడీ సహాయ కార్యకర్తకు సన్మానం

కొండపి, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ సహాయ కార్యకర్త దుగ్గిరాల కోటమ్మ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాలు దైవకృప, కార్యకర్తలు కలిసి ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు శేషమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న వైద్యాధికారి హరిబాబు

ఆశా కార్యకర్తలకు చీరల పంపిణీ

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పీహెచ్‌సీ పరిధిలోని 63 మంది ఆశా కార్యకర్తలకు చీరలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి హరిబాబు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాల గురించి సమగ్రంగా వివరించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ దయామణి, సూపర్‌వైజర్లు రమణయ్య, రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని చినుకు జాడ

- ఎండుతున్న వరి
- ఖాళీ అవుతున్న కాలవలు, కుంటలు
- పైరును కాపాడుకునేందుకు రైతుల భగీరథ ప్రయత్నాలు



పైరును కాపాడాలంటే రైతులు వందల మీటర్ల దూరం పైపులు పరవాల్సిందే..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

ఈ సంవత్సరం వరి సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పేలా లేవు. వర్షం వస్తుందని ముందుగానే వరి నాటిన రైతులు తాము సాగుచేసిన పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు రైతులు బోర్లు వేసి తమ పొలాన్ని తడుపుకుంటుండగా, కొందరు కిలోమీటర్ల దూరం నీటిని కాలువలకు కొట్టి, పైపుల ద్వారా తరలించి బతికించుకుంటున్నారు. వర్షపు జాడ కానరాక పోవడంతో వరినారు ఎండిపోయి నష్టాలపాలవగా వరిని సాగుచేసిన రైతులకు ఆ కష్టాలు తప్పేలా లేవు. మండలంలోని రైతులు నాలుగో వంతు మాత్రమే సాగుచేసినా వారికి నీటి కష్టాలు పెరిగాయి.

1500 ఎకరాల్లో సాగు

మండలంలో వరిసాగు చేసే భూమి సుమారు 8 వేల ఎకరాలకు పైగా ఉంది. వీటికి 16 చిన్నా పెద్ద చెరువుల ద్వారా నీరందిస్తున్నారు. బంగినపల్లి, ఊళ్లపాలెం, పాకల తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల వరకు సాగు చేసినట్లు రైతులు తెలిపారు. కొందరు రైతులు వర్షపు నీటితో నాట్లు వేయగా మరికొందరు మాత్రం బోరునీటిని తడిపి నాట్లు వేశారు. ఇప్పటికే రెండు నుంచి మూడుతడులు తడిపినా ప్రయోజనం లేదంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చు చేయడంతో నాటిన వరిని వదిలి వేయలేక, అదనపు ఖర్చులు భరించలేక ఆందోళన చెందుతున్నారు.

- బోర్లు లేకున్నా వర్షాలు వస్తాయని వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందక తప్పడం లేదు. నీటి వసతి అందుబాటులో లేని రైతులు వరిని వదలివేయక తప్పడం లేదు. భూగర్భజలం అడుగంటంతో నీరు రాక కొన్ని బోర్లు ఉప్పునీరుగా మారడంతో అటువంటి నీటిని కొట్టినా ఉపయోగం లేదని కొందరు రైతులు నీటిని కొట్టడం మానివేశారు. దీంతో పైరు ఎండిపోతోంది. వర్షాలు వస్తే తప్ప ఆ పైరు పనికిరాదని రైతులు అంటున్నారు.
- ఊళ్లపాలెం, బింగినపల్లి తదితర గ్రామాల్లోని రైతులు తమకు అందుబాటులో ఉన్న గుంటలలోని నీటిని ఉపయోగించి పంటను బతికించుకునే యత్నం చేస్తున్నారు. దీంతో పశువులకు, జీవాలకు తాగునీరు అందించే కుంటలు పూర్తిగా ఖాళీ అయ్యాయి. చెరువులలో కొద్దిగా నీరున్నా వాటిని వాడుకోవడానికి లేదని వరిసాగు చేయని రైతులు ఒప్పుకోడం లేదంటున్నారు. శానంపూడి గ్రామరైతులు మన్నేరు చెలమలో ఉన్న నీటిని వాడుకోడానికి జేసీపీతో కాలువ తీస్తున్నారు.



బింగినపల్లి మాగాణి భూములలో ఎండుతున్న వరి పైరు



ఊళ్లపాలెంలో కుంటలోని నీటిని పూర్తిగా కొట్టిన రైతులు

బోర్లలో ఉప్పు నీరు



వర్షాలు వస్తాయని వరిని సాగుచేశాం. వర్షాలు ముఖం చాటేయడంతో బోరు నీరు తప్పడం లేదు. భూమిలో నీరు లేక బోర్లు ఎండిపోతున్నాయి. నేను రెండు బోర్లు ఏర్పాటు చేశాను. దానికే రూ.7 వేల వరకు ఖర్చుచేశాం. గ్రామంలోని రైతులందరి పరిస్థితి ఆలాగే ఉంది. బోర్లు వేసినా గతంలో మంచినీరు వచ్చిన చోట ఉప్పునీరు వస్తున్నాయి. దీంతో సాగు చేయడం కష్టంగా మారుతోంది.

– దాచూరి రాంమూర్తి రైతు

రూ.30 వేలు ఖర్చు చేశాను



నాకున్న రెండు ఎకరాలలో వరి సాగు చేశాను. ఇప్పటికే రూ.30 వేల వరకు ఖర్చయింది. వర్షాలు లేక బోర్లకు సక్రమంగా నీరు రావడం లేదు. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే తిండి గింజలైనా పండుతాయి. – సుబ్బారెడ్డి, రైతు.



మాట్లాడుతున్న క్రాంతికుమార్

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

టంగుటూరు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు, కార్యకర్తలు గ్రామ పంచాయతి, సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు దామరాజు క్రాంతి కుమార్ తెలిపారు. స్థానిక కొండపి రోడ్డులోని వైకాపా కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, మర్రిపూడి మండల అధ్యక్షుడు దుద్దాల మల్లిఖార్జున, జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి పేరయ్య, నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రావు, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

కొండపి, న్యూస్‌టుడే: డిసెంబర్ 31 సందర్భంగా సంబరాలు చేసుకుని మద్యం తాగి వాహనాలు నడిపి కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొనకూడదని ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై సంచరించరాదన్నారు. ఎటువంటి అసాంఘిక, అనధికారిక కార్యక్రమాలు చేపట్టినా క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారన్నారు. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచి తెల్లవారుజామున అయిదు గంటల వరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు.

పొన్నలూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం వేడుకల సమయంలో యువకులు ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.సురేష్ హెచ్చరించారు. వేడుకల్లో ఎలాంటి అపశృతులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్యాలయానికి స్థల పరిశీలన

కొండపి, న్యూస్‌టుడే: పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుల కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే స్వామి శనివారం పరిశీలించారు. పట్టణంలోని బీ.సీ కాలనీ సమీపంలో వాగు పక్కన ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. కొండపిలో కార్యాలయానికి రూ.89.50 లక్షలు, అలాగే టంగుటూరు మండలంలోని ఆలకూరపాడులో పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.27.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలో భవన నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆయన వెంట నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే స్వామి, నాయకులు



పశువులకు పరీక్షలు చేస్తున్న వైద్యుల బృందం

దూడలకు నట్టల నివారణ మందు

పెట్లూరు (కొండపి), న్యూస్‌టుడే: గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 132 దూడలకు నట్టల నివారణ మందు తాగించిన్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించిన్నట్టు ఆయన తెలిపారు. 160 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 2 వేల గొర్రెలకు మిన్నల్లు మందు పంపిణీ చేశారు. కొండపి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిన్నబాలు నాయక్ హాజరై పశు కాపరులకు పలు సలహాలిచ్చారు. ఏఎంసీ డైరెక్టర్ కందిమళ్ల లక్ష్మీనారాయణ, సర్పంచి ఎం.నాగరత్నం, ఏఎంసీ కార్యదర్శి జి.చిన్ననాయక్, పశువైద్యులు డాక్టర్ జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

సింగరాయకొండ: ప్రశాంతి: ఎంసీఏ, **శాంతి:** 2 కంట్రీస్, **ఒంగోలు:** రత్నమహల్– ఒక్క క్షణం, జుమంజి, **గోరంట్ల కాంప్లెక్స్**- ఒక్క క్షణం, మళ్లీ రావా, ప్రాజెక్ట్ జడ్, టైగర్ జిందా హై, జుమంజి, **గోపి**- ఎంసీఏ, **సరోజ్‌మయూరి**- 2 కంట్రీస్, **తులసీరామ్**- ప్రాజెక్ట్ జడ్, **సత్యం**- హలో, **జయరామ్**- రాజా ది గ్రేట్

కొండపి



ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కొండపి, న్యూస్‌టుడే: పరిశ్రమలు స్థాపించి పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో యువకులు ముందుండాలని ఎమ్మెల్యే స్వామి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పరిశ్రమల స్థాపనపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎదగాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. జిల్లాలో వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి పథంలో ముందున్న వారిలో మన ప్రాంతం వారున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆయన సూచించారు. పరిశ్రమలు ప్రారంభించేందుకు అవసరమైన నిధులను బ్యాంకుల ద్వారా సమకూర్చుకునేందుకు ఆ శాఖ వారు అవకాశాలు కల్పిస్తారన్నారు. పరిశ్రమల శాఖ టి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఒక్క ప్రదేశంలో ఏర్పాటు చేసే పరిశ్రమ తక్కువ ఖర్చుతో తయారయ్యే విధంగా మొదట ప్రారంభించి అంచెలంచెలుగా ఎదగాలన్నారు. డిక్కీ జిల్లా కో. ఆర్డినేటర్ వి. భక్తవత్సలం, ఏఎంసీ ఛైర్మన్ జి. రామయ్య, ఎంపీపీ డి. రత్తమ్మ, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ బి.ఎల్ నరసింహారావు, ఏపీఎస్ఎఫ్‌పీ సీనియర్ మేనేజర్ కమలాకర్ రావు, ఐలా రాష్ట్ర కార్యదర్శి సర్వేశ్వర్‌రావు పార్టీ మండల అధ్యక్షుడు బి. యలమందనాయుడు, ఏడీలు జి. కృష్ణ రావు. పి. సాంబయ్య పాల్గొన్నారు.

ముసికి నీరు తెప్పించేలా కృషి

కొండపి, న్యూస్‌టుడే: ముసి ఏటికి నీరు తెప్పించేందుకు ఎమ్మెల్యే స్వామి పట్టు బిగిస్తున్నారని ఏఎంసీ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ అతిథి గృహంలో శనివారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నియోజకవర్గంలో 32 గ్రామాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కలిసి పరిస్థితి వివరించి, వినతిపత్రం ఇచ్చారన్నారు. అందుకు వారు సానుకూలంగా స్పందించిన్నట్లు సమాచారం. ఈ విషయమై జనవరి 2న దర్శిలో జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యమంత్రిని కలిసి నీటి విడుదలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. రైతులు సోమయ్య, సుబ్బరామయ్య, పెద్దబ్బాయి, బ్రహ్మారెడ్డి, ఆర్. వెంకట్రావు, సి. హెచ్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

తెదేపాలో చేరిక

కొండపి, న్యూస్‌టుడే: పంచాయతీలోని ముక్కోడిపాలెంలో అయిదు కుటుంబాల వారు ఎమ్మెల్యే స్వామి సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన కడియం బ్రహ్మయ్య, కె. జయమ్మ, కె. చిన్నబ్రహ్మయ్య, కె. వెంకాయమ్మ, కె. కృష్ణవేణిలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముక్కోడిపాలెం, బీ.సీ కాలనీలకు రూ. 20 లక్షలతో మంచి నీటి పథకం మంజూరు చేయించామని ఎమ్మెల్యే అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ జి. రామయ్య, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి. యలమందనాయుడు, వై. పెదబ్బాయి, జిల్లా ఎస్సీ-ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వై. వెంకటేశ్వర్లు, నాయకులు సోమయ్య, సుబ్బరామయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

సాధికార మిత్రలకు పుస్తకాల పంపిణీ

పొన్నలూరు, న్యూస్‌టుడే: స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ వీరకుమారి మండలంలో సాధికార మిత్రలుగా ఎంపికైన సభ్యులకు మాన్యువల్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. మండల మహిళా సమాఖ్య అధ్వర్యంలో సాధికార మిత్రలకు గత నాలుగు రోజులుగా చేపట్టిన శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేటాయించిన 35 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పుస్తకాల్లో నమోదు చేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. సాధికార మిత్రలు శిక్షణలో ఇచ్చిన సలహాలు, సూచనలను తప్పక పాటించాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని 13720 కుటుంబాలకు 395 సాధికార మిత్రలను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ వీరకుమారి

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా పాఠశాలల్లోని తరగతి గదులను విద్యార్థులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నూతన సంవత్సరానికి ముందు రోజు సెలవు కావడంతో శనివారం చిన్నారులు తమ తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీ వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు పెట్టడం వలన విద్యార్థినుల్లో ముగ్గులు వేయలనే ఉత్సాహం కలుగుతుందని పాఠశాల ప్రతినిధులు ఏసీ కేశవరావు, కె. మాల్యాద్రి అన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సాగర్ జలాలు వచ్చేలా చర్యలు

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండలానికి సాగర్‌జలాలు వచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్లు ఎంపీపీ పోటు పద్మావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కామేపల్లి-ఒంగోలుకు ఆర్టీసీ బస్సులు నిత్యం ఉండేలా చూడాలన్నారు. అనంతరం శాఖలవారీగా సమీక్ష జరిపారు. గ్రామసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు గాలి పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సువర్ణరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్

అన్ని వివరాలు తప్పక అందించాలి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి అధికారి వద్ద గ్రామస్థాయి సమాచారం ఉంచుకోవాలని ఎంపీడీవో జమీవుల్లా అన్నారు. జనవరి 2 నుంచి జరగనున్న 'జన్మభూమి - మా ఊరు' అయిదో విడత కార్యక్రమంపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు వాటికి అయిన ఖర్చులు, ఇతర అభివృద్ధి పనులకు అయిన నిధులు గురించి రికార్డులు తయారు చేయాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తీర్చేలా చర్యలు తీసుకోవాలిన తెదేపా మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య ఎంపీడీవోకు కోరారు. ఆర్థిక సంఘం నిధుల నుంచి అవసరం అయిన చోట్ల బోర్లు ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు సూచించారు. వ్యవసాయశాఖ ఏవో శేషారెడ్డి, పంచాయతీ రాజ్ జేఈ శ్రీహరి, ఇన్‌ఛార్జి ఈవోఆర్డీ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నవకిషోర్ పాల్గొన్నారు.

టంగుటూరు, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి 11 వరకు జరగనున్న గ్రామసభలకు అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధం కావాలని ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం జన్మభూమి గ్రామసభలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత జన్మభూమిలో వచ్చిన అర్జీలను ఎన్ని పరిష్కరించాం, పరిష్కరించని అర్జీలు ఎన్ని, వాటికి కారణాలు తెలియజేయాలన్నారు. తెదేపా హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరాలు తెలియజేయాలన్నారు. ఎంపీడీవో హనుమంతు రావు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న అధ్యాపకులు

యోగాతో ఒత్తిడి దూరం

పొన్నలూరు, న్యూస్‌టుడే: యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని యోగా నిపుణుడు రమణ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం యోగాపై ప్రిన్సిపల్ వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు కొన్ని యోగాసనాలను నేర్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సింగరాయకొండ గ్రామీణం: వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్. హజరత్తయ్య హెచ్చరించారు. మద్యం దుకాణాల వారు ఆదివారం సమయపాలన పాటించాలని సూచించారు. పేకాట, కోడి పందాలు, ఇతర జూదాలు ఆడరాదని అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

గ్యాస్ సమాచారం

కొండపి: సాయిరాం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వారు ఆదివారం మండలంలోని ఏ గ్రామంలో సిలిండర్లు సరఫరా చేయరు.

టంగుటూరు: నిర్మలా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆదివారం కె. బిట్రగుంట, వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతలపాలెం, దావగూడూరు, చిర్రికూరపాడు, పైడిపాడు, నర్శింగోలు, చతుకుపాడు, జరుగుమల్లి, ఆలకూరపాడు, అనంతవరం, వెలగపూడి, రావివారిపాలెం, తాళ్లపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లో సిలిండర్లు పంపిణీ చేస్తారు.

మద్దిపాడు: నివేదిత ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారు ఆదివారం సెలవు కారణంగా ఏ గ్రామాల్లో సిలిండర్లు పంపిణీ చేయటం లేదని నిర్వాహకులు తెలిపారు.

పొన్నలూరు: కందుకూరు లక్ష్మీవెంకటేశ్వర ఇండేన్‌గ్యాస్ కంపెనీవారు ఆదివారం పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని ఏ గ్రామంలోను సిలిండర్లు సరఫరా చేయరు.

చట్టాలపై అవగాహన అవసరం

పొన్నలూరు, న్యూస్‌టుడే: చట్టాలన్నిటి గురించి కాకపోయినా సాధారణ చట్టాల గురించైనా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ఎం. ఫణికుమార్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో పొన్నలూరులో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉచితంగా న్యాయ సహాయం, కనీస చట్టాల గురించి అవగాహన, సత్వరం న్యాయం అందించడమే సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రామిసరీ నోటు రాసిచ్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తుల పంపకాల్లో పాటించాల్సిన నిబంధనలు, వీలునామా ఎవరు రాసివ్వవచ్చు, ఎప్పుడు చెల్లుతుంది వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. రాజేంద్ర బాబు, న్యాయవాది బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఫణికుమార్

మార్కాపురం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: 11కేవీ తీగలు మార్చుతున్నందున పట్టణంలోని పలు ప్రాంతాలకు ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ఎస్.బాలకంయ్య తెలిపారు. పూలసుబ్బయ్యకాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, కొండారెడ్డికాలనీ, బాపూజీకాలనీ, విద్యానగర్, ఎస్సీబీసీకాలనీ, చెన్నకేశవనగర్, దొడ్డవారివీధి, ఒంగోలు రహదారి, ఆకాశవాణి ప్రాంతం, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం తదితర ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వెలిగొండను త్వరగా పూర్తి చేయాలి

పెద్దారవీడు: మంత్రి సోమిరెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కలిసి వెలుగొండను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కరవు ప్రాంతం అయిన పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెలుగొండను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నీటిపారుదల శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు విద్యార్థులు

వేములకోట (మార్కాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: తమ విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వేములకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన అభినందన సభలో... నమూనా ప్రదర్శించిన విద్యార్థులు ఎం.యోగి, బి.గోపి (పదో తరగతి), యు.శివశంకర్ (తొమ్మిది), ఎం.దుర్గానాగార్జనరెడ్డి (ఎనిమిది)తో పాటు వీరికి మార్గదర్శనం చేసిన జాతీయ స్థాయి అవార్డు గ్రహీత, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు టి.ఎన్.జగన్నాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వీరు రూపొందించిన కుక్కర్ కండక్షన్ బై కన్వెన్షన్ (తక్కువ కట్టెలతో భోజనం తయారు చేయండి) నమూనా రాష్ట్ర స్థాయి ప్రదన్శనకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి ఎ.శ్యాంశుభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్సీ జాబితాలో చేర్చితేనే రజకులకు న్యాయం'

గోగులదిన్నె (మార్కాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: ఎస్సీ జాబితాలో చేర్చితేనే రజకులకు న్యాయం జరుగుతుందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు చేపడుతున్న ఇంటింటికీ రజక సంఘం కార్యక్రమం శనివారం... గోగులదిన్నె, తర్లుపాడు మండలంలోని గానుగపెంట, పోతలపాడు గ్రామాల్లో నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి తిరుపతయ్య, నాయకులు టి.వి కాశయ్య, కె.వెంకటేశ్వర్లు, సురభి వెంకటేశ్వర్లు, టి.శ్రీను, పి.శివ, చిన్న, చిన్న కాశయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.24 కోట్ల మిగులుతో బడ్జెట్ అంచనాలు

▶ కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై ప్రశ్నించిన కౌన్సిలర్లు





సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రాధిక మల్లికార్జున్, సమస్యలను తెలియజేస్తున్న కౌన్సిలర్ ఇస్మాయిల్

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని పొట్టి శ్రీరాములు సమావేశం మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. రూ.24 కోట్ల మిగులుతో 2017-18 సంవత్సరపు సవరించిన, 2018-19 బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా బడ్జెట్ అంచనాలపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. 4వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మిగులు బడ్జెట్ అంచనాలు రూపొందించడం హర్షణీయమే అయినా పనులు కూడా అదే విధంగా జరగాలన్నారు. కాలువలు, రహదారుల నిర్మాణాల కోసం నిధులు ఎక్కువగా కేటాయించాల్సిందన్నారు. పాఠశాలలకు కేవలం రూ.16.5 లక్షలు మాత్రమే కేటాంచారని... మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో అంచనాలు, జమా, ఖర్చులపై 15వ వార్డు కౌన్సిలర్ కొప్పుల సంధ్యారాణి పలు సందేహాలు వ్యక్తం చేయగా... కమిషనర్ ఫజులుల్లా వాటిని నివృత్తి చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు అభివృద్ధికి సంబంధం ఉండదన్నారు. అవసరం మేరకు సవరించుకుని ప్రాధాన్యతాక్రమంలో అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం 50 అంశాలతో కూడిన అజెండాను కూడా కౌన్సిల్ ఆమోదించింది. కౌన్సిలర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని వార్డుల్లో రహదారికి ఇరువైపులా కాలువలు లేక మురుగు నీరు రోడ్లపైకి చేరి అపరిశుభ్రత నెలకొంటోందన్నారు. 16వ వార్డు పరిధి ఎన్ఎస్ నగర్‌లో రహదారికి ఎంపీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇదే రోడ్డులో ఇటీవల రూ.1.5 లక్షలతో మట్టిని పరవడం నిధులు వృథా కాదా అని ప్రశ్నించారు. చాలా ప్రాంతాల్లో పైప్‌లైను పనులు పూర్తికానందున ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలన్నారు. పట్టణంలో రహదారి ఆక్రమణల తొలగింపులో అధికారులు విఫలమవుతున్నారని... దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. ఈ విషయమై కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ ఆక్రమిత బంకులన్నీ ఆర్అండ్‌బీ స్థలాల్లోనే ఉన్నాయన్నారు. వాటిని ఆ శాఖ వారే తొలగించాల్సి ఉందన్నారు. 15వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి మాట్లాడుతూ పట్టణంలో పందుల సంచారం ఎక్కువగా ఉందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... గతంలోనూ పలుమార్లు సమస్యను ప్రస్తావించినా పట్టించుకోవడంలేదన్నారు. కమిషనర్ సమాధానమిస్తూ... ఇప్పటికే వేలాది పందులను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే తరలిస్తామన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ జవ్వాజి రాజు మాట్లాడుతూ పట్టణంలోని చాలా ప్రాంతాల్లోని గృహాలకు ఇంటి నెంబర్లు కేటాయించలేదన్నారు. దీంతో నీటి కనెక్షన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ చిత్తూరి పెద్దన్న మాట్లాడుతూ 10వ వార్డు నుంచి 15వ వార్డు వరకు హిందూ శ్మశాన వాటిక లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ షేక్ బషీరున్నీసాబేగం మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో చాలా గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వారంతా నీళ్లు పట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో డీఈ షేక్ సుభాని, మేనేజర్ పూసల శ్రీనివాసులు, టీపీవో రామ్మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించేంత వరకు పోరు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తూరి చెంచునారాయణ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలంలో తాగు, వాడుక నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేంతవరకు... ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తెస్తూ పోరాటం కొనసాగిద్దామని అఖిలపక్ష నాయకులు, మేధావులు పేర్కొన్నారు. శనివారం... పొదిలి పించనర్ల భవనంలో సీపీఎం డివిజన్ నాయకులు ఎం.రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిదులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వినియోగదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తూరి చెంచునారాయణ మాట్లాడుతూ గతంలో తాగడానికైనా నీరు దొరికేదన్నారు. ఇప్పుడు తాగడానికి, వాడుక నీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. తరిగిపోతున్న భూగర్భజలాల వల్ల వాడుకనీరు, సాగర్ జలాశయం నుంచి పూర్తిస్థాయిలో నీరందక, పట్టణంలో అక్రమ కుళాయి కనెక్షన్ల కారణంగా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. సీపీఎం నాయకులు ఎం.రమేష్ మాట్లాడుతూ పొదిలిలో నీటి సమస్యపై దశలవారీగా పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలసి నడవాల్సి ఉందన్నారు. ఎంపీపీ కె.నరసింహారావు మాట్లాడుతూ శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి రూ.వంద కోట్ల ప్రాజెక్టు మంజూరు కావాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సైదా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పించనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బాదుల్లా, జి.వి.బ్రహ్మం, గౌరవ అధ్యక్షులు ఎ.వీరారెడ్డి, అఖిలపక్షం నాయకులు ఇ.బి.ప్రభాకర్, ఎస్కే నసరుద్దీన్, ఐజాక్, డి.సుబ్బారావు, ఇ.వెంకట్రావు, ప్రభుదాస్, కె.కృష్ణారెడ్డి, కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి యూనిఫాంలు అందజేస్తున్న దృశ్యం

జన్మభూమి సభల్లో వైద్యసేవలు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: జనవరి రెండో తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న జన్మభూమి గ్రామసభల్లో... వైద్యసిబ్బంది శిబిరాలు నిర్వహించి స్థానికులకు వైద్యసేవలందించాలని డాక్టర్ బాలయ్య సూచించారు. ఈ మేరకు కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. సభల్లో వైద్య సిబ్బంది చేపట్టాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. శిబిరానికి వచ్చేవారిని పరీక్షించడంతో పాటు... అవసరమైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించాలన్నారు. మందులు అందజేయడంతో పాటు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి తగిన సూచనలు చేయాలన్నారు. అనంతరం సిబ్బంది, ఆశ కార్యకర్తలకు యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా.రమేష్‌కుమార్, సీహెచ్‌వో రంగమ్మ, ఎంపీవోలు రంగచారి, బాదరయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, బసవరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని నెహ్రూ బజార్ సాయిబాబా మందిరంలో ఈ నెల 19 నుంచి చేపడుతున్న అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ యజ్ఞం శనివారంతో ఘనంగా ముగిసింది. 12 రోజుల్లో మొత్తం 720 మంది భక్తులు కోటి విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేశారు. పారాయణం ముగింపు సందర్భంగా మందిరంలో శనివారం లక్ష్మీనారాయణ హోమం, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుని సందేశాలను మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు వివరించారు. మధ్యాహ్నం... ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మందిర కోశాధికారి పీఎల్ఎన్‌వీ నాగరాజు, సభ్యులు సాయి సుబ్బారావు, కరీం, పెద్దన్న, కృష్ణప్రసాద్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మందిరంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మార్కాపురం

తెరపై ఈనాడు

మార్కాపురం: జగదీశ్వరి: ఒక్క క్షణం, శ్రీనివాస: ఎంసీఏ, విశ్వేశ్వర: 2 కంట్రీస్, విజయా: ఆక్సిజన్, రాధాకృష్ణ: ప్రోజెక్టు జెడ్, సాయిబాలాజీ: హలో!. **పొదిలి:** శ్రీవెంకటేశ్వర: హలో!, హరికృష్ణ : ఒక్క క్షణం, రాఘవేంద్ర: ఎంసీఏ

ఈసారైనా ఇళ్ల స్థలాలు దక్కేనా...?

● ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న పేదలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పట్టణంలో పేదలు గత ఆరేళ్లుగా ఇళ్ల స్థలాలకు నోచుకోలేదు. ఇప్పటివరకు నాలుగు విడతలుగా జన్మభూమి - మాఊరు గ్రామసభలు జరిగాయి. ఏటా పేదలు తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకుంటున్నా... అవి బుట్టదాఖలవుతూనే ఉన్నాయి. పొదిలి పంచాయతీలో 470 మంది పేదలకు సుమారు ఆరేళ్ల క్రితం రాజుపాలెం సమీపంలో ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. వారికి పొజిషన్ చూపించకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టలేకపోయారు. అధికారులు, ఈ ప్రాంత నాయకులు తగిన చొరవ చూపక పోవడం వల్లే సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ ఏడాది సుమారు 50 మంది దివ్యాంగులకు ఆ ప్రాంతంలో ఇంటిస్థలాలు మంజూరు చేశారు. వారికి మాత్రమే ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. గత ఏడాది నిర్వహించిన జన్మభూమి - మా ఊరు గ్రామసభలో రెవెన్యూకు సంబంధించి 850 అర్జీలు వచ్చాయి. వాటిలో 600కు పైగా ఇంటి స్థలాల కోసం వచ్చినవే. ఏడాది గడచినా ఇప్పటి వరకు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. జనవరి 2 నుంచి మళ్లీ జన్మభూమి గ్రామసభలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి...



గతంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలం ఇదే...

తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

గ్రామసభల షెడ్యూలు ఖరారు..

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలంలో జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి - మాఊరు గ్రామసభల షెడ్యూలును ఖరారు చేసినట్లు ఎంపీడీవో పి.రత్నజ్యోతి తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దారు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం పది గంటలకు ఆయా పంచాయతీల్లో గ్రామసభలు ప్రారంభమవుతాయన్నారు. 2న ఏలూరు, ఉప్పలపాడు; 3న అక్కచెరువు, జువ్వలేరు; 4న ఓబులక్కపల్లి, మాదాలవారిపాలెం; 5న మూగచింతల, కొండాయపాలెం; 6న కంభాలపాడు, నందిపాలెం; 7న ఉదయం పొదిలి పట్టణంలో 5కె రన్... ఆముదాలపల్లి, తుమ్మగుంటలో గ్రామసభలు; 8న ఈగలపాడు, పాములపాడు; 9న కుంచేపల్లి, మల్లవరం; 10న తలమళ్ల, అన్నవరం; 11న సూదనగుంట, పొదిలిలో గ్రామసభలు జరుగుతాయన్నారు. తమ సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చన్నారు. సభ ముందు రోజున పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు.

మార్కాపురంలో...

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కాపురంలో జన్మభూమి గ్రామ సభల షెడ్యూల్‌ను ఎంపీడీవో బి.వి.ఎన్.సాయికుమార్ విడుదల చేశారు. 2న బోడపాడు, ఇడుపూరు; 3న బొందలపాడు, భూపతిపల్లె, కోలభీమునిపాడు; 4న చింతకుంట, గొట్టిపడియ; 5న గోగులదిన్నె, రాయవరం; 6న కొండేపల్లి, రామచంద్రాపురం, నికరంపల్లె, పెద్దనాగులవరం; 8న నాయుడుపల్లె, పెద్దయాచవరం, గజ్జలకొండ; 9న మాల్యవంతునిపాడు, తిప్పాయపాలెం; 10న వేములకోట, జమ్మనపల్లె గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జన్మభూమి కమిటీ సభ్యులతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో పాల్గొనాలని కోరారు.



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

తర్లుపాడు, న్యూస్‌టుడే: తర్లుపాడు వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఫసల్ బీమా పథకంలో చేరేందుకు చివరి రోజు కావడంతో... ప్రీమియం చెల్లింపు, ఎవరి పేరిట డీడీలు తీయాలన్న వివరాలు తెలుసుకునేందుకు ఉదయం 11 గంటలకే పలువురు రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏ ఒక్క సిబ్బందీ కార్యాలయం తాళాలు తీయకపోవడంతో... రైతులు ఆందోళనకు దిగారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. సాయంత్రం వరకు ఎదురు చూసినా ఏ ఒక్క అధికారీ రాకపోవడంతో అంతా నిరాశగా వెనుదిరిగారు. ఇప్పటికే డీడీలు తీసిన రైతులు జనవరి 2లోగా దరఖాస్తులు ఇస్తేనే మీమా కంపెనీకి పంపుతామంటూ సిబ్బంది చెప్పడంతో... కార్యాలయం వద్ద రైతులు పడిగాపులు కాశారు. మరోవైపు పంట నష్టం అంచనాకు బృందాలు ఏర్పాటు చేసినా... కొందరు రైతుల పొలాలను పరిశీలించకపోవడంతో వాటి వివరాలను నమోదు చేయించుకునేందుకు కూడా రైతులు కార్యాలయానికి వచ్చారు. కనీసం... కార్యాలయం తాళం కూడా తీయకపోవడంపై వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనే తరచూ ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు.

నీటి సరఫరా వేళలు

మార్కాపురం: జనవరి 1 సోమవారం ఉదయం 5 గంటలకు జవహర్‌నగర్ కాలనీలోని ట్యాంకు ద్వారా జవహర్‌నగర్ కాలనీ, నానాజాతుల కాలనీ, జగదీశ్వరి థియేటర్; ఒంగోలు రోడ్డులోని ట్యాంకు ద్వారా డ్రైవర్స్ కాలనీ, ఏకలవ్య కాలనీ, రవీంద్రనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉంటుందని మున్సిపల్ డీఈ షేక్ సుభాని తెలిపారు.

గ్యాస్ సమాచారం

మార్కాపురం: స్థానిక సుధాగ్యాస్ ఏజెన్సీలో డిసెంబర్ 21న ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న వినియోగదారులకు మంగళవారం సిలిండర్లు సరఫరా చేస్తారు.

● స్థానిక భారత్, పీఎల్‌పీ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల్లో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న వినియోగదారులకు మరుసటి రోజున సిలిండర్లు అందజేస్తారు.

కొనకనమిట్ల: కొనకనమిట్ల సహజ భారత్ గ్యాస్ ఏజెన్సీలో నేరుగా శనివారం నమోదు చేసుకున్న వినియోగదారులకు సోమవారం సిలిండర్లు పంపిణీ చేస్తారు. ఐవీఆర్ఎస్ ద్వారా నమోదు చేసుకున్న వారికి మరుసటి రోజున పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొదిలి: పొదిలి కరుణ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 24 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. 98488 24365 నెంబరుకు ఫోన్ చేసి గ్యాస్ బుక్ చేసుకోవాలి.

చెన్నకేశవ దర్శనం

మార్కాపురం: స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, నంద్యాల తిరుమలాచార్యులు తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య లక్ష్మీచెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు జరుగుతాయన్నారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారికి సహస్రనామార్చన, 8 గంటలకు పొంగలి, నివేదన, మంగళహారతి అనంతరం సర్వదర్శనం ఉంటుందన్నారు. రాత్రి... సర్వదర్శనం, 8.30 గంటలకు పూజ, నైవేద్యం, మంగళహారతి అనంతరం దేవాలయం తలుపులు మూసివేయనున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న వాసవీ క్లబ్ అధ్యక్షుడు కేశవరావు

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ

కలుజువ్వలపాడు (తర్లుపాడు), న్యూస్‌టుడే: కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు... మార్కాపురం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. క్లబ్ అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో వాసవీ క్లబ్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పదో తరగతి పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పిల్లలంతా బాగా చదివి... మంచి స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ డిప్యూటీ గవర్నర్ నాగరాజు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లెలో వైద్య సేవలు

గొల్లపల్లె (తర్లుపాడు), న్యూస్‌టుడే: గొల్లపల్లెలో మండల వైద్యాధికారి రాహుల్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 57 మంది రోగులతో పాటు మరో నలుగురు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, అన్నామేరి, ఆరోగ్య కార్యకర్త నాని, ఆరోగ్యమిత్ర ఆదినారాయణరెడ్డి, ఆశా కార్యకర్త మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాహుల్

ఈనాడు మీతోడు

మీ సమస్య ఏదైనా దాని పరిష్కారానికి మీకు 'ఈనాడు' తోడుగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా మీరు ఎదుర్కొంటున్న సమస్య, మీ పేరు, గ్రామం తెలుపుతూ మాకు ఫోన్ చేయడమే. సంబంధిత అధికారి దృష్టికి మీ ఇబ్బందిని తీసుకెళ్లి ఆయన సమాధానాన్ని పత్రికలో ప్రచురిస్తాం.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

మార్కాపురం పట్టణం	80085 74122
మార్కాపురం గ్రామీణం	80086 31313
పొదిలి	80085 50360
పొదిలి గ్రామీణం	80085 52682
తర్లుపాడు	80086 32223
కొనకనమిట్ల	91775 05721

కాట్రగుంట (కొనకనమిట్ల), న్యూస్‌టుడే:

సమస్య: కాట్రగుంట పంచాయతీ వెంగళపల్లెలోని కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. మురుగు నిలిచి దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.– రమణయ్య, చినారికట్ల

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపట్టి... సమస్యను పరిష్కరిస్తాం.– నాసరయ్య, సర్పంచి

గొట్లగట్టు (కొనకనమిట్ల), న్యూస్‌టుడే:

సమస్య: గొట్లగట్టులో కాలువలు పూడిపోయి... దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రీనివాసులు, గొట్లగుట్టు

సమాధానం: వ్యర్థాలు తొలగించి సమస్య లేకుండా చూస్తాం.

– నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి



పథకాల అమలులో సాధికార మిత్రలు కీలకం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: వెలుగు ద్వారా నూతనంగా ఎంపికైన సాధికార మిత్రలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాల్సిన అవసరం ఉందని తహసీల్దారు పి.ఉమారాణి, ఎంపీడీవో బి.వి.ఎన్.సాయికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీబీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మండలం నుంచి ఎంపికైన 260 మంది సాధికార మిత్రలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారి విధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధానం, పని తీరు ఎలా ఉండాలన్న అంశాలను వివరించారు. ఏపీఎం పి.రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తహసీల్దారు పి.ఉమారాణి, ఎంపీడీవో బి.వి.ఎన్.సాయికుమార్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ చేరువచేయాలన్నారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోతున్న చంద్రన్న పెళ్లికానుక పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ చంద్రన్న బీమాను వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో గృహనిర్మాణ ఏఈ విజయ్‌బాబు, ఏపీఎం పి.రమేష్, పశువైద్యులు బి.వి.రెడ్డి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.



సాధికార మిత్రలకు కరదీపికలు అందజేస్తున్న తహసీల్దారు ఉమారాణి, ఎంపీడీవో సాయికుమార్

ఒంగోలు

జాతీయ రహదారి భూముల పరిశీలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలుకు తర్పు వైపున నూతనంగా నిర్మించిన బైపాస్‌కు సంబంధించిన పరిహారం పంపిణీ విషయమై తహసీల్దారు చిరంజీవి శనివారం భూములను పరిశీలించారు. కొందరు రైతులు తమకు భూ పరిహారం ఇవ్వలేదంటూ జాతీయ రహదారి అధికారులకు విన్నవించారు. దాంతో తహసీల్దారు చిరంజీవి సదరు భూములను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్వో శ్రీనివాసరావు, రైతులు ఉన్నారు.

పీవీఆర్ పాఠశాల ఆవరణ క్రీడలకే..!

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని పీవీఆర్ పాఠశాల ప్రాంగణాన్ని క్రీడేతర కార్యక్రమాలకు వినియోగించవద్దని కోరుతూ ఒంగోలు యువజన క్రీడా సమాఖ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా- క్రీడేతర కార్యక్రమాలకు ప్రాంగణాన్ని వినియోగించకుండా న్యాయమూర్తి స్టే ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఆ మేరకు నగరపాలక సంస్థకు ఉత్తర్వులు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.



ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షిస్తున్న న్యాయమూర్తి వెంకటాద్రి

జిల్లా జైలు తనిఖీ

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల నిర్దేశం మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజావెంకటాద్రి శనివారం జిల్లా జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మట్లాడి వారి సమస్యలు ఆలకించారు. ఆహార పదార్థాల నాణ్యత సక్రమంగా ఉండటం లేదని వారు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తి తనిఖీ చేసి కారాగారంలో కొన్ని లోపాలు గుర్తించారు. వాటిపై జిల్లా జడ్జికి నివేదిక సమర్పిస్తానన్నారు. నేరాలు చేసే ముందు ఒకసారి కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలని, జైలులో ఉండటం వల్ల మీపై ఆధారపడిన వారు వీధులపాలవుతారని ఖైదీలకు ఉద్బోధించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత పరివర్తనతో మంచి జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో జైలర్ పి.ఎస్.రామచంద్రరావు, న్యాయవాది డి.రాజేంద్రప్రసాద్, పారా లీగల్ వలంటీరు బి.వి.సాగర్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత క్రమ శిక్షణతోనే యువతకు భవిత

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసలు కాకుండా యువత క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కార్యక్రమ అధికారి టి.రంగారావు అన్నారు. శనివారం డాన్‌బాస్కో పాఠశాలలో ఆర్మీ నియామకం కోసం శిక్షణ పొందుతున్న యువకులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. హెచ్ఐవీ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి.. ఇతరులకు జాగ్రత్తలు తెలపాలన్నారు. గ్రో టీఐ సంస్థ ప్రాజెక్టు మేనేజరు జ్యోత్స్నాదేవి హెచ్ఐవీ బాధితులు, ఏఆర్‌టీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఆర్మీ శిక్షణ తీసుకున్నవారు భవిష్యత్తులో దేశాన్ని కాపాడుతూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజరు మీరావలి, ఎస్.కె.కమురుద్దీన్, డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. గరుడ వాహన సేవ

ఒంగోలు సాంస్కృతిక విభాగం, న్యూస్‌టుడే: వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కేశవస్వామిపేట చెన్నకేశవాలయంలో గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. శ్రీనివాసుడు ఆభరణ భూషితుడై తనకు అత్యంత ఇష్టమైన గరుత్మంత వాహనంపై రావడాన్ని తిలకించి భక్తులు ఆనంద పరవశులయ్యారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు, వ్యాపారవేత్త శిద్దా వెంకటేశ్వరరావు స్వామి సేవలో పాల్గొన్నారు.



గరుడ వాహన సేవలో పాల్గొన్న మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు

ముగిసిన పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శనివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి మొత్తం 17 విభాగాల్లో 1350 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. చివరి రోజు ఆటల పోటీలతో పాటు అథ్లెటిక్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతోపాటు ఓవరాల్ ఛాంపియన్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. సాంకేతిక విద్యాశాఖ తిరుపతి ఆర్జేడీ బి.సూర్యుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో చురుగ్గా ఉన్న విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు తమ కళాశాలకు అనుమతి ఇచ్చినందుకు సాంకేతిక విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ-సెట్‌లో 0.5 శాతం రిజర్వేషన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్‌బేగ్, పేస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు అనిల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా, బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కృష్ణా జిల్లా, బాలుర విభాగంలో ఓవరాల్ ఆటల పోటీల ఛాంపియన్‌షిప్‌ను కర్నూలు జిల్లా, బాలికల విభాగం ఓవరాల్ ఆటల పోటీల ఛాంపియన్‌షిప్‌ను గుంటూరు జిల్లా కైవసం చేసుకున్నాయి.



బాలుర విభాగంలో ఓవరాల్ ఆటలపోటీల ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న కర్నూలు జిల్లా క్రీడాకారులు



బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న కృష్ణా జట్టు

నేడు 'ఉండమ్మా బొట్టు పెడతా'

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒన్‌గోల్ - స్వచ్ఛ ఒంగోల్ కోసం ఆదివారం నగరంలో వినూత్న ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ నగరంలోని 50 డివిజన్లలో 'ఉండమ్మా బొట్టుపెడతా' కార్యక్రమం జరుగుతుందన్నారు. నోడల్ అధికారులంతా వారి డివిజన్లలోని గృహాలను సందర్శించి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు పెట్టి స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి వివరిస్తారన్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. నోడల్ అధికారులు మహిళా స్వయం సేవక్ సంఘాలు, స్వచ్ఛ సైనికులు, బ్రాండ్ అంబాసిడర్ల సహకారంతో కనీసం 10 మంది మహిళలను వెంట తీసుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

అతిచేస్తే చర్యలు తప్పవు: డీఎస్పీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శృతి మించి ప్రవర్తించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఒంగోలు నగర డీఎస్పీ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం నగరంలోని పోలీసు అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. అనంతరం సమావేశ వివరాలతో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీ రాత్రి ఒంగోలు నగరంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పలు ప్రధాన కూడళ్లలో పికెట్లు ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షించనున్నట్లు వివరించారు. ముగ్గురు సీఐలు, 12మంది ఎస్.ఐలతో పాటు ఏడు బ్లూ కోట్స్, మూడు రక్షక్‌లతో పహారా కాస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, పరిచయం లేని వ్యక్తులను ఇబ్బంది పెట్టినా, అమ్మాయిలకు శుభాకాంక్షలు చెప్పే పేరిట ఇబ్బందులకు గురిచేసినా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బార్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకూ మాత్రమే నిర్వహించాలన్నారు. దుకాణాల వద్ద ఏదైనా ఘర్షణలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

● నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని ఉపేక్షించబోమనీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు.

నగరంలో సంక్రాంతి ఆటల పోటీలు

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా నగరంలో విస్తృతంగా ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఐద్వా నగర కార్యదర్శి కె.రమాదేవి తెలిపారు. శనివారం ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ, డైఫీ, ఐద్వా ఆధ్వర్యంలో ఏటా నగరంలోని అన్ని కాలనీల్లోని ప్రధాన కూడళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సహకరించి.. ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కె.ఎఫ్.బాబు, కె.చిన్నపరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ సాహిత్య సంకలనానికి తోడ్పాటు

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీనాథ కవి సార్వభౌముని స్థానం శాశ్వతమని గజల్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీనాథుని పేరిట సాహిత్య పీఠం ఏర్పాటు చేసిన ఎం.వి.సుబ్బయ్యశాస్త్రి సేవలను ఆయన అభినందించారు. పీఠం పక్షాన శ్రీనాథుని జీవిత విశేషాలతోపాటు సాహిత్య కృషి, ఘనతను నిరూపించేలా సాహిత్యవేత్తల వ్యాసాలతో సంకలన్నాన్ని రూపొందించడం సంతోషదాయకమన్నారు.

జన్మభూమి నిర్వహణకు సమష్టి సహకారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహణకు సమష్టి సహకారం అవసరమని ఎంపీడీవో బాలచెన్నయ్య అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో జన్మభూమి కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులు, కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష జరిపారు. పాత అర్జీలపై ఏ చర్యలు తీసుకున్నది సభలో శాఖల వారీగా వివరించాలని సూచించారు. సీఎం ప్రసంగం ప్రజలు వీక్షించేలా తెర ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. తహసీల్దారు చిరంజీవి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శేషయ్య పాల్గొన్నారు.

ప్రకాష్ మృతి విద్యారంగానికి తీరనిలోటు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: చీమకుర్తి పబ్లిక్ స్కూల్ అధినేత ఎన్.ప్రకాష్ మృతి విద్యా రంగానికి తీరనిలోటని అపుస్మా జిల్లా అధ్యక్షుడు జి.హనుమంతురావు అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో ఇటీవల మృతి చెందిన ఎన్.ప్రకాష్ సంతాపసభ నిర్వహించారు. అపుస్మా ఈసీ సభ్యులు జి.హనుమంతురావు, శివాని నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు కొల్లూరి శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు ప్రకాష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: గత జన్మ భూమి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే తాజా కార్యక్రమాల్లో అధికారులను నిలదీస్తామని పౌర సంఘాల సమాఖ్య కన్వీనర్ జి.రమేష్ హెచ్చరించారు. నగరంలోని ప్రజా సమస్యలపై రూపొందించిన ప్రచార పత్రాలను శనివారం ఆయన ఎల్‌బిజి భవన్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి దామా శ్రీనివాసులు, ఐద్వా నాయకురాలు కె.రమాదేవి, పట్టణాభివృద్ధి వేదిక అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ఆవాజ్ నాయకులు ఎస్డీ హుస్సేన్, కేవీపీఎస్ నాయకులు ఎ.శ్రీనివాసులు, గిరిజన నాయకులు శ్రీరాం శ్రీనివాసులు, డైఫీ నాయకులు కేఎఫ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వినతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాకు విశ్వవిద్యాలయాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఐకాస ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐకాస అధ్యక్షుడు రాయపాటి జగదీష్ నేతృత్వంలో ఎమ్మెల్యేతో మాట్లాడారు. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు జనవరి 2న ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నందున విశ్వవిద్యాలయం గురించి ప్రకటన చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఐకాస ప్రతినిధులు పుష్పరాజ్, శ్రీనివాసరెడ్డి, మురళి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనతోనే సమ సమాజ స్థాపన

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: సమాజంలో అసమానతలు, కుల, ధనిక, పేద వ్యత్యాసాలు నిర్మూలించినప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమని డాక్టరు కోయి కోటేశ్వరరావు అన్నారు. సామాజిక పరిణామ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో హేతువాదం- కుల నిర్మూలన అన్న అంశంపై శనివారం రాత్రి ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సదస్సు జరిగింది. డాక్టరు ఆర్.ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో హేతువాద నాయకులు నార్నె వెంకటసుబ్బయ్య, జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా భారత దేశంలో క్రైస్తవ మిషనరీల సేవ' పుస్తక రచయిత పాటిబండ్ల శామ్యేలుకు డీటీ మోజస్ బహుమతితో పాటు రూ.25 వేలు నగదును ఇందిరా శేఖర్ ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. రైజ్ ప్రచురించిన కాకి కవితా సంకలనం కృష్ణ ద్విజ పుస్తకాన్ని నార్నె వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. కవి కత్తి కల్యాణ్, పల్నాటి శ్రీరాములు, డాక్టరు డి.ఎం.ఆర్.శేఖర్, ఇందిరాశేఖర్, టి.అశోక్‌కుమార్, పంది దావిదు, బెజ్జం రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



బహుమతిని అందజేస్తున్న ఇందిరా శేఖర్ ట్రస్టు ప్రతినిధులు

ఒంగోలు

తెరపై ఈనాడు

ఒంగోలు: రత్నమహల్- ఒక్క క్షణం, జుమంజి, **గోరంట్ల కాంప్లెక్స్**- ఒక్క క్షణం, మళ్లీ రావా, ప్రోజెక్ట్ జడ్, టైగర్ జిందా హై, జుమంజి, **గోపి**- ఎంసీఏ, **సరోజ్‌మయూరి**-2 కంట్రీస్, **తులసీరామ్**- ప్రోజెక్ట్ జడ్, **సత్యం**- హలో, **జయరామ్**- రాజా ది గ్రేట్

నేడూ బిల్లులు చెల్లించవచ్చు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని విద్యుత్తు రెవెన్యూ కార్యాలయాలు ఆదివారం పని చేస్తాయని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎన్‌వీఎస్ సుబ్బరాజు తెలిపారు. జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులు.. వారి విద్యుత్తు బిల్లులు, బకాయిలను చెల్లించవచ్చన్నారు. నిరంతర విద్యుత్తు బిల్లులను చెల్లించే కేంద్రాలు, ఈసేవ, మీసేవ కార్యాలయాలు కూడా పనిచేస్తాయన్నారు.

అనుమతులు లేకుండా విగ్రహ ఏర్పాటు

◗ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జేసీ-2కు ఫిర్యాదు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ కూడలి వద్ద నిబంధనలకు విరుద్ధంగా, అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేస్తున్న విగ్రహ ఏర్పాటు యత్నాలను నిరోధించాలని సీవీఎన్ రీడింగ్ రూమ్ ప్రత్యేక అధికారి ఈదుపల్లి గురునాథరావు జేసీ మార్కండేయులుకు ఫిర్యాదు చేశారు. శనివారం ప్రకాశం భవన్‌లో జేసీ-2ను కలిసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రీడింగ్ రూమ్ పార్కింగ్ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు విగ్రహ నిర్మాణానికి పూనుకున్నారని, ఆ ప్రాంతంలోని సామాన్యులపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని గురునాథరావు ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలనూ పాటించడం లేదన్నారు. జేసీ-2ను కలిసిన వారిలో సీవీఎన్ రీడింగ్ రూమ్ ప్రతినిధులు తిరుమలశెట్టి శ్రీరామమూర్తి, బి.ప్రసాద్, ఆర్. నితిన్‌రాజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


జేసీ-2 మార్కండేయులుకు వినతిపత్రం అందజేస్తున్న గురునాథరావు తదితరులు

మంత్రి శిద్దాను కలిసిన రిమ్స్ డైరెక్టర్

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావును రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ సాహెబ్ గౌరవపూర్వకంగా కలిశారు. శనివారం మంత్రి నివాస గృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రిమ్స్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. రోగులకు తగిన వసతి సౌకర్యాల విషయంలో ఎక్కడా మాట రాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో దంత వైద్యుల సంఘం అధ్యక్షుడు నామినేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖ పథకాల కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా గిరిజన సంక్షేమశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై అవగాహన కోసం రూపొందించిన కరపత్రాన్ని శనివారం కలెక్టర్ వినయ్‌చంద్ ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వినయ్‌చంద్ మాట్లాడుతూ గిరిజనులు పథకాలపై అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినయ్‌చంద్, రాజ్యలక్ష్మి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన లైన్‌మన్ చింత రామాంజనేయులు కుటుంబానికి రూ. నాలుగు లక్షల ఎఫ్‌డీ చెక్కును జిల్లా తెదేపా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా అందజేశారు. ఒంగోలు మంగమూరు రోడ్డులోని విద్యుత్తు ఉప కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు విధి నిర్వహణలో మృతి చెందారు. మృతుడిది మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామం. ఆయన కుమారుడు, కుమార్తెలకు ఒంగోలు ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఈ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్తుశాఖ ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి, దొడ్డవరం గ్రామ నాయకులు కె.శివరామకృష్ణ, రవి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు: ఒంగోలు

S.A.O.P. 6/2017

Between

శింబోతుల బ్రహ్మయ్య వగైరా ... పిటిషనర్లు

మరియు

డిపో మేనజరు,
ఎ.పి.యస్.ఆర్.టి.సి. ఒంగోలు వగైరా
... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

పై తెలిపిన యస్.ఎ. ఓ.పి.లో కొత్తపట్నం మండలము, అల్లూరు గ్రామ కాపురస్తులు 1,2 వారలకు తండ్రి గారైన శింబోతుల రాధయ్య గారు ఎ.పి.యస్.ఆర్.టి.సి.లో డ్రైవరుగా పనిచేయుచూ మరణించినారు.

కావున పైన తెలిపిన పిటిషనర్లు ఇద్దరు మరణించిన రాధయ్య గారికి వచ్చు బెనిఫిట్స్ తీసుకొనుటకు పై కోర్టులో యస్.ఎ.ఓ.పి. 6/2017ను దాఖలు చేసుకొని, సక్సెషన్ సర్టిఫికేట్ పొందుటకు పై నెంబరు ఓ.పిని దాఖలు చేసుకొనియున్నారు. కావున యావన్మంది ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తేది: 5-1-2018 ఉదయం 10:30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల ఎవరికి ఏమి ఆక్షేపణలు లేవని పై కేసును పిటిషనర్లు కోరిన విధముగా తీర్మానించబడును.

పై కోర్టువారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు, సం/- బొడ్డు భాస్కరరావు
అడ్వకేట్, గోల్డెన్ టవర్సు, జిల్లాకోర్టు ఎదురు
ఒంగోలు, సెల్ నెం: 9848793090

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అయిన ప్రకాశంజిల్లా, ఒంగోలు మండలం, ఉలిచి గ్రామ కాపురం, శింగమనేని బాపనయ్యగారి కుమారుడు వెంకటసుబ్బారావు మరియు సంతనూతలపాడు మండలం, మంగమూరు గ్రామ కాపురం, అబ్బూరి శ్రీనివాసరావుగారి భార్య శ్రీదేవి అనువారు నాకు యిచ్చిన సమాచారము మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా:-

నా క్లయింట్లు తే: 05-02-2007దిన నిడమానూరు గ్రామ కాపురస్థుడు ముప్పా సుబ్బయ్య గారి కుమారుడు వెంకయ్యగారి వల్ల అస్వాధీనపు విక్రయ ఖరారు అగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పత్రం పొందిన ఏజెంటు ఆలూరి రామబ్రహ్మాచారి గారి కుమారుడు భరత్‌గారి వల్ల క్రింది షెడ్యూలు దాఖలాస్థిని విక్రయించుకొని ఒంగోలు స.రి వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1378/2007రుగా రిజిష్టరు పొంది, నా క్లయింట్లు స్వాధీనానుభవములో కలిగి సర్వసంపూర్ణ హక్కులతో నిర్వివాదముగా అనుభవించుచున్నారు. సదరు దస్తావేజుకు సంబంధించిన లింక్ దస్తావేజులలో అనగా తే. 23-02-1991దిన ముప్పా సుబ్బయ్యగారి కుమారుడు వెంకయ్య గారి పేరున గల విక్రయదస్తావేజు నెం.533/1991రు నా క్లయింట్లు వద్ద పోయినది. ఇప్పుడు నా క్లయింట్లు సదరాస్థిని తాకట్టుగా వుంచి కరూర్ వైశ్యాబ్యాంక్, వల్లూరు బ్రాంచ్ వారి వద్ద రుణము పొందుటకు సిద్ధంగా ఉండియున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలాస్థిపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలుగాని, హక్కులుగాని, తాకట్లుగాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం (7) రోజులు లోపల వ్రాతపూర్వకమైన ఆధారములతో క్రింది అడ్రసుకు తెలియపరచవలెను. లేనియెడల సదరాస్థి నిర్వివాదమైన ఆస్థియని ధృవపరుచుకొని నా క్లయింట్లు పై బ్యాంకు నందు తనఖాపరచి రుణము పొందగలరు. తదుపరి సదరాస్థిపై ఎటువంటి ఆక్షేపణలు వచ్చిన యెడల అట్టివి చెల్లనేరవు. మరియు నా క్లయింట్లు మరియు బ్యాంకు వారి తనఖా హక్కులను బద్ధపరచజాలవు అని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది. సదరు దస్తావేజు ఎవ్వరికైనను దొరికిన యెడల క్రింది అడ్రసుకు పంపించగలరు.

షెడ్యూలు: ప్రకాశంజిల్లా - ఒంగోలు స.రి.యిలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్ - ఒంగోలు పట్టణం - మామిడిపాలెం గ్రామం - సర్వేనెం. 20/1రు - ప్లాటునెం. 40రులో 242 చ.గలు ఆస్థికి హద్దులు, **తూర్పు:** ప్లాటునెం. 41రు దాఖలా అద్దేపల్లి లక్ష్మీప్రసన్న స్థలం- యీ దిశ 66అ.లు, **దక్షిణం:** 30 అ.లు వెడల్పు గల బజారు - ఈ దిశ 33 అ.లు **పడమర:** ప్లాటునెం. 39రు స్థలం- ఈ దిశ 66అ.లు **ఉత్తరం:** ప్లాటు నెం. 35రు దాఖలా అన్నమనేని శివరామప్రసాద్ స్థలం- ఈ దిశ 33 అ.లు.

సం/- బొడ్డు రామలింగం
అడ్వకేటు, డోరునెం. 8-513/జి1
స్థలం: ఒంగోలు బృందావన్‌నగర్, శ్రీ సాయిఎన్‌క్లేవ్, ఒంగోలు
తేది: 30-12-2017 ఫోన్: 9866588599

పర్చూరు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

చినగంజాం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ యువకులకు గుంటూరులోని నల్లపాడులో నర్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయకర్త బి. ఓబేదు తెలిపారు. ఐటీసీ, ప్రథమ్ సంస్థల ఆధ్వర్యంలో నల్లపాడులోని ప్రథమ్ నర్సింగ్ శిక్షణ కేంద్రంలో 75 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతి, యూనిఫాం, అభ్యసన సామగ్రి అందజేస్తామన్నారు. వివరాలకు చరవాణి నంబరు. 7995199422కు సంప్రదించాలని కోరారు.

ఉలుకూ పలుకూ లేని 108

● అందుబాటులో లేని వాహనం ● అత్యవసరమైతే అంతే

పర్చూరు, న్యూస్‌టుడే:

పాత చెన్నై రహదారిలో నెల రోజుల క్రితం ఓ వ్యక్తి రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనం ఢీకొని పడిపోయాడు. 108కి సమాచారం ఇవ్వగా వస్తుందని తెలిపారు. దాదాపు గంటసేపు క్షతగాత్రుడు నెత్తుటి మడుగులోనే ఉన్నాడు. అప్పటికి 108 వాహనం రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

◗ ఈనెల 27వ తేదీన వాడరేవు-పిడుగురాళ్ల రహదారిలో పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలో పొలాల వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో భార్య, భర్త, వారి ఇద్దరు కుమారులు తీవ్రంగా గాయపడ్డారు. బాలుడి తలకు తీవ్ర గాయమైంది. 108కి స్థానికులు సమాచారం ఇవ్వగా చిలకలూరిపేట నుంచి 108 వాహనం తాపీగా వచ్చింది. అప్పటివరకూ ఆ కుటుంబం తీవ్ర గాయాలతో సాయం కోసం ఎదురుచూస్తూనే ఉంది.

◗ మూడు వారాల క్రితం పర్చూరు మండలం కొమర్నేనివారిపాలెంలో ఒక వ్యక్తి పురుగు మందు తాగాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. వాహనం వస్తుందని అరగంటకు పైగా ఎదురు చూసినా రాకపోవడంతో ఆటోలో చీరాల తీసుకెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో 108 వాహనం రావడంతో అందులోకి ఎక్కించి చీరాల ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందిస్తేనే వారి ప్రాణాలు కాపాడగలుగుతాం. దీన్ని దృష్టిలో ఉంచుకొని 108 వాహనాలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిర్వహణ వైఫల్యంతో గత కొంతకాలంగా ఇవి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండడంలేదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ వాహనానికి సుస్తీ చేస్తే మరమ్మతులు చేసే వారు కరవయ్యారు. ప్రమాదాల బారినపడిన వ్యక్తులు గంటల తరబడి నెత్తుటి మడుగులోనే వాహనం కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. పర్చూరు మండలానికి కేటాయించిన వాహనం దాదాపు రెండు నెలలుగా అందుబాటులో లేదు. వాహనానికి మరమ్మతులు తలెత్తడంతో జిల్లా కేంద్రానికి తరలించారు. ఆ తర్వాత ఇంత వరకు మరమ్మతులు చేయలేదు. మండల కేంద్రానికి వాహనాన్ని పంపలేదు. 108 వాహనం లేకపోవడంతో అందులో పనిచేసే సిబ్బంది కూడా అందుబాటులో లేరు.


గాయపడి వాహనం కోసం ఎదురు చూస్తున్న క్షతగాత్రుడు (పాతచిత్రం)


అందుబాటులో లేని 108 వాహనం (దాచినచిత్రం)

ఇతర ప్రాంతాల నుంచి వస్తేనే...

ప్రమాదాలు జరిగినప్పుడు చీరాల, ఇంకొల్లు, చిలకలూరిపేట తదితర ప్రాంతాల నుంచి 108 వాహనాలు రావాల్సిన పరిస్థితి. దీనికి దాదాపు గంట సమయం పడుతోంది. దీనివల్ల క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించలేకపోతున్నారు. ప్రైవేటు వాహనాలలో క్షతగాత్రులను తీసుకెళ్లాలన్నా ప్రాథమిక చికిత్స అందించే అవకాశం ఉండడం లేదు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని 108 వాహనం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయుని ప్రతిభ

చెరుకూరు (పర్చూరు) న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు పర్చూరు మండలం చెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.మీర్జాన్ ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ఒంగోలులో జరిగిన పోటీలలో ప్రథమ బహుమతి అందుకున్నాడు. సుస్థిరాభివృద్ధికి సాంకేతిక ఆవిష్కరణలు అనే అంశంలో రివర్ క్లీన్ బోట్‌ను చెరుకూరు పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మీర్జాన్ రూపొందించి జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రథమ గెల్చుకోగా, జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు చేతులమీదుగా అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు రివర్ క్లీన్‌బోట్‌ను ఎంపిక చేయడం పట్ల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.సుబ్బారావు, ఉపాధ్యాయులు మీర్జాన్‌ను అభినందించారు. ఈనెల 3,4 తేదీలలో రైజ్ కళాశాలలో జరిగిన నేషనల్ సైన్సు కాంగ్రెస్ పోటీలలో చెరుకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి భారతుల త్రివిక్రమవర్మ రూపొందించిన మానవరహిత అగ్నిమాపకం యంత్రానికి ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థులు, ఉపాధ్యాయ విభాగాలలో చెరుకూరు జెడ్పీ పాఠశాలకు జిల్లాస్థాయిలో ఒకే ఏడాది రెండు ప్రథమ బహుమతులు రావడం విశేషం.


మీర్జాన్ రూపొందించిన రివర్ క్లియర్ బోట్


జెడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న మీర్జాన్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి మద్యంసేవించి వాహనాలు నడిపే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఇంకొల్లు ఎస్సై రాంబాబు హెచ్చరించారు. డిసెంబరు 31 సందర్భంగా ఆదివారం రాత్రి 10.30గంటల నుంచి జనవరి ఉదయం 9గంటల వరకూ నిఘా ఏర్పాటు చేశామన్నారు. కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనం స్వాధీనం చేసుకుని ఆధార్ అనుసంధానంతో కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కారణంగా భవిష్యత్తులో వీసా పాస్‌పోర్టులు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

మార్టూరు, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం సందర్భంగా శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని వారిపై కేసులు నమోదుచేస్తామని ఎస్సై నాగమలేశ్వరరావు పేర్కొన్నారు. 31రాత్రి మద్యం సేవించి వాహనం నడిపినా, వీధుల్లో భారీ శబ్దంతో మైక్‌లు ఏర్పాటుచేసినా, గుంపులుగా సంచరించినా, ఇతరులను ఇబ్బందులకు గురిచేసినా కేసులు నమోదుచేస్తామన్నారు.

పోషకాహారంతో వ్యాధులు దూరం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే వ్యాధులు దరిచేరవని జాతీయ సేవా కార్యకర్త డి. వెంకటేష్ అన్నారు. నెహ్రూ యువకేంద్రం పర్చూరు బ్లాక్ ఆధ్వర్యాన స్థానిక అంగన్‌వాడీ కేంద్రం (165)లో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారని, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్, ఉచిత బేబి కిట్లు, మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అనంతరం స్థానిక చిట్టిబాబు చేయూత యూత్ క్లబ్ ఆధ్వర్యాన సామూహిక సీమంతాలు జరిగాయి. కార్యక్రమంలో యువజన సంఘ ప్రతినిధులు మోహన్, నాగరాజు, సూర్యకుమార్ ఎంపీటీసీ సభ్యురాలు శాంతి, అంగన్‌వాడీ సిబ్బంది దేవమణి, లావణ్య పాల్గొన్నారు.


సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రైతులకు రాయితీపై పురుగు మందులు

గంగవరం(ఇంకొల్లు) న్యూస్‌టుడే: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఎంపిక చేసిన గంగవరం గ్రామ రైతులకు రాయితీపై పరుగుమందులు పంపిణీ చేశారు. శనివారం వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ క్లష్టర్ డిమాన్‌స్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి ఆడె విజయకుమారి ఏఈవో రాజ్యలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..కావడి ఉత్సవం


నగరోత్సవంలో పాల్గొన్న పురప్రజలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక చీరాల శివాలయం ప్రాంగణంలోని వల్లీదేవసేన సమేత శ్రీషణ్ముఖ స్వామికి శనివారం రాత్రి కావడి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు, అర్చనలు, నైవేద్యాలు, హారతులు సమర్పించారు. రాత్రికి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

☛ న్యాయమూర్తి ఆదేశం


పర్చూరు బొమ్మలకూడలిలో జాతీయ నేతల విగ్రహాలు కనిపించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పర్చూరు, న్యూస్‌టుడే: జాతీయ నేతల విగ్రహాలు కనిపించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై జనవరి 6వ తేదీలోపు వివరణ ఇవ్వాలని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.మొహ్మద్ ఫజలుల్లా ఆదేశించారు. పర్చూరు బొమ్మల కూడలిలో విగ్రహాలు చుట్టూ ఫ్లెక్సీలు పెట్టారని దీనివల్ల జాతీయ నేతల విగ్రహాలు కనిపించడంలేదని పి.రవి అనే వ్యక్తి న్యాయస్థానంలో పీఎల్పీ దాఖలు చేశారు. ప్రతివాదులుగా పోలీసులు, పంచాయతీ అధికారులను చేర్చారు. లోక్‌అదాలత్‌లో భాగంగా శనివారం దీనిపై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. ప్రతివాదులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శి, పోలీసు అధికారులను ఫ్లెక్సీల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా! అని న్యాయమూర్తి ప్రశ్నించారు. అనుమతులు లేకుండానే పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె. సత్యనారాయణ కోర్టుకు వివరించారు. దీనిపై ఏం చర్యలు తీసుకుంటారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రధాన రహదారుల పక్కన పెడుతున్న ఫ్లెక్సీల వలన ప్రజలు ముఖ్యంగా ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతునట్లు న్యాయవాదులు ఈ సందర్భంగా న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కోర్టుకు నివేదించారు. దీనిపై జనవరి 6 నాటికి వివరణ అందజేయాలని న్యాయమూర్తి మొహ్మద్ ఫజలుల్లా ఆదేశిస్తూ వాయిదా వేశారు.

జరిమానా విధింపు

పర్చూరు, న్యూస్‌టుడే: చిరు వ్యాపారులు తోపుడుబళ్లతో ట్రాఫిక్‌కు ఆటంకం కల్పించడం, ప్రజలకు ఇబ్బంది కల్గించడం వంటివి చేయరాదని జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ నజీర్ ఉల్ ఇన్ ఆదేశించారు. రహదారులపై తోపుడు బళ్లు పెట్టి ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్న ఏడుగురిపై కేసులు నమోదు చేసిన పోలీసులు శనివారం స్థానిక కోర్టులో హాజరు పరచారు. ఒక్కొక్కరికి రూ.200లు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. మీరు వ్యాపారం చేసుకోవడం కోసం ఇతరులకు ఇబ్బంది కల్గించరాదని ఈసందర్భంగా న్యాయమూర్తి చిరు వ్యాపారులకు స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి తీర్పు చెప్పారు. పర్చూరు కోర్టు పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నమోదు చేసిన కేసులకు సంబంధించిన వారిని శనివారం న్యాయస్థానంలో హాజరుపరచారు. పేకాట కేసులో పట్టుబడిన 8 మందికి రూ.300లు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

పర్చూరు

భక్తిశ్రద్ధలతో పూజలు

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: ద్వాదశిని పురస్కరించుకొని మార్టూరు, యద్దనపూడి మండలాలలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం మార్టూరు రామాలయం, చింతపల్లిపాడు చెన్నకేశస్వామి ఆలయంలో స్వామివార్లకు అభిషేకాలు, పూజాకార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా వింజనంపాడులో పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

చెరుకూరులో గ్రామోత్సవం

పర్చూరు, న్యూస్‌టుడే: వైకుంఠ ద్వాదశి సందర్భంగా పర్చూరు మండలం చెరుకూరులో దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వార్ల విగ్రహాలకు విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం జరిగింది. అగస్థేశ్వరస్వామి, శ్రీత్రివిక్రమ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వేర్వేరు వాహనాలపై అమర్చి మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లకు వారు పోసి పూజలు చేశారు. అర్చకులు కంచిభొట్ల ఫణిరామలింగేశ్వర శర్మ, పరాశరం శ్రీమన్నారాయణ దీక్షితులు, రంగనాథబాబు ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధులలో కొనసాగిన గ్రామోత్సవం ఆలయాలకు చేరుకోగానే ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి ఆలయాల్లో భద్రపరచారు.


మార్టూరులో విశేష అలంకరణలో స్వామివారు


చింతపల్లిపాడులో పూజల్లో పాల్గొన్న భక్తులు


చెరుకూరులో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

విలువలతో కూడిన విద్యనందించాలి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: విద్యతోపాటు మానవతా విలువలను విద్యార్థులకు అందించాలని ఇంకొల్లుకు చెందిన ఆధ్యాత్మికవేత్త మద్దినేని ఆదినారాయణ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయి సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల కార్యదక్షతలు అలవడేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. నిత్యం యోగ విద్య కూడా నేర్పించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. టీవీ నరసింహారావు శ్రీనివాస రామానుజన్ మ్యాజిక్ స్క్వేర్ గురించి, శ్రీనివాసరావు ఛారీ చాప్లిన్ జీవిత విశేషాలు, యు.చెంచయ్య పెద్దనోట్ల రద్దు అనంతర పరిణామాలు, కేజేఆర్ కుమారి మానవ సంబంధాలు వ్యక్తిత్వ వికాసం, పి.శ్రీనివాసరావు వేద గణితంపై సమీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సముదాయ ఛైర్మన్ దానయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, న్యూస్‌టుడే: సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జరిగే సముదాయ సమావేశాల వల్ల ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనం ఉందని ఎంఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో శనివారం చినగంజాం, వేటపాలెం, నాగులుప్పులపాడు మండలాలకు చెందిన గణిత సబ్జెక్ట్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. గణితంలో సులభ పద్ధతిలో సూత్రాల ద్వారా అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు వివరంగా పందిళ్లపల్లి జడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివశంకర్ బోధించారు. కార్యక్రమంలో సముదాయ సమావేశాల ఛైర్మన్ టీవీడీ ఎస్వీ ప్రసాద్, కార్యదర్శి గంటా వీరాంజనేయులు, మూడు మండలాలకు చెందిన 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్వరరావు

శిక్షణకు తరలిన అన్నదాతలు


మార్టూరు నుంచి బయలుదేరిన రైతులు, అధికారులు


ఇంకొల్లు నుంచి...

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: ఈ నెల 31నుంచి జనవరి 8వరకు గుంటూరులో సుభాష్ పాలేకర్ నిర్వహిస్తున్న పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై జరిగే శిక్షణకు మార్టూరు, యద్దనపూడి ప్రాంతాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో బయలుదేరి వెళ్లారు. మార్టూరులో ఏవో వెంకటకృష్ణ, యద్దనపూడి తహసీల్దార్ శ్రీనివాసులు జెండాను కార్యక్రమాన్ని ప్రారంభించారు. మౌలాలి, శిరీషాలు తదితరులు ఉన్నారు.

ఇంకొల్లు నుంచి...

ఇంకొల్లు న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని 18మంది ఆదర్శ రైతులను ఎంపిక చేశారు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ నేతృత్వంలో పెదకాకానిలో శిక్షణ కార్యక్రమాలు జరుగనున్నాయి. శనివారం సాయంత్రం ఎంపికైన రైతులు స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లారు.

పథకాలపై అవగాహన

యద్దనపూడి: ఎన్టీఆర్ వైద్యసేవ, ఆరోగ్యరక్ష పథకాలపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శనివారం యద్దనపూడి జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ ప్రతినిధి కిరణ్‌కుమార్ విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. మాణిక్యరావు ఉన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: మార్టూరు, యద్దనపూడి మండలాల్లో జనవరి 2నుంచి 11వరకు జరిగే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్టూరు ఎంపీడీవో శ్రీరామచంద్రమూర్తి, యద్దనపూడి ఎండీవో రాంబాబులు పేర్కొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

మార్టూరు: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంకు లక్ష్యమని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మార్టూరు ఆంధ్రప్రగతి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మాధవరావు పదవీ విరమణ సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన విచ్చేసి మాట్లాడారు. అనంతరం మాధవరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ శైలకుమారి, విశ్రాంత మేనేజర్లు సాంబశివమూర్తి, రమేష్, శరత్‌లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సంతనూతలపాడు

ప్రమాదంపై కేసు నమోదు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు. అమ్మనబ్రోలులో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు కొండపల్లి ఆదెయ్య గాయపడ్డారు. ఈ మేరకు వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లా జైలు తనిఖీ

ఒంగోలు న్యాయవిభాగం: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల నిర్దేశం మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజావెంకటాద్రి శనివారం జిల్లా జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మట్లాడి వారి సమస్యలు ఆలకించారు. ఆహార పదార్థాల నాణ్యత సక్రమంగా ఉండటం లేదని వారు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తి తనిఖీ చేసి కారాగారంలో కొన్ని లోపాలు గుర్తించారు. వాటిపై జిల్లా జడ్జికి నివేదిక సమర్పిస్తానన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి రోటరీ తోడ్పాటు

చీమకుర్తి, న్యూస్‌టుడే: విద్యా రంగం అభివృద్ధికి రోటరీ క్లబ్ నిత్యం అండగా ఉంటుందని చీమకుర్తి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్షులు శిద్దా సురేష్ కుమార్ పేర్కొన్నారు. అధ్యక్షులు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో చీమకుర్తి గురుకుల పాఠశాల, ఆర్ఎల్‌పురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు శనివారం... స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత కొన్నేళ్లుగా చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి గ్రేడ్ తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, స్వప్నరాజ్, క్లబ్ కార్యదర్శి ముప్పూరి చలమయ్య, గుడిపూడి ప్రసాదరావు, పి.శ్రీనివాసమూర్తి, యడ్లపల్లి రామబ్రహ్మం, పోకూరి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చీమకుర్తికి సహకరించాలి

◗ కౌన్సిల్ సమావేశంలో తీర్మానాల ఆమోదం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి నగర పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యం మరింత మెరుగు పరిచే దిశగా చేపట్టనున్న ఘన వ్యవర్థాల నిర్వహణకు అందరూ సహకరించి... స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని ఛైర్మన్ కొత్రపు రాఘవరావు కోరారు. శనివారం... నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. వివిధ అంశాలకు సంబంధించి 19 అంశాలతో పొందుపరిచిన అజెండాను సమావేశంలో ఆమోదించారు. కమిషనర్ బి.శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ గంగాధరరావు, వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశంలో ఛైర్మన్, కమిషనర్‌లు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా త్వరలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. చెత్త సేకరణకు అవసరమైన పుష్‌కాట్లు, పెద్ద డబ్బాలు ఇప్పటికే స్వచ్ఛ భారత్ ద్వారా వచ్చినట్లు చెప్పారు. గృహాల్లో తడి పొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసేందుకు నగర పంచాయతీ పరిధిలోని గృహస్థులందరికీ డబ్బాలను అందజేయాల్సి ఉందన్నారు. డబ్బాల ఏర్పాటుకు దాతలు, ఆకర్షణీయ వార్డుల కింద దత్తత తీసుకున్న వారి సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 6వ వార్డులోని గృహాలన్నింటికి డబ్బాలు అందజేస్తామని ఛైర్మన్ రాఘవరావు ప్రకటించారు.

కార్మికుల కొనసాగింపు...

నగర పంచాయతీలో పనిచేస్తున్న 70 మంది పారిశుద్ధ్య కార్మికులను మరో రెండు నెలల పాటు (ఫిబ్రవరి వరకు) కొనసాగించాలని చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. అందుకు అయ్యే వేతన మొత్తాన్ని సాధారణ నిధుల నుంచి చెల్లించాలని నిర్ణయించారు. కార్యాలయానికి అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.2 లక్షలతో చేసిన ప్రతిపాదనలను ఆమోదించారు. జనవరి మొదటి వారంలో నిర్వహించనున్న జన్మభూమి గ్రామ సభల నిర్వహణ, ఎల్‌సీడీ టీవీ ద్వారా ముఖ్యమంత్రి సందేశాలను వీక్షించే ఏర్పాట్ల కోసం రూ.లక్ష కేటాయిస్తూ తీర్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రాఘవరావు

◗ నగర పంచాయతీ పరిధిలో ప్రజారోగ్య నిర్వహణలో భాగంగా ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు... తడి చెత్తను ఎరువుగా మార్చేందుకు ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలు, డబ్బాల కొనుగోలు తదితరాలకు రూ.18 లక్షలతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఆమోదించారు. నాయుడుపాలెం రోడ్డు నుంచి గిన్నెల స్వామి గుడి వరకు సిమెంటు రహదారి నిర్మాణం, కాలువపై గోడల నిర్మాణానికి రూ.2 లక్షలతో తీర్మానం చేశారు. నగర పంచాయతీ పరిధి సర్వే నెంబరు 454లో గుర్తించిన సుమారుగా పది ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ రూ.5 లక్షలతో కంచె ఏర్పాటుకు నిర్ణయించారు. సమావేశంలో మేనేజర్ రాజు, టీపీఎస్ లక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రామకృష్ణ, కౌన్సిలర్లు ఎస్.ఏడుకొండలు, జి.కోటేశ్వరరావు, పి.కోటయ్య, జి.పార్వతి, కె.యలమంద, కె.సత్యవతి, బి.రమేష్, కె.పద్మావతి, కె.సుబ్బులు, సీహెచ్.శివపార్వతి, సీహెచ్.అంకులు, డి.సుశీల, షేక్ షమీమ్, బి.కాజారావు, కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ కళాశాల క్రీడలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శనివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి మొత్తం 17 విభాగాల్లో 1350 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. చివరి రోజు ఆటల పోటీలతోపాటు అథ్లెటిక్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతోపాటు ఓవరాల్ ఛాంపియన్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. సాంకేతిక విద్యాశాఖ తిరుపతి ఆర్జేడీ బి.సూర్యుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో చురుగ్గా ఉన్న విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు తమ కళాశాలకు అనుమతి ఇచ్చినందుకు సాంకేతిక విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ-సెట్‌లో 0.5 శాతం రిజర్వేషన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్‌బేగ్, పేస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు అనిల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా, బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కృష్ణా జిల్లా, బాలుర విభాగంలో ఓవరాల్ ఆటల పోటీల ఛాంపియన్‌షిప్‌ను కర్నూలు జిల్లా, బాలికల విభాగం ఓవరాల్ ఆటల పోటీల ఛాంపియన్‌షిప్‌ను గుంటూరు జిల్లా కైవసం చేసుకున్నాయి.



బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న పశ్చిమ గోదావరి జట్టు

వేడుకగా పుష్పార్చన

చీమకుర్తి, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవంలో భాగంగా చీమకుర్తి హరిహర క్షేత్రంలో శనివారం స్వామివారికి సుప్రభాత సేవ, గోదాదేవికి ద్వాదశ పుష్పార్చన పూజలను వేడుకగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకొని ఆయా సేవల్లో పాల్గొన్నారు. అర్చకులు పూజాదికాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు, శిద్దా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



సుప్రభాత సేవలో పాల్గొన్న భక్తులు

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణతోనే మంచి ఆరోగ్యం సొంతమవుతుందని జడ్పీటీసీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం... స్థానిక ఎమ్మెస్సార్ కళాశాలలో అక్షర చైతన్య ఇంటిగ్రేటెడ్ మోడల్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటి సంరక్షించాలన్నారు. తద్వారా పర్యావరణానికి చాలా మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పేస్ కళాశాల డైరెక్టర్ టి.వీరాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి.రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నరసింహారావు, గృహ నిర్మాణశాఖ సూపర్‌వైజర్ అహరోన్, మల్లికార్జునరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు

'జన్మభూమి'ని విజయవంతం చేయాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలంలో జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించనున్న 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.వి.ప్రసాద్ కోరారు. శనివారం... స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జన్మభూమి సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు, ఎంపీడీవోల నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో కలిసి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. 2న ఇలపావులూరు, పిడితలపూడి, రామచంద్రాపురం, 3న పల్లామల్లి, ఆర్ఎల్‌పురం, 4న బండ్లమూడి, గోనుగుంటలో కార్యక్రమం జరగనుంది. 5న పులికొండ, కె.వి.పాలెం, ఏలూరివారిపాలెం, 6న చంద్రపాడు, గాడిపర్తివారిపాలెం, 7న నేకునంబాదు, చినరావిపాడు, బూసరపల్లి, 8న టి.గుడిపాడు, బూదవాడ, 9న నిప్పట్లపాడు, వై.గుడిపాడు, 10న దేవరపాలెం, పి.నాయుడుపాలెం, మువ్వావారిపాలెం, 11న మంచికలపాడులో గ్రామ సభలు జరగనున్నాయన్నారు. గ్రామ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశంలో పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల జయప్రదానికి వినతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: కనిగిరిలో జనవరి 8 నుంచి 10 వరకు జరగనున్న జిల్లా సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు షేక్ మాబు కోరారు. శనివారం... చీమకుర్తిలోని పంగులూరి కృష్ణయ్య భవనంలో జరిగిన మండల సీపీఎం కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పల్లాపల్లి ఆంజనేయులు సమావేశానికి అధ్యక్షత వహించారు. మాబు మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా ప్రజలపై పడుతున్న భారాలు తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు. 8న జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, సభ్యులు కంకణాల వెంకటేశ్వర్లు, ప్రసాద్, కొల్లూరి వెంకటేశ్వర్లు, మాదాల చిరంజీవి, పొత్తూరి సురేష్, తొట్టెంపూడి రామారావు, బెజవాడ శ్రీను, పులి ఓబులరెడ్డి, బొడ్డు ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాబు

తెరపై ఈనాడు

ఒంగోలు: రత్నమహల్- ఒక్క క్షణం, జుమాంజి, గోరంట్ల కాంప్లెక్స్- ఒక్క క్షణం, మళ్లీ రావా, ప్రాజెక్ట్ జడ్, టైగర్ జిందా హై, జుమంజి, గోపీ-ఎంసీఏ, సరోజ్‌మయూరి- 2 కంట్రీస్, తులసీరామ్- ప్రాజెక్ట్ జడ్, సత్యం-హలో, జయరామ్- రాజా ది గ్రేట్

సంతనూతలపాడు

కరివేపాకు సాగు... భలే బాగు



జీఎల్‌పురం వద్ద సాగులో ఉన్న కరివేపాకు తోటలు

న్యూస్‌టుడే - చీమకుర్తి

చీమకుర్తి మండలం జీఎల్‌పురానికి చెందిన రైతులు కరివేపాకు వంటి భిన్నమైన పంటలను సాగు చేస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఐదేళ్ల క్రితం ఒకరిద్దరు రైతులతో ప్రారంభమైన కరివేపాకు సాగు ప్రస్తుతం ఇరవై ఎకరాలకు విస్తరించింది. గతంలో హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు ఆకును ఎగుమతి చేసేవారు. ఆ క్రమంలో దళారుల చేతుల్లో ఎక్కువగా మోసపోవడంతో... ప్రస్తుతం ఒంగోలు మార్కెట్‌కు ఉత్పత్తిని పంపుతున్నారు. స్థానికంగా సరైన మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది రైతులు కరివేపాకు సాగు వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.

ఏడేళ్లలో గణనీయమైన మార్పు...

గత ఏడేళ్ల కాలంలో జీఎల్‌పురం రైతుల ఆలోచనా ధోరణిలో సానుకూల మార్పు కనిపిస్తోంది. ఆ ప్రభావం వారి జీవనశైలిలోనూ ప్రతిబింబిస్తోంది. బోర్ల ఏర్పాటు ద్వారా అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పెద్దగా కనిపించని కరివేపాకు, బత్తాయి, నిమ్మ వంటి తోటలను కొందరు రైతులు సాగు చేస్తున్నారు. కరివేపాకు విషయానికి వస్తే ఐదేళ్ల క్రితం మొదటిగా ఎకరం విస్తీర్ణంలో ఓ రైతు సాగు చేశారు. మంచి ఫలితాలు రావడంతో మరికొందరు ఆయన బాటలో సాగారు. ప్రస్తుతం సుమారు ఇరవై ఎకరాల విస్తీర్ణంలో ఆ పంట సాగవుతోంది. గతంలో చీమకుర్తి, ఒంగోలు ప్రాంతాల్లో సరైన మార్కెట్ సదుపాయం లేక... కోసిన ఆకును లారీల్లో హైదరాబాద్‌కు పంపేవారు. అక్కడి వ్యాపారులు కొందరు సరిగా డబ్బులు చెల్లించక పోవడం, ఇతరత్రా కారణాలతో... ఆ ప్రాంతానికి ఉత్పత్తిని పంపడం మానుకున్నారు. ప్రస్తుతం కొద్ది మొత్తంలోనే ఒంగోలు మార్కెట్‌కు పంపిస్తున్నామని రైతులు చెబుతున్నారు. నవంబరు నుంచి మార్చి వరకు ఆకుకు మంచి ధర ఉంటుంది. కిలోకు రూ.20కి తగ్గకుండా ధర లభిస్తుంటుందని రైతులు చెబుతున్నారు. ఆ తర్వాత నుంచి ధరలు తగ్గుతుంటాయి. ప్రభుత్వం ద్వారా సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే... ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు కలుగుతుందని గ్రామానికి చెందిన ఎన్.కోటయ్య, ఇతర రైతులు పేర్కొన్నారు.

పోటీతత్వంతోనే ప్రగతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెదకొత్తపల్లి (మద్దిపాడు), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సానుకూల పోటీతత్వం పెంచడం ద్వారా వారి ప్రగతికి బాటలు వేయవచ్చని పెదకొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నాతాని హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం... పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సాహిత్య, మనోవిజ్ఞాన పరీక్షలను... పూర్వ విద్యార్థుల సంఘం, శాంతివనం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో రచయిత మంచికంటి, సుధాకర్, అంజయ్య, ప్రధానోపాధ్యాయిని అరుణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు మీతోడు

మీ సమస్య ఏదైనా దాని పరిష్కారానికి మీకు 'ఈనాడు' తోడుగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా మీరు ఎదుర్కొంటున్న సమస్య, మీ పేరు, గ్రామం పేరు పుతూ మాకు ఫోన్ చేయడమే. సంబంధిత అధికారి దృష్టికి మీ ఇబ్బందిని తీసుకెళ్లి ఆయన సమాధానాన్ని పత్రికలో ప్రచురిస్తాం.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

సంతనూతలపాడు	80085 52692
మద్దిపాడు	70939 81622
చీమకుర్తి	80085 74078

నేలటూరు (మద్దిపాడు), న్యూస్‌టుడే:

సమస్య: నేలటూరు నుంచి పల్లామల్లి వెళ్లే రహదారి మలుపు వద్ద వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాఠశాల విడిచిపెట్టే సమయంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. - సురేంద్రబాబు, గ్రామస్థుడు

సమాధానం: పరిశీలించి... అక్కడ వాహనాల వేగం నియంత్రించేలా చర్యలు తీసుకుంటాం. - కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ ఏఈ

బసవన్నపాలెం (మద్దిపాడు), న్యూస్‌టుడే:

సమస్య: బసవన్నపాలెం ఎస్సీ కాలనీలోని పలు ప్రాంతాల్లో కాలువలు సరిగా లేక రహదారిపైనే మురుగు పారుతోంది. రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. - నరేష్, గ్రామస్థుడు

సమాధానం: కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే... పనులు చేపడతాం. - నాగేశ్వరరావు, ఈవోఆర్డీ



శ్రీచైతన్య పాఠశాలలో సందడి



గౌతమ్ పాఠశాలలో వేడుకలు

నూతన సంవత్సరానికి స్వాగతం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రస్తుత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2018కి స్వాగతం పలుకుతూ... చీమకుర్తి పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శనివారం వేడుకలు నిర్వహించారు. 31న ఆదివారం కావడం, 1న పాఠశాలలకు సెలవులు కావడంతో శనివారమే నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు స్థానిక శ్రీచైతన్య, గౌతమ్ తదితర పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో కేకులు కత్తిరించారు. విద్యార్థులు హుషారుగా నృత్యాలు చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు.

నేడు 'ఉండమ్మా బొట్టు పెడతా'

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోల్ - స్వచ్ఛ ఒంగోల్ కోసం ఆదివారం నగరంలో వినూత్న ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ నగరంలోని 50 డివిజన్లలో 'ఉండమ్మా బొట్టు పెడతా' కార్యక్రమం జరుగుతుందన్నారు. నోడల్ అధికారులంతా వారి డివిజన్లలోని గృహాలను సందర్శించి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు పెట్టి స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి వివరిస్తారన్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. నోడల్ అధికారులు మహిళా స్వయం సేవక్ సంఘాలు, స్వచ్ఛ సైనికులు, బ్రాండ్ అంబాసిడర్ల సహకారంతో కనీసం 10 మంది మహిళలను వెంట తీసుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

ఆరోగ్య రక్షతో ఉచిత వైద్య సేవలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఆరోగ్య రక్ష పథకంతో 1044 రోగాలకు ఉచిత వైద్య పరీక్షలకు అవకాశం ఉంటుందని డివిజన్ ప్రతినిధి సీహెచ్.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యరక్ష పథకంపై అవగాహన కల్పించారు. రూ.1200 చెల్లించడం ద్వారా పథకంలో వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. తద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సదుపాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. డిసెంబర్ 31లోగా పథకంలో చేరాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య మిత్ర సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ఆయకట్టుకు నీరివ్వాలి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు భూములకు నీరివ్వాలని రైతు సంఘం మండల కార్యదర్శి బసవ పున్నయ్య డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం మహాసభల సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీటిని ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు కోసం రైతులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారన్నారు. విలువైన భూములు కోల్పోయి, గ్రామాలను సైతం విడిచిపెట్టి వచ్చారన్నారు. ఇప్పటికీ ప్రాజెక్టు పరిధిలో మైనర్ కాలువలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఆ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయకట్టు భూములకు తొలి ప్రాధాన్యమిచ్చి... మిగిలిన జలాలను ఇతరత్రా అవసరాలు వాడుకోవాలన్నారు. కనపర్తి ఎత్తిపోతల పథకం కింద నున్న ఐదువేల ఎకరాల భూములకు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షుడు బసవయ్య, నాయకులు జయంతిబాబు, వెంకట్రావు, యోనా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం మండల కార్యదర్శి బసవపున్నయ్య

చెక్‌డ్యాంలకు నీరివ్వాలని వినతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం నాయుడు పాలెం, అగ్రహారం, బండ్లమూడి గ్రామాల పరిధిలో ముదిగొండి వాగుపై ఉన్న చెక్‌డ్యాంలకు సాగర్ నీరిచ్చి పంటలను కాపాడాలని... బండ్లమూడి రైతులు జలవనరుల శాఖ అధికారులను కలిసి శనివారం విజ్ఞప్తి చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే సాగులో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని.. గతంలో ఎన్నడూ లేని విధంగా బోర్లు వట్టిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయా మేజరు కాలువల ద్వారా ముదిగొండి వాగులోని మూడు చెక్‌డ్యాంలకు నీరు పెట్టి పంటలను కాపాడాలని, పశువులకు తాగేందుకు నీటి వసతి కల్పించాలని డీఈ, ఏఈలను కలిసి కోరారు. సర్పంచి వై.శేషిరెడ్డి, పలువురు రైతులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

జిల్లాను వెనుకబడిన జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెంచిరెడ్డి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని సీపీఎం నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో... వివిధ పార్టీల నాయకులతో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వైకాపా మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం జిల్లాకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయించి.. వెంటనే పూర్తి చేయాలన్నారు. పేర్నమిట్టలోని వంద ఎకరాల స్థలంలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, జామాయిల్, సుబాబుల్ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చూడాలన్నారు. రామతీర్థం జలాశయం నుంచి తాగు, సాగు నీరు ఇవ్వాలని, మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్నారు. డెయిరీ రైతులు, ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. పేర్నమిట్టలో ఫ్లైఓవర్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నూతలపాటి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు దాసరి కోటిలింగం, సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు కోడాలి కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం

రేషన్ కార్డులకు 646 దరఖాస్తులు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: గత జన్మభూమి-మా ఊరు గ్రామసభల నుంచి ఇప్పటివరకు రేషన్‌కార్డుల కోసం 646 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దారు రత్నకుమారి తెలిపారు. వీటి మంజూరు కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయగా అన్నిటికీ ఆర్‌సీ నంబర్లు కేటాయించినట్టు తెలిపారు. మంజూరైన కార్డులను జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్టు వివరించారు.

వెలిగొండను త్వరగా పూర్తి చేయాలి

పెద్దారవీడు: మంత్రి సోమిరెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కలిసి వెలుగొండను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కరవు ప్రాంతం అయిన పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెలుగొండను త్వరగా పూర్తి చేస్తామన్నారు.



ఖాతాదారునికి బహుమతి అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ రామకృష్ణారావు

ఆర్థిక పొదుపు పాటించాలి

నడిగడ్డ(త్రిపురాంతకం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఆర్థిక పొదుపు పాటించాలని దూపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ టీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని నడిగడ్డలో బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిపాజిట్, రుణ, సామాజిక భద్రత పథకాల గురించి వివరించారు. ఖాతాదారులకు బహుమతులు అందజేశారు. అనంతరం బ్యాంకులో డబ్బు ఎలా వృద్ధి చెందుతుంది అనే దానిపై కళాజాత బృందం నాటిక ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించారు. క్యాషియర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: మండలంలోని మేడపి వాణిరమా డీఎడ్ కళాశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి మంచి ఉపాధ్యాయులుగా రాణించాలని కళాశాల డైరెక్టర్ గుత్తా వెంకటేశ్వరావు, కరస్పాండెంట్ అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఛాత్రోపాధ్యాయులకు సూచించారు. గౌరవ సలహాదారు సముద్రాల విశ్వనాధం, ప్రిన్సిపల్ బి.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు నాసరయ్య, జశ్వంత్, సుబ్రహ్మణ్యం, సునీత పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు శనివారం వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిశారు. పెద్దారవీడులో మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. గత వేసవిలో ఉద్యాన రైతులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసుకున్నా డబ్బులు ఇంత వరకు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2015 నుంచి ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇంత వరకు ఇవ్వలేదన్నారు. వీటికి స్పందించిన మంత్రి నాలుగు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని జేడీఏ హరిప్రసాదును ఆదేశించారు. వెలుగొండ సమస్య సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు లగడపాటి వెంకటేశ్వర్లు, కోట సుబ్బారెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంత్రితో మాట్లాడుతున్న రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

ఈ దారి బాగుపడేదెన్నడు?

అధ్వానంగా గంగపాలెం- నర్సాయపాలెం రహదారి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని గంగపాలెం, నర్సాయపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి మార్కాపురం రోడ్డులోని వెలగచెట్టు వద్ద నుంచి గంగపాలెం వరకు 7 కి.మీ పొడవు ఉంది. మట్టి రోడ్డు కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు ఈ మార్గం నుంచే ప్రయాణం సాగిస్తుంటారు. ఇప్పటికి అయిదు సార్లు రోడ్డు వేశారు. సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు చేశారు. వేసిన ప్రతిసారి మట్టి కంకరతోనే సరిపెట్టడంతో మూణ్నాళ్ల ముచ్చటగా తయారవుతోంది.



రాళ్లు తేలిన రహదారి

నిత్యం యర్రగొండపాలేనికి ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రెండు గ్రామాలకు ఒకే ఒక బస్సును మార్కాపురం ఆర్టీసీ నడుపుతోంది. ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు మాత్రమే తిరుగుతుంది. దీంతో ప్రయాణానికి ఇక్కట్లు తప్పడం లేదు.

వేసవిలో దుమ్ము, వర్షాకాలంలో బురద

ఈ రహదారి వేసవిలో విపరీతమైన దుమ్ముతో ఉంటుంది. వర్షాకాలంతో పూర్తిగా బురదగా మారుతుంది. రోడ్డులో వాహనాలు ప్రయాణిస్తుంటే లేచే దుమ్ముకు పక్క మనిషి పది నిముషాల వరకు కనిపించరు. ద్విచక్ర వాహనచోదకులు నరక యాతన అనుభవిస్తున్నారు. గుంతలతో, కంకర లేచి ఉంటుంది. ఇరువైపులా చిల్లచెట్లతో మూసుకు పోయి ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా దీన్ని తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



చిల్లచెట్లతో మూసుకు పోయిందిలా..




బస్సు వెళ్తుంటే ఇలా దుమ్ము రేగాల్సిందే..

వైద్యశాల భవనం నిర్మాణానికి నిధుల మంజూరు

స్థలం కోసం నిరీక్షణ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం యునాని వైద్యశాల కోసం భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన స్థలాన్ని చూపించేందుకు అధికారులు నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారు. దీంతో మంజూరైన నిధులు వెనుకకు మరలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు దశాబ్దాలుగా యునాని వైద్యశాల ఉంది. ప్రభుత్వ వైద్యశాలలోని ఓ గదిలో దాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఆ ప్రాంతం పందుల సంచారంతో అపరిశుభ్రంగా ఉంది. దీంతో వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వ వైద్యశాలలో స్థలం ఇచ్చేందుకు వైద్యాధికారి ఆసక్తి చూపడం లేదు. వైద్యశాల నిర్మిస్తే ఇరుకుగా తయారై రోగులకు సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యాధికారి శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. స్థలం చూపాలని మండల స్థాయి అధికారులను కోరానని.. వారి నుంచి ఎలాంటి స్పందన లభించలేదని యునాని వైద్యురాలు శాంతి పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అపరిశుభ్రత వాతావరణంలో యునాని వైద్యశాల

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు వేములకోట విద్యార్థులు

వేములకోట (మార్కాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: తమ విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వేములకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన అభినందన సభలో... నమూనా ప్రదర్శించిన విద్యార్థులు ఎం.యోగి, బి.గోపి (పదో తరగతి), యు.శివశంకర్ (తొమ్మిది), ఎం.దుర్గానాగార్జనరెడ్డి (ఎనిమిది)తో పాటు వీరికి మార్గదర్శనం చేసిన జాతీయ స్థాయి అవార్డు గ్రహీత, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు టి.ఎన్.జగన్నాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వీరు రూపొందించిన కుక్కర్ కండక్షన్ బై కన్వెన్షన్ (తక్కువ కట్టెలతో భోజనం తయారు చేయండి) నమూనా రాష్ట్ర స్థాయి ప్రదన్శనకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి ఎ.శ్యాంశుభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొర్రప్రోలు చెంచు గిరిజన గూడెంలో రహదారి ఇరువైపులా ఉన్న చెట్లు



చింతల చెంచు గిరిజన గూడెంలో ఏపుగా పెరిగిన చెట్లు



భ్రమరాంబ చెంచు గిరిజన గూడెంలోని ఆశ్రమ పాఠశాలలో..

గిరిజన గూడేల్లో వెల్లివిరిసిన పచ్చదనం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం పచ్చదనానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. ప్రతి ఒక్కరు చెట్లు పెంచాలని అవగాహన కల్పిస్తూ అనేక పథకాలు చేపట్టింది. అయితే పట్టణాల్లో, మండల కేంద్రాల్లో పచ్చదనం కరవైంది. కొందరు తమ స్వార్థం కోసం చెట్లను పెంచడం లేదు. దీంతో ఆ ప్రాంతాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అందుకు విరుద్ధంగా ఉంది చెంచు గిరిజన గూడేల్లో. చెట్లను పెంచాలని ప్రభుత్వ అధికార్లు ఏనాడు చెంచు గిరిజనులకు అవగాహన కల్పించలేదు. అయినా వారు మాత్రం తమ ఇంటి పెరడు, అంతర్గత రహదారులకు ఇరువైపులా చెట్లను పెంచుతున్నారు. దీంతో ఆ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మండలంలోని చింతల, కొర్రప్రోలు, పెద్దమంతనాల చెంచు గిరిజన గూడేలతో పాటు భ్రమరాంబ ఆశ్రమ పాఠశాలలు పచ్చని చెట్లతో నిండిపోయాయి. ఆ గూడేలు సందర్శించిన వారు ఆసక్తి చూస్తారనడంలో సందేహం లేదు.

యర్రగొండపాలెం

తెరపై ఈనాడు

యర్రగొండపాలెం పట్టణం: శ్రీవెంకటేశ్వర:(ఎంసీఏ): శ్రీశ్రీనివాస: (హలో): గాయత్రి: (2 కంట్రీస్)





బ్యాగులు పంపిణీ చేస్తున్న దాత రాజగోపాల్

విద్యార్థులకు బ్యాగుల అందజేత

గంగపాలెం(యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా ఏలూరులో పనిచేస్తున్న పులుకూరి సునీత, రాజగోపాల్ దంపతులు తమ కుమార్తె పుట్టినరోజు వేడుకలను గంగపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుపుకున్నారు. 'బడిరుణం తీర్చుకుందాం' కార్యక్రమంలో భాగంగా గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయురాలు కల్పనాజ్యోతి సూచనమేరకు వారు శనివారం వంద మంది పాఠశాల విద్యార్థులకు బ్యాగులు బహూకరించారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతలను గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. హెచ్‌ఎం శివకోటిరెడ్డి, ఉపాధ్యాయులు రసూల్, పల్లవి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు విధిగా హాజరుకావాలి

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జన్మభూమి కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధిగా హాజరు కావాలని వైద్యాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామసభలకు తప్పనిసరిగా వైద్యసిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రత, జననీ సురక్ష యోజన పథకం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి చంద్రశేఖర్

భక్తిశ్రద్ధలతో పడిపూజ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి వీధిలో శుక్రవారం రాత్రి అయ్యప్ప నామస్మరణ మార్మోగిపోయింది. అయ్యప్ప మాలధారుడు పెరుమాళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్తు వెలుగుల మధ్య ఏర్పాటు చేసిన అరటి మండపాలు అందరిని ఆకట్టుకున్నాయి. అయ్యప్ప, శివుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటాలు ఉంచి వేద పండితుడు బి.రాంప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తిరుమలనాథస్వామి



విద్యుత్తు వెలుగుల మధ్య అరటి మండపాలు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: రాజంపల్లి సమీపంలోని తిరుమలనాథ స్వామి దేవాలయంలో శనివారం అర్చకుడు భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తిరుమలనాథునికి, రాజ్యలక్ష్మి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జనవరి 10న క్విజ్ పోటీలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎలా స్వచ్ఛంద సంస్థ, ప్రజా సైన్స్ వేదిక ఆధ్వర్యంలో జనవరి 10న ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పి.మల్లికార్జున తెలిపారు. పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ పోటీలకు ప్రతి కళాశాల నుంచి రెండు జట్లకు ప్రవేశం ఉంటుందని ఒక్కో జట్టులో ముగ్గురు విద్యార్థులు పాల్గొనాలన్నారు. జనవరి 6 లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పంటల నమోదుకు పాట్లు

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం కింద బీమా ప్రీమియం చెల్లించేందుకు శనివారం చివరిరోజు కావడంతో రైతన్నలు డీడీలు తీసేందుకు, మీసేవలో బీమా నమోదు చేసేందుకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ పనిచేయక రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బ్యాంకుల వద్ద డీడీలు తీసేందుకు నిరీక్షణ తప్పలేదు. ఆన్‌లైన్ రాత్రివేళ పనిచేస్తుందన్న ఆశతో శనివారం రాత్రి సమయంలో కూడా వేచి చూశారు. పుల్లలచెరువు మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న 1400 హెక్టార్లు, జొన్న 20 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 70 హెక్టార్లు, మిరప 200 హెక్టార్లు, మినుము 600 హెక్టార్లు చొప్పున సాగుచేశారు. అయితే మీ సేవ కేంద్రంలో ఈ నెల 31 కూడా వెబ్‌సైట్ ఆన్‌లోనే ఉంటుందని రైతులు ఆదివారం కూడా నమోదు చేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏవో జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు. ఇప్పటికే సుమారు 1500 మంది డీడీలు, మీ సేవ కేంద్రాల్లో నగదు చెల్లింపు వంటివి జరిగాయని ఆయన వివరించారు.



ఆర్.ఉమ్మడివరం మీ సేవ కేంద్రం వద్ద పడిగాపులు

గ్రామసభల జయప్రదానికి వినతి

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన జన్మభూమి గ్రామసభలను పండగలా నిర్వహించాలని ఎంపీడీవో కె.మాణిక్యరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈ నెల 2 నుంచి నిర్వహించనున్న 'జన్మభూమి- మా ఊరు' గ్రామసభలపై శనివారం సమీక్ష నిర్వహించారు. గ్రామసభల్లో నుంచి వచ్చే అర్జీల్లో అనర్హత కలిగిన వాటిని వెంటనే వారికి చెప్పి తొలగించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరిగా జత చేసి ఉండాలన్నారు. తహసీల్దారు జి.జయపాల్, ఆర్ఐ ఏవీ నర్సింహారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తహసీల్దారు జయపాల్, ఎంపీడీవో మాణిక్యరావు

జనవరి 2 నుంచి ...

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి 11 వరకు అన్ని పంచాయతీల్లో అయిదో విడత జన్మభూమి కార్యక్రమ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.మాణిక్యరావు తెలిపారు. జనవరి 2న చాపలమడగు పంచాయతీ, 3న నాయుడుపాలెం, పిడికిటివారిపల్లె, 4న ఇసుకత్రిపురవరం, మానేపల్లి, 5న మర్రివేముల, శతకోడు, 6న కొమరోలు, యండ్రపల్లి, 7న మల్లపాలెం, రాచకొండ, 8న ముటుకుల, 9న కవలకుంట్ల, 10న గంగవరం, 11న పుల్లలచెరువు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. తహసీల్దారు సులోచన, ఈవోఆర్డీ వెంకటరెడ్డిలు మండలస్థాయి బృందం అధ్యక్షులుగా వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.

త్రిపురాంతకం మండలంలో..

జనవరి 2న పాత అన్నసముద్రం, కొత్త అన్నసముద్రం, 3న జి.ఉమ్మడివరం, ముడివేముల, డీవీఎన్ కాలనీ, 4న మేడపి, గణపవరం, ఎండూరివారిపాలెం, 5న ఒడ్డుపాలెం, మిరియంపల్లి, 6న సోమేపల్లి, కంకణాలపల్లి, 7న గొల్లపల్లి, దూపాడు, 8న నడిగడ్డ, కేశినేనిపల్లి, 9న రామసముద్రం, మిట్టపాలెం, 10న వెల్లంపల్లి, విశ్వనాథపురం, లేళ్లపల్లి, 11న రాజుపాలెం, త్రిపురాంతకం పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు గత నాలుగు విడతల్లోని ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

గ్యాస్ సమాచారం

యర్రగొండపాలెం పట్టణం: స్థానిక భవాని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ నమోదు చేసుకున్న వారికి సోమ, మంగళవారాల్లో సరఫరా చేయనున్నట్లు నిర్వాహకులు మహేశ్వరరెడ్డి తెలిపారు. **పెద్దదోర్నాల:** స్థానిక శివమణికంఠ భారత్ గ్యాస్ ఏజెన్సీలో శనివారం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వినియోగదారులకు సోమవారం సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు నిర్వాహకులు రావిక్రింది లక్ష్మీనరసింహారావు తెలిపారు. **పుల్లలచెరువు:** శ్రీ శ్రీనివాస భారత్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని వినియోగదారులు రీఫిల్లింగ్ కోసం సిలిండర్ నమోదు చేసుకున్న వెంటనే సిలిండర్ సరఫరా చేస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

త్రిపురాంతకం: స్థానిక త్రిపుర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 29 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకులు ఎం.బాలగురవారెడ్డి తెలిపారు.

పెద్దారవీడు: స్థానిక జయదీప్ భారత్‌గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ నమోదు చేసుకున్న వెంటనే సిలిండర్ పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈనాడు మీతోడు

మీ సమస్య ఏదైనా దాని పరిష్కారానికి మీకు 'ఈనాడు' తోడుగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా మీరు ఎదుర్కొంటున్న సమస్య, మీ పేరు, గ్రామం తెలుపుతూ మాకు ఫోన్ చేయడమే. సంబంధిత అధికారి దృష్టికి మీ ఇబ్బందిని తీసుకెళ్లి ఆయన సమాధానాన్ని పత్రికలో ప్రచురిస్తాం.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

యర్రగొండపాలెం పట్టణం	8008574129
యర్రగొండపాలెం	8008552658
త్రిపురాంతకం	8008574130
పెద్దదోర్నాల	8008574131
పుల్లలచెరువు	8008574133
పెద్దారవీడు	9949474048

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా సుబ్బారావు



గోళ్ల వెంకట సుబ్బారావు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా యర్రగొండపాలేనికి చెందిన ప్రముఖ వ్యాపారి గోళ్ల వెంకట సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ నెల 24న హైదరాబాద్ వాసవీ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ఆ సంఘం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వంకదార వాసుదేవరావు ప్రకటించినట్లు ఆయన శనివారం తెలిపారు. ఈ క్లబ్ ద్వారా వై.పాలెం, ఇతర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

'ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో భాజపా పాలన'

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పాలన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో సాగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.అరుణ అన్నారు. సీపీఐ అయిదో మండల మహాసభ సందర్భంగా శనివారం స్థానిక పూలసుబ్బయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ పార్టీ నాయకుడు ఖాసీంవలి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ముస్లింలు, ఇతర మైనార్టీలపై దాడులు అధికమయ్యాయన్నారు. నోట్ల రద్దుతో సామాన్యులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ అంటూ బ్యాంకుల్లో డబ్బులు వేయడం లేదని ఆరోపించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో భాజపా ఇంటికి పోవడం ఖాయమన్నారు. ముందుగా నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు కెవి.కృష్ణగౌడ్, టీసీహెచ్.చెన్నయ్య, కె.గురవయ్య, గురునాథం, అయిదు మండలాల కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అరుణ